


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM రాజమహేంద్రవరం fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa,Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-8-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 206 పేజీలు: 8+4 వెల: 6.50



మిస్ యూనివర్స్ ఇండియా కజియా లిజ్‌మెజో 5లో

కేంద్ర కేబినెట్ ప్రక్షాళనకు ముహూర్తం ఖరారు


# ఆన్‌లైన్ సేవలు ఇక సులభతరం

ప్రభుత్వ శాఖల్లో సమర్థత, నాణ్యత

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కోసం డేటా ఇంటిగ్రేషన్

డెంగ్యూ, మలేరియా నివారణకు హాట్‌స్పాట్ల గుర్తింపు

ఆర్టీజిఎస్ సమీక్షలో సిఎం చంద్రబాబు



సోమవారం సచివాలయంలో జరిగిన ఆర్టీజీఎస్ సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,, ఆగస్ట్ 24, ప్రభాతవార్తప్రతినిధి:** ఏ ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే పని లేకుండా సేవలు అందించాలని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు.కృత్రిమ మేధ(ఎఐ) అసిస్టెంట్, డిజి వెరిఫై, డేటా లేక్, బ్లాక్ చెయిన్.. వంటి సాంకేతికతను వినియోగించుకుని ఆన్‌లైన్ సేవలు మరింత సులభతరం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్ మనమిత్ర ద్వారా అందిస్తున్న 1,204 సేవలకు సంబంధించి డేటా ఎంట్రీ సమాచారాన్ని మరింత సంక్షిప్తం చేయాలన్నారు. సర్టిఫికేట్స్ అప్‌లోడ్ చేసే పని లేకుండా డేటా ఇంటిగ్రేషన్ జరగాలని సిఎం స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ సమీక్షలో వివిధ శాఖల పనితీరు, పురోగతి గురించి ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖలు మరింత సమర్థత పెంచుకోవాలని, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రజలకు సేవలు అందించే విషయంలో పారదర్శకత ఉండాలన్నారు.ప్రతి అంశంపైన అధికార యంత్రాంగం శ్రద్ధ పెట్టాలన్నారు.మన ప్రభుత్వ ప్రజలకు సేవలను అత్యంత సులభతరంగా అందించాలనుకుంటున్నదన్నారు. ఈ విషయంలో ఎటువంటి నిర్వహణా లోపం ఉండకూడదన్నారు. ప్రజా ప్రయోజనాంశాలపై అత్యంత శ్రద్ధ చూపించాలన్నారు.మనం సేవలు అందించడంలో సంస్కరణలు తీసుకుని వచ్చాం, అవి సమర్థవంతంగా ఉన్నాయనే సంతృప్తి ప్రజల్లో స్పష్టం కన్పించాలన్నారు.

**క్రాప్ అలర్ట్‌లపై పర్యవేక్షణ..**

ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో పంటల పరిస్థితిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈసారి వ్యవసాయ దిగుబడులు సాధారణం కన్నా 20 శాతం తగ్గే అవకాశం ఉందని తెలిపారు. అదే విధంగా కృష్ణా డెల్టాకు సెప్టెంబర్ నెలాఖరు వరకు పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు అందించగలమని చెప్పారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు సమృద్ధిగా నీరందించేలా చూడాలని సిఎం ఆదేశించారు. ఇప్పటికే సాగు మొదలు పెట్టని చోట వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు ప్రోత్సహించాలని నిర్దేశించారు. రైతులకు ఎప్పటికప్పుడు క్రాప్ అలర్ట్ పంపడంతో పాటు దానిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఇందుకోసం ఎపిటిఎస్ అనలిటిక్స్ కూడా వినియోగించుకుని... అవేర్‌తో సమ న్వయం చేసుకోవాలని సిఎం అన్నారు. మంచి >>2

## ఖరగ్‌పూర్ నుంచి అమరావతి దాకా.. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కారిడార్

**విజయవాడ, ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి తూర్పు భారతదేశంతో రవాణా అనుసంధానాన్ని మరింత పటిష్ఠం చేసేలా పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్ నుంచి అమరావతి వరకు 1,107 కిలోమీటర్ల సుదీర్ఘ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కారిడార్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.ఈ హైవేకు అనుమతినిచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి సిఎం చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ చొరవతో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ఆమోదం లభించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు "ఎక్స్" వేదికగా వెల్లడించారు. ప్రధాని మోదీ, కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీలకు ఎపి ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సహకారంతో రాష్ట్రానికి అవసరమైన నేషనల్ హైవేలు, హైస్పీడ్ కారిడార్లు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలను తీసుకొస్తోంది. తాజాగా రాష్ట్రానికి మరో హైస్పీడ్ కారిడార్‌కు సంబంధించి కీలక ముందడుగు పడింది. ఉత్తరాంధ్ర నుంచి అమరావతిని కనెక్ట్ చేసేలా.. పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్ టు అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నాలుగు లైన్ల హైస్పీడ్ కారిడార్ అలైన్‌మెంట్‌కు కేంద్రం నుంచి ఆమోదం వచ్చింది. నాలుగు రాష్ట్రాల్లో కలిపి ఈ కారిడార్ 1,107 కిలోమీటర్లు కాగా.. ఆంధ్రప్రదేశ్ పరిధిలో మొత్తం 457 కిలోమీటర్లు ఉంది. ఏపీలో అంచనా వ్యయం రూ.32 వేల కోట్లుగా ఉంది.. ఈ కారిడార్ గిరిజన ప్రాంతాలు, గోదావరి జిల్లాలు, అమరావతిని కనెక్ట్ చేయనుంది.ఏపీలోని 457 కిలోమీటర్ల నాలుగు వరుసల హైస్పీడ్ రోడ్ కారిడార్‌కు సంబంధించి.. సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మార్గాన్ని మోర్త్ ( కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ) ఏఏసీ (అలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ) ఆమోదించింది. ఈ కారిడార్ పశ్చిమబెంగాల, జార్ఖండ్, ఒడిశా మీదుగా ఎపి వరకు ఉంటుంది. రాష్ట్రానికి సంబంధించిన అలైన్‌లెమంట్ విషయానికి వస్తే.. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, >>2

## తాగు నీటికే కృష్ణా జలాలు

నీటి వాటాలపై ఇంకా నిర్ణయం తీసుకోని కెఆర్‌ఎంబి త్రిసభ్యకమిటీ

సెప్టెంబరు 4న మరోసారి భేటీ

**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణానదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ నీటి వాటాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే వాయిదా పడింది.హైదరాబాద్ జలసౌధలో కెఆర్‌ఎంబి సభ్య కార్యదర్శి సతీశ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. భేటీకి తెలంగాణ ఇఎన్సీ రమేశ్ బాబు, ఎపి తరపున ఇఎన్సీ నరసింహామూర్తి హాజరయ్యారు. నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి పంపిణీపై ఈ భేటీలో చర్చలు జరిపారు.ఈ వివరాలను ఎపి ఇఎన్‌సీ నరసింహామూర్తి మీడియాకు తెలిపారు. రాయల సీమ, పల్నాడు ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకుగానూ నీటి విడుదలపై చర్చించేందుకు త్రిసభ్య కమిటీని సమావేశ పర్చినట్లు వివరించారు. సమావేశంలో . శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి ఈ యేడాది మొత్తం నీటి వాడకంపై తెలంగాణ ప్రతిపాదించగా ఎపి తరపున అక్టోబర్ వరకే ప్రతిపాదించినట్లు తెలిపారు. అప్పటివరకు 47 టిఎంసిలు అడిగామని ఇందుకు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు చెప్పారు. రెండురాష్ట్రాల వాటా అంశం చర్చకు రాలేదని సెప్టెంబర్ 4న మరోసారి సమావేశమై చర్చిస్తామని ఇఎన్‌సీ నరసింహామూర్తి స్పష్టం చేశారు. ఎల్ నినో దృష్ట్యా శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి కృష్ణా జలాలను తాగునీటినే వాడుకోవాలని సూత్రప్రాయంగా నిర్ణయించామని తెలిపారు. యేడాది మొత్తం నీటి వాడకంపై తెలంగాణ ప్రతిపాదించింది. మేం అక్టోబర్ వరకే ప్రతిపాదించామన్నారు. అప్పటివరకు 47 టీఎంసీలు అడిగాం, సూత్రప్రాయంగా అంగీకరించారు. రెండు రాష్ట్రాల వాటా అంశం చర్చకు >>2



సోమవారం ముసునూరులో నూతన మొక్కజొన్న వంగడాన్ని ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తదితరులు

## సరికొత్త మొక్కజొన్న వంగడం

ముసునూరులో ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సిఎం చంద్రబాబు

గోర్మే పాప్‌కారన్ విదేశాలకు ఎగుమతి

100 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా

**ఏలూరు/ ముసునూరు, ఆగష్టు, 24 : ప్రభాతవార్త :** ఏలూరు జిల్లా ముసునూరులో గోర్మే పాప్‌కార్నికా సంస్థ ఆధ్వర్యంలో జన్యుపరంగా మార్పు చేయని (నాన్‌బీటీ) మొక్కజొన్న వంగడాన్ని భారత ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ గోర్మే పాప్‌కార్నికా సంస్థ ఆవరణలో సోమవారం పండుగ వాతావరణంలో జరిగిన కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబులతో కలిసి ఆవిష్కరించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ఉప రాష్ట్రపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి సి.పి రాధా కృష్ణన్ మాట్లాడుతూ విదేశీ హైబ్రిడ్ విత్తనాల దిగుమతులపై ఆధారపడటాన్ని >>2

## ఇన్‌సర్వీస్ టీచర్ల కోసం స్పెషల్ టెట్ నోటిఫికేషన్ జారీ

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం టెట్ అర్హత సాధించేందుకు అవకాశం

ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 24 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు

**విజయవాడ.ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగంలో కొనసాగుతున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో, తప్పనిసరి అర్హతగా మారిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను ఇన్‌సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేకంగా నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సోమవారం స్పెషల్ ఎపిటెట్ ఆగస్టు 2026 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 2011కు ముందు నియమితులై, ఇంకా టెట్ అర్హత సాధించని వేలాది మంది ఉపాధ్యాయులకు ఈ పరీక్ష ద్వారా అర్హత పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. దీనికి సంబంధించిన వివరాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా 'ఎక్స్'"లో వెల్లడించారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించడం తప్పనిసరి అని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసిన విషయం తెలిసిందే. 2025 సెప్టెంబర్ 1న సివిల్ అప్పీల్ నెం.1385/2025లో ఇచ్చిన తీర్పు, ఆ తర్వాత 2026 మే 29న రివ్యూ పిటిషన్లపై వెలువరించిన ఉత్తర్వుల ప్రకారం, 2028 ఆగస్టు 31వ తేదీలోగా ఇన్‌సర్వీస్ టీచర్లు ఈ అర్హతను తప్పనిసరిగా పొందాలని సర్వోన్నత న్యాయస్థానం గడువు విధించింది. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఆచరణాత్మక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, ఈ గడువును పొడిగించింది.

అంతేకాకుండా, ఉపాధ్యాయులకు తగిన అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి టెట్ పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రత్యేక టెట్ నిర్వహణకు చర్యలు చేపట్టింది.ఈ ప్రత్యేక టెట్ కేవలం 2011కు ముందు నియమితులై, ప్రస్తుతం ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఏపీ రెసిడెన్షియల్, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ సంక్షేమ సొసైటీల పాఠశాలలు, ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఇన్‌సర్వీస్ టీచర్లకు (రెగ్యులర్, మినిమమ్ టైమ్ స్కేల్) మాత్రమే వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, ఈ పరీక్షలో సాధించిన అర్హత భవిష్యత్తులో >>2

## గుంటూరు కార్పొరేషన్‌లో భారీగా ఎసిబి దాడులు

156 పనులకు సంబంధించి ఫైల్స్ స్వాధీనం

నేడు కూడా తనిఖీలు కొనసాగే అవకాశం

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 24, ప్రభాతవార్త :** గుంటూరు నగరంలోని కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు సోమవారం మెరుపు దాడులు నిర్వహించారు. ఎసిబి డీఎస్పి ప్రతాప్ కుమార్ నేతృత్వంలో మధ్యాహ్నం 12 గంటలకు కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగానికి వచ్చిన అధికారులు సాయంత్రం 8 గంటల వరకు రికార్డులను స్వాధీనం చేసుకొని, కంప్యూటర్లు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా 2017 నుంచి 2025 వరకు కార్పొరేషన్ ఇంజనీర్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులకు సంబంధించి, సిసి రోడ్లు, డ్రైన్లు, వాటర్ పైప్ లైన్ ఇంటర్ లింకేజీ పనులు, పైప్ లైన్ లీకేజీ మరమత్తు పనులకు సంబంధించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ పనులకు సంబంధించి భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయని, కాంట్రాక్టర్లతో కొమ్మక్కై అధికారులు టెండర్ల పర్సంటేజీలు మార్చేసి భారీ అవకతవకలకు పాల్పడ్డారని వచ్చిన ఆరోపణలపై ఈ దాడులు నిర్వహించడం జరుగుతుందని ఎసిబి డి.ఎస్.పి వివరించారు. అయితే ఈదాడుల్లో భాగంగా అధికారులకు సంబంధించి లంచాల రూపేణా నగదు వంటివి దొరకలేదని, కేవలం అభివృద్ధి పనులకు సంబంధించి చేసిన అవకతవకలపై రికార్డులు, ఆన్లైన్ టెండర్ విధానం, తదితర అంశాలకు సంబంధించి పూర్తి దర్యాప్తు కొనసాగుతుందని వివరించారు.

**ఈ దాడులు నేడు కూడా కొనసాగుతాయి**

గుంటూరు కార్పొరేషన్‌లోని ఇంజనీరింగ్ విభాగంలో సోమవారం దాడులు నిర్వహించడం జరిగిందని, ఈ దాడులు మంగళవారం కూడా కొనసాగుతాయని >>2



## మాజీ మంత్రి కారుమూరికి జ్యుడీషియల్ రిమాండ్

చంచల్‌గూడ జైలుకు తరలింపు

ఎపి లిక్కర్ స్కాం కేసు

**విజయవాడ.ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీ నేత, మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు హైదరాబాద్ కోర్టు 2 వారాలు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కారుమూరిని ఇడి అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఎపి మద్యం రవాణా కుంభకోణంలో కారుమూరి నిందితుడిగా ఉన్నారు.నిన్న ఆయనను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్ నిమిత్తం హైదరాబాద్ కోర్టులో హాజరు పరిచారు. కారుమూరి నాగేశ్వర రావు రిమాండ్‌పై ఇరువర్గాల న్యాయవాదులు తమ వాదనలు న్యాయస్దానంలో విన్పించారు.. రెండు గంటలకుపైగా వాదనలు కొనసాగాయి. కారుమూరి రిమాండ్‌పై తీర్పును న్యాయమూర్తి రిజర్వ్ చేసినట్లు తొలుత ప్రకటించారు. ఈ రోజు సాయంత్రం కారుమూరికి రిమాండ్ విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది.ఆ వెంటనే కారుమూరి న్యాయవాది ఆయనకు బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేసారు. న్యాయస్దానం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టవలసిఉంది. ఇక కోర్టు హాజరు పరిచే ముందు గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన తరువాత కారుమూరిని ఇడి కోర్టులో హాజరు పరిచారు. అయితే ముందస్తు అరెస్టును ఊహించి మిత్రుడి ఇంట్లో తలదాచుకున్న కారుమూరి నాగేశ్వర రావును ఇడి అధికారులు ఆదివారం మజీద్‌బండలోని షార్క్‌హైట్స్ అపార్ట్‌మెంట్‌లో అదుపులోకి తీసుకు >>2

## నూకరాజు ఆత్మహత్య కేసు నిందితుడు సాదిక్ అరెస్టు

మతమార్పిడి బెదరింపులపై సమగ్ర దర్యాప్తు: ఎస్పీ బిందు మాధవ్



**కాకినాడ, ఆగస్టు 24, ప్రభాత వార్త:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనాత్మకంగా మారిన పిఠాపురం పంచాయతీరాజ్ శాఖ ఎఇ టిల్లపూడి నూకరాజు, అతని భార్య మీనా, కుమార్తె కొవ్వూరి సౌజన్య ఆత్మహత్యకు కారకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు షేక్ సాదిక్ ఖాన్‌ను కాకినాడ జిల్లా పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన సంచలన హత్య కేసుపై సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి బిందుమాధవ్ పలు సంచలనా త్మక విషయాలను వెల్లడించారు. కేసుతీవ్రతను దృష్టిలో ఉంచు కుని జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ప్రత్యేక చొరవతో ఆరు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. ఈ నెల 16వ తేదీన ఉదయం 10.30 నుంచి 11.30 గంటల మధ్య జగదీష్ రెడ్డి భార్య కొవ్వూరి సౌజన్య, ఆమె తల్లిదండ్రులు తిల్లపూడి నూకరాజు, మీనా, కుమారుడు రియాన్స్ కార్తికేయ రెడ్డి రాజమహేంద్రవరం వద్ద గోదావరి నదిలో జరిగిన ఘటనకు సంబంధించిన సమాచారం పోలీసుల దృష్టికి >>2

## గురుకుల పాఠశాల ఉద్యోగుల రిటైర్మెంట్ పెంపు

**విజయవాడ.ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది అందరికీ వర్తించేలా గిరిజన సంక్షేమశాఖ జీవో 33ను జారీ చేసింది. జులై 2026 నుంచి రిటైర్ అయ్యే ఉద్యోగుల సర్వీసును కొనసాగించేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఈ వయోపరిమితి పెంపునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కీలక షరతులను విధించింది. ఉద్యోగులు రిటైర్ అయి, తిరిగి విధుల్లో చేరే మధ్య కాలానికి ఎలాంటి వేతన బకాయిలు చెల్లించబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే అప్పటికే రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద గ్రాట్యుటీ, పెన్షన్ పొంది ఉంటే, జీవో 45 ప్రకారం వాటిని రికవరీ చేయాలని పేర్కొంది. ఈ నిర్ణయానికి అనుగుణంగా సర్వీస్ రూల్స్‌లో అవసరమైన సవరణలు చేయాల్సిందిగా గురుకులం సెక్రటరీని ప్రభుత్వం ఆదేశించింది. 2026-27 బడ్జెట్ పరిధిలోనే వ్యయం చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అవసరమైతే 28 మంది బోధన సిబ్బందికి కూడా రూ.4.12 కోట్ల అదనపు నిధుల ప్రతిపాదన చేస్తామని తెలిపింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ జీవో ఎంఎస్ నంబర్ 33ను జారీ చేసింది.


ఇరాన్‌లో భారీ గ్యాస్ నిక్షేపాలు! 2లో



సోమవారం ఎస్వీబిసి కార్యాలయంలో ఉద్యోగులతో ముఖాముఖి సమావేశం నిర్వహిస్తున్న బి. శ్రీధర్ వర్మ

# జాతీయస్థాయిలో ఉన్నతస్థాయికి ఛానల్

## -ఎస్వీబిసి ఛైర్మన్ శ్రీధర్‌వర్మ

**తిరుమల, ఆగస్టు 24 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీబిసిని భవిష్యత్తులో మరింత వినూత్నమైన కార్యక్రమాలతో శ్రీవారి వైభవాన్ని, భారతీయ సనాతన హైందవ ధర్మాన్ని, దేశ విదేశాల్లోని భక్తులకు చేరవేసేలా కార్యక్రమాలను రూపొందించాలని ఎస్వీబిసి ఛైర్మన్ బి.శ్రీధర్‌వర్మ అధికారులకు సూచించారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను ఆధునిక సాంకేతికతను వినియోగించి ఛానల్ ప్రసారాలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఎస్వీబిసిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లాలంటే ప్రతిఉద్యోగి సమిష్టి కృషి చేయాలని, అంకితభావంతో సేవలందించాలని శ్రీధర్ వర్మ పిలుపునిచ్చారు. శ్రీవారి వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించడమే లక్ష్యంతో సరికొత్త కార్యక్రమాలతో మరో స్థాయికి తీసుకెళ్దామన్నారు.

ఎస్వీబిసిఛైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బి. శ్రీధర్ వర్మ సోమవారం సాయంత్రం ఎస్వీబిసి కార్యాలయంలో ఉద్యోగులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఉద్యోగిని వ్యక్తిగతంగా పరిచయం చేసుకుని, వాళ్ల నిర్వహిస్తున్న విధులు, బాధ్యతలు, శాఖల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎస్వీబిసి ఛానల్ ప్రసారాలపై సమీక్ష నిర్వహించిన శ్రీధర్ వర్మ, శ్రీవారి మహిమను ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులకు చేరవేయడంలో ఎస్వీబిసి విశిష్ట సేవలు అందిస్తోందని ప్రశంసించారు. భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచిన ఈ ఛానల్ ఇప్పటికే భక్తుల ఆదరణను పొందిందని పేర్కొన్నారు.

# స్పెషల్ టెట్ నోటిఫికేషన్ జారీ

>> ఎలాంటి ప్రత్యక్ష నియామకాలకు (డైరెక్ట్ రిక్రూట్‌మెంట్) ఉపయోగపడదని నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలి. ఈ స్పెషల్ టెట్‌లో ఉత్తీర్ణత సాధించడం ద్వారా కేవలం ప్రస్తుత ఉద్యోగ కొనసాగింపు, తదుపరి ప్రమోషన్లకు మాత్రమే అర్హత లభిస్తుంది. ఈ టెట్ సర్టిఫికెట్ వ్యాలిడిటీ జీవితకాలం ఉంటుంది. స్పెషల్ ఎపిటెట్ రెండు పేపర్లుగా ఉంటుంది. 1 నుంచి 5వ తరగతి వరకు బోధించే సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ), ఎల్ఎఫ్ఎల్ హెడ్ మాస్టర్లు పేపర్‌కు హాజరుకావాలి.డి.ఇఐ.ఈడీతో పాటు బిఈడి అర్హత ఉన్న ఎస్జీటీ కూడా పేపర్ -1 రాయవచ్చు. ఇక 6 నుంచి 8వ తరగతి వరకు బోధించే స్కూల్ అసిస్టెంట్లు, టిజిటిలు, లాంగ్వేజ్ పండిట్లు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పేపర్-11 కు హాజరుకావాల్సి ఉంటుంది. ప్రాథమికోన్నత పాఠశాలల హెడ్ మాస్టర్లుగా పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు తమ సంబంధిత సబ్జెక్టులో పేపర్-11 రాయాలి. డి.ఇఐ.ఈడీతో పాటు బిఈడి రెండూ ఉన్న అభ్యర్థులు పేపర్-1, పేపర్- 11 రెండింటికీ హాజరుకావాలనుకుంటే, వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రత్యేక నోటిఫికేషన్ పోమవారం విడుదల అయింది.ఆన్‌లైన్ దరఖాస్తులు, ఫీజు చెల్లింపుకు ఈ నెల 25 నుంచి 24 సెప్టెంబర్ వరకు అవకాశం ఉంటుంది.ఆన్‌లైన్ మాక్ టెస్ట్ 25 సెప్టెంబర్ నుంచి అందుబాటులో ఉంటుంది.హాల్ టికెట్లు డౌన్‌లోడ్‌కు 5 అక్టోబర్ నుంచి పరీక్షల తేదీలు గమనిస్తే 11 అక్టోబర్ 2026 నుంచి 21 అక్టోబర్ 2026 వరకు జరుగుతాయి, 15 నవంబర్‌లో ఫలితాలు విడుదలవుతాయి.

# గంట వర్షానికే గురుగ్రామ్ అతలాకుతలం

**గురుగ్రామ్, ఆగస్టు 24:** హర్యానాలోని గురుగ్రామ్‌లో భారీ వర్షం నగరాన్ని మరోసారి అతలాకుతలం చేసింది. కేవలం గంటపాటు కురిసిన వర్షంతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ఉద్యోగస్తులు, విద్యార్థులు నరకయాతన పడ్డారు. ఇళ్లకు చేరుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. కార్యాలయాల్లో ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోమ్ చేసుకునేలా చూడాలని సూచించింది. అలాగే పాఠశాలల్లో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని ఆదేశించింది.

గురుగ్రామ్‌లో మధ్యాహ్నం 1.30 గంటల వరకు సుమారు 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది. రాజీవ్ చౌక్, ఇఫ్కో చౌక్, రైల్వే రోడ్, సెక్టార్55, ఓల్డ్ ఢిల్లీ రోడ్, మెహ్రౌలీ రోడ్, బసాయ్ రోడ్ తదితర ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. భారీ వర్షంతో నగరంలోని ప్రధాన రహదారులు నీటితో నిండిపోయాయి. వరద నీటిలో వాహనాలు చిక్కుకోవడంతో పలువురు వాహనదారులు వాటిని అక్కడే వదిలి వెళ్లాల్సి వచ్చింది. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పాఠశాలల నుంచి ఇళ్లకు తిరిగి వెళ్తున్న విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లపై భారీగా నీరు నిలవడంతో బురద నీటిలో కనిపించని ఓపెన్ మ్యాన్‌హోల్స్‌లో పడకుండా ఉండేందుకు ఎత్తైన బస్‌స్టాప్‌లు, ఇతర సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. వర్షం కారణంగా ఢిల్లీజైపూర్ ఎక్స్‌ప్రెస్‌వేపై కూడా ట్రాఫిక్ తీవ్రంగా ప్రభావితమైంది. రహదారి వెదల్పుగా ఉన్నప్పటికీ వాహనాలు నెమ్మదిగా కదిలాయి. సాధారణంగా సిగ్నేచర్ టవర్ నుంచి హీరో హోండా చౌక్ వరకు సుమారు 15 నిమిషాల్లో చేరుకునే ప్రయాణానికి కనీసం 50 నిమిషాలు పట్టిందని ప్రయాణికులు తెలిపారు. సైబర్ హబ్ సమీపంలో గేట్‌వే టవర్ మెట్రో స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఎక్స్‌ప్రెస్‌వేలోని కొంత భాగం పూర్తిగా నీట మునిగిపోయింది. దీంతో నగరంలోని ప్రధాన రహదారుల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గురుగ్రామ్‌ను మిలీనియం సిటీగా పిలుస్తారు. భారీ అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాల్స్, ప్రముఖ కంపెనీల కార్యాలయాలకు ఈ నగరం ప్రసిద్ధి. అయితే కొద్దిపాటి భారీ వర్షం కురిసినా మౌలిక వసతులు దెబ్బతినడం, రోడ్లు జలమయం కావడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాకాలంలో ఇప్పటికే వరదలకు గురవ్వకపోయినా ప్రాంతంగా మారిన షీట్ల మాతా రోడ్ కూడా తాజా వర్షాలతో తీవ్రంగా ప్రభావితమైంది. ప్రతి సారి కొంత ఎక్కువ సమయం వర్షం కురిసినప్పుడు నగర మౌలిక వసతులు కుప్పకూలుతున్నాయని గురుగ్రామ్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఇరాన్‌లో భారీ గ్యాస్ నిక్షేపాలు!

**టెహ్రాన్, ఆగస్టు 24:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితులు ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న చమురు డిమాండ్ నేపథ్యంలో తాజాగా ప్రపంచ దేశాలకు ఇరాన్‌నుంచి భారీ ఉపశమనం లభిస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఇరాన్‌కు భారీ ఊరట కలిగించే వార్త ఒకటి వచ్చింది. అమెరికా ఆంక్షలతోపాటు, ఇంధన ఎగుమతులపై ఆంక్షలు, యుద్ధ పరిస్థితులతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఇరాన్‌కు భారీ గ్యాస్ నిక్షేపం వెలుగులోకి రావడం ఊరటనిచ్చే పరిణామంగా మారింది. దక్షిణ ఫార్స్ ప్రావిన్స్‌లో సమీపంలోని ఒక ప్రదేశంలో ఏకంగా 7.5 ట్రిలియన్ క్యూబిక్ ఫీట్లకు పైగా సహజ వాయువు ఉన్నట్లు గుర్తించినట్లు ఇరాన్ చమురు మంత్రి మొహ్సెన్ పాక్‌నెజాద్ వెల్లడించారు. ఈ చమురు నిక్షేపాలు వాణిజ్యపరంగా వినియోగించుకోవడం ఇరాన్‌కు అంత సులభం కాదని నిపుణులు భావిస్తున్నారు. దేశీయంగా గ్యాస్ వినియోగం అధికంగా ఉండటంతో పాటు పాతబడిన మౌలిక వసతులు, విదేశీ పెట్టుబడులపై ఆంక్షలు, ఆధునిక టెక్నాలజీ వంటి సమస్యలు ఇరాన్ ఇంధన రంగాన్ని తీవ్రంగా వేధిస్తున్నాయి. తాజాగా గుర్తించిన నిక్షేపం ఈ పరిస్థితుల్లో ఇరాన్‌కు దీర్ఘకాలికంగా కీలకంగా మారే అవకాశం ఉంది. ఆ గ్యాస్‌ను వెలికితీసి మార్కెట్‌కు తీసుకురావాలంటే భారీ పెట్టుబడులు, ఆధునిక డ్రిల్లింగ్ టెక్నాలజీ కావాల్సి ఉంటుంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో అంతర్జాతీయ సంస్థల నుంచి పెట్టుబడులు, టెక్నికల్ సహకారం పొందడం ప్రస్తుతం ఇరాన్‌కు సవాలుగా మారింది. తాజా ప్రకటనకు ముందు గడిచిన అక్టోబర్‌లో దక్షిణ ఇరాన్‌లోని పజాన్ గ్యాస్ ఫీల్డ్‌లో 10 ట్రిలియన్ క్యూబిక్ ఫీట్ల గ్యాస్ ఉన్నట్లు తేలింది. కనీసం 200 మిలియన్ బ్యారెళ్ల మేర చమురు కూడా ఉన్నట్లు ఇరాన్ ప్రకటించింది. అందులో సుమారు 7 ట్రిలియన్ క్యూబిక్ ఫీట్ల గ్యాస్‌ను వెలికితీయగలమని అంచనా వేసింది. అక్కడ ఉత్పత్తి ప్రారంభించేందుకు దాదాపు 40 నెలలు పట్టవచ్చు అప్పట్లోనే ఇరాన్ అధికారులు తెలిపారు. ఇరాన్ ప్రస్తుతం తన గ్యాస్ అవసరాల్లో ప్రధానంగా ఖతార్‌తో పంచుకుంటున్న సౌత్ పార్స్ గ్యాస్ ఫీల్డ్‌పై ఆధారపడుతోంది. యుద్ధ పరిస్థితుల్లో ఈ కీలక ఇంధన మౌలిక వసతులపై దాడులు జరగడం ఆ దేశ ఇంధన రంగాన్ని మరింత ఒత్తిడికి నెట్టింది. ఇరాన్ చమురు ఎగుమతులపై ఆంక్షలు మరింత కఠినంగా మారడంతో దేశానికి విదేశీ మారకద్రవ్య ఆదాయాన్ని ప్రభావం పడుతోంది. 2026 మార్చి నుంచి జూలై మధ్య చమురు విక్రయాల ద్వారా వచ్చిన 7.5 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్య ఆదాయాన్ని ఇరాన్ కేంద్ర బ్యాంకుకు బదిలీ చేసినట్లు స్థానిక మీడియా పేర్కొంది.

# సరికొత్త మొక్కజొన్న వంగడం

>> తగ్గించి, స్వదేశీ పరిజ్ఞానంతో ఆహార భద్రత మరియు స్వయం సమృద్ధిని సాధించడం అత్యంత కీలకమైన అంశం అన్నారు. భారతదేశం భవిష్యత్తులో పాప్‌కార్న్ దిగుమతి చేసుకోకుండా ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతోందని ప్రశంసలు అందుతున్నాయన్నారు. దేశ జీడీపీ, స్థూల విలువ జోడింపు లో వ్యవసాయ రంగం సుమారు 1/5వ వంతు వాటాను కలిగి ఉండటమే కాకుండా, 46.1 మందికి ఉపాధిని, 55 జనాభాకు జీవనాధారాన్ని అందిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోందన్నారు. ఈ క్రమంలో 8 రాష్ట్రాల్లో దాదాపు 17,500 మంది రైతులు 40,000 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తూ, ఎటువంటి అప్పుల ఊబిలో పడకుండా మంచి లాభాలు ఆర్జిస్తున్నారన్నారు. రైతు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎంకిసాన్, పిఎం ఫసల్ బీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డులతో పాటు మహిళా సంఘాలకు ఆధునిక సాంకేతికతను జోడించే నమో డ్రోన్ దీదీ వంటి పథకాలు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయన్నారు. అదే సమయంలో, వ్యవసాయాభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయుడు రైతు బజార్లు, సహజ వ్యవసాయం వంటి విధానాల ద్వారా అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమన్నారు. దీనికితోడు భవిష్యత్ వ్యవసాయ సమృద్ధి కోసం దక్షిణ భారత నదుల అనుసంధానం మరియు అన్ని జిల్లాలకు సమగ్ర సాగునీటి సౌకర్యాల కల్పన అత్యంత ఆవశ్యకమని స్పష్టమవుతోందన్నారు. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ముసునూరులో దేశంలోనే మొట్టమొదటి నాణ్యమైన, నాన్‌జీఎమ్ఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాలను ఆవిష్కరించడం మరియు 8 రాష్ట్రాల ఉత్తమ రైతులకు సన్మానం చేయడం సంతోషకరమన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, ఆహార భద్రతకు రైతాంగమే వెన్నెముక అని, 140 కోట్ల మందికి అన్నం పెడుతూ 45 శాతం మందికి వ్యవసాయ రంగం ఉపాధి కల్పిస్తోందని గుర్తుచేశారు. వరి, గోధుమల తర్వాత మొక్కజొన్న దేశంలో 3వ అతిపెద్ద పంటగా నిలుస్తోందని, ఎల్‌నినో వంటి వాతావరణ సవాళ్లను తట్టుకునేలా పరిశోధనలు మరింత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భారతీయ వాతావరణానికి అనువైన హైబ్రిడ్ విత్తనాలను అభివృద్ధి చేసి, ఐసిఎఆర్ ప్రశంసలు పొందిన గౌర్మెట్ పాప్‌కార్నికా సంస్థను అభినందించారు. ఈ సంస్థ 8 రాష్ట్రాల్లోని 17,500 మందికి పైగా రైతులతో 39,500 ఎకరాల్లో సాగుచేస్తూ, గతంలో అర్జెంటీనా, బ్రెజిల్‌లకు వెళ్లే ఆదాయంలో 70 శాతం నేరుగా మన భారతీయ రైతులకు దక్కేలా చేస్తోందని, తద్వారా 100 మిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేస్తోందని కొనియాడారు. అరకు కాఫీ లాగే ఈ పాప్‌కార్న్ కూడా ప్రపంచ స్థాయి బ్రాండ్‌గా ఎదగాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. సిఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ మన రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విలువ జోడించే ప్రక్రియను చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు పిలుపునిచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియ ద్వారా ఉత్పత్తులకు విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలిగి సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని సీఎం స్పష్టం చేశారు. ఏ ."రైతులపై ఉన్న ప్రేమ, అభిమానంతో ఏలూరు జిల్లాకు వచ్చి రైతులు పండిస్తున్న జన్యుమార్పిడి జరగని మొక్క జొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారన్నారు. గార్మె పాప్ కార్న్ సంస్థ భారత నేలపైనే దేశీయంగా జన్యుమార్పిడి జరగని విత్తనాలను రైతులతో కలిసి ఉత్పత్తి చేస్తోంది. మన నూజివీడు గడ్డ నుంచే పండే పాప్ కార్న్ మొక్క జొన్న దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతుంది. గార్మె పాప్ కార్న్ దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ఉత్పత్తి సంస్థగా అవతరించింది. ఈ సంస్థ ప్రతినిధుల్ని అభినందిస్తున్నాను. 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ నాన్ జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న ఉత్పత్తి చేస్తున్నారు. నూజివీడు సమీపంలోని ముసునూరు వద్ద దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయటం సంతోషదాయకం. దేశవ్యాప్తంగా పాప్ కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉన్న గార్మె సంస్థకు అభినందనలు తెలిపారు.. యాంత్రీకరణ, విత్తనాలు, సాగులో సాంకేతికత, రైతుల నుంచి మొక్క జొన్న కొనుగోలు ఇలా అన్నీ వ్యవస్థీకృతంగా ఉన్నాయన్నారు. ఇప్పటి వరకూ మనం కొనుగోలు చేసిన పాప్ కార్న్‌పై పెద్ద ఎత్తున బ్రెజిల్ సహా ఇతర దేశాలకు వెళ్లింది. ఇక నుంచి మన దేశంలోనే ఈ సంపద ఉంటుందని,. ఒక్క ఆసియానే కాదు గ్లోబల్ మార్కెట్ కు కూడా మన పాప్ కార్న్ ఎగుమతి కావాలన్నారు. ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ తాగేలా రైల్వే స్టేషన్లలోనూ కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతామన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన పంటలకు విలువ జోడించి ఎగుమతి చేయాలన్నదే మా లక్ష్యం. పసుపు, మిరప, మొక్క జొన్న, ఆక్వా తదితర ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌కు చేరాలి. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెస్ చేసి విలువ జోడించి ఓ మంచి బ్రాండ్‌తో అంతర్జాతీయ మార్కెట్లకు తరలిద్దాం. అప్పుడే విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుంది." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ప్రాసెసింగ్ పెరిగితేనే ఉత్పత్తులకు విలువ**

"ప్రస్తుతం మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న వాటిలో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేయగలుగుతున్నాం. ప్రాసెసింగ్ పెంచితే అధిక సంపదను ఆర్జించే ఆవకాశం ఉంటుంది. ప్రత్యేకించి యువత ఈ రంగంపై దృష్టి పెట్టాలి. ప్రతి కుటుంబంలో ఓ పారిశ్రామిక వేత్త రావాలి. మన వద్ద ఉత్పత్తి అయ్యే వాటిని గ్లోబల్ ప్రాడెక్ట్సుగా అభివృద్ధి చేయాలి. ఆహారపు అలవాట్ల అనుగుణంగా పంటలు కూడా మారాలి. నూజివీడు వద్ద ఇప్పుడు పామాయిల్, కోకో ఆక్వా లాంటి వాణిజ్య పంటలు పెరిగాయి. వ్యవసాయంతో పాటు ఉద్యాన పంటల్లో మనం అగ్రగామిగా మారాం. వచ్చే 2030 యేళ్లలో ఎలాంటి పంటలు ఉండాలి, ఎలాంటి ఆర్థిక వ్యవస్థ ఉండాలో మనం నిర్దేశించు కుందాం. రాయలసీమను కూడా ఉద్యాన పంటల హబ్‌గా మార్చేలా కార్యాచరణచేపట్టాం. ఈ యేడాది ఎల్ నినో ప్రభావం ఉన్నా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి పంటలను కాపాడాం. చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేస్తే ఈ ప్రాంత భవిష్యత్తు కూడా మారుతుంది. వెలిగొండ ప్రాజెక్టును ఈ నెలాఖరులోనే ప్రారంభించి మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాకు నీరు ఇస్తాం. నీటి భద్రత సాధించి ప్రతి ఎకరాకూ నీరు ఇచ్చేలా చర్యలు చేపడతాం. దేశం అంతా నదుల అనుసంధానం జరిగి నీటి సద్వినియోగం జరగాలన్నది ఎన్డీఏ ప్రభుత్వ ఆలోచన. గోదావరి కృష్ణా, తుంగభద్ర, పెన్నా కావేరీ నదులను అనుసంధానించటం ద్వారా 4 రాష్ట్రాల్లో సమస్య పరిష్కారం అవుతుంది. గంగా, మహానది, గోదావరి నదుల్ని కూడా అనుసంధానించుకుంటే వేల టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోగలం. అప్పుడు దేశానికి తిరుగులేదు. నీటి భద్రత సాధిస్తే దేశ అభివృద్ధి అన్‌స్టాపబుల్." అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# కృష్ణా జలాలు

>> రాలేదని తెలిపారు. సెప్టెంబర్ 4న మళ్లీ సమావేశమై చర్చిస్తామన్నారు.తొలుత ఈ నెల 13న సమావేశం అయ్యేందుకు తేదీని ఖరారు చేశారు. తర్వాత 17కు వాయిదా పడింది. ఆ సమయంలో ఎపి అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మరోసారి వాయిదా పడింది. దీంతో నేడు ఈ భేటీని నిర్వహించారు. శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నీటినిల్వలు, రెండు రాష్ట్రాల అవసరాలపై చర్చించారు. తాగునీటి కోసం చెరిసగం వాడుకోవాలని సమావేశంలో ప్రస్తావించింది. అయితే ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా సెప్టెంబర్4న మరోసారి భేటీ కావాలని నిర్ణయించారు.

# బ్రిక్స్ అధినేతల సమావేశానికి భారత్‌కు వస్తున్న జిన్‌పింగ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** ఢిల్లీలో సెప్టెంబర్‌లో బిక్స్ శిఖరాగ్ర సమావేశాలలో పాల్గొనేందుకు భారత్‌కు వస్తున్న జిన్‌పింగ్ తనవెంట మెగా ప్రతినిధి బృందాన్ని కూడా తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశాలకు సభ్య దేశాలను భారత్ ఆహ్వానించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌సైతం రాబోతున్నారు. అయితే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వస్తున్నారా లేదా అన్నది ఇప్పటి దాకా తేలలేదు. తాజాగా భారీ బృందంతో భారత్‌కు వస్తున్నట్లుగా రాయిటర్స్ తెలిపింది. డోక్లాం ఘర్షణ తర్వాత దాదాపు ఏడేళ్ల తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రాబోతున్నారు.

దీంతో బ్రిక్స్ సమావేశాలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకోనున్నాయి. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో జరగనున్నాయి. జిన్‌పింగ్ వచ్చే నెలలో బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీకి వస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ పర్యటన ముఖ్యమైనదని భారత్‌చైనా మధ్య మెరుగుపడుతున్న సంబంధాలకు సంకేతమని రాయిటర్స్ పేర్కొంది. జిన్‌పింగ్ హాజరు ఎంత ముఖ్యమైనదంటే బ్రిక్స్ సదస్సు కంటే ఆయన గురించే ఎక్కువగా చర్చ జరిగే అవకాశం ఉంది. ఇరు దేశాలు ఇటీవల కొన్ని చర్చలు జరిపాయి. ఈ సమయంలో అజిత్ దోవల్ కూడా చైనాలోనే ఉన్నారు. పలు ముఖ్యమైన చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## వారం - వర్జ్యం

25-08-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.ద్వాదశి ఉ.6.21
న.ఉత్తరాషాఢ రా.10.49
వ.రా.3.08-తె.4.52
దు1. ఉ.8.24-ఉ.9.14
దు2. రా.11.27-రా.12.17
రాహు మ.3.00-సా.4.30 శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** దూరప్రాంత ప్రయాణాలు, వీసా పాస్పోర్ట్ వంటి అంశాలు కలిసి వస్తాయి. విందు, వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు.

**వృషభం :** ఉన్నత స్థానంలోని వారు మీ సలహాలను, సూచనలను పాటిస్తారు. జరిపే చర్చలు ఫలిస్తాయి. వ్యాపారాలు విస్తరిస్తాయి.

**మిథునం :** గణితానికి సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవడం మంచిది. తండ్రి నుండి ధనలాభం.

**కర్కాటకం :** గృహావసరాలకు గాను ధన వ్యయాన్ని అధికంగా చేస్తారు. వీసా పాస్పోర్ట్ వంటి అంశాలు కలిసి వస్తాయి.

**సింహం :** న్యాయబద్ధమైన మీ వాదనలకు సంబంధిత అధికారుల అండదండలు లభిస్తాయి. ధనాన్ని పొదుపు చేస్తారు.

**కన్య :** వ్యక్తిగత పురోభివృద్ధికి ఉపకరించే లిఖితపూర్వక ఒప్పందాన్ని సానుకూల పరచుకోగలుగుతారు. దూర ప్రయాణాలు.

**తుల :** ఉన్నత స్థానంలో ఉన్నవారు సహాయ సహకారాలను అందిస్తారు. నూతన అవకాశాలు కలిసివస్తాయి. వాటిని సద్వినియోగం.

**వృశ్చికం :** మీలో పోటీతత్వం పెంపొందుతుంది. చిన్నచిన్న విషయాలను కూడా నిర్లక్ష్యం చేయరు. తాకట్టులను విడిపిస్తారు.

**ధనుస్సు :** వృత్తి, ఉద్యోగ వ్యక్తిగత వ్యవహారాల తాలూకు బరువు బాధ్యతలు అలసటకు వత్తిడికి గురి చేస్తాయి.

**మకరం :** ప్రజా సంబంధాలు అధికంగా కలిగినటువంటి వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటుంది. గృహనిర్మాణాల ఆలోచనలు.

**కుంభం :** రాజకీయ స్నేహాలు ఉపకరిస్తాయి. తనఖా వస్తువులను విడిపిస్తారు. ఆవేశాన్ని కలిగి ఉంటారు. కుటుంబ ప్రోత్సాహం.

**మీనం :** క్రీడారంగంలోని వారికి అనుకూలంగా ఉంటుంది. మీలో పోటీతత్వం పెంపొందుతుంది. ప్రముఖుల కలయిక.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




రాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న దృశ్యం. చిత్రంలో సిఎం చంద్రబాబు ఉన్నారు

# కారుమూరికి జ్యుడీషియల్ రిమాండ్

>> న్నారు. ఇదే కేసులో ఇప్పటికే కారుమూరి కుమారుడు సునీల్‌కుమార్‌తో పాటు వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డిని ఇడి అధికారులు అరెస్టు చేశారు. మద్యం రవాణా కాంట్రాక్టులో భారీగా అక్రమాలు జరిగినట్లు ఇడి ఆరోపణలున్నాయి.రవాణా ధరను కిలోమీటర్‌కు రూ.13 నుంచి రూ.35కు పెంచినట్లు ఇడి అధికారులు గుర్తించారు. సుమారు రూ.195.33 కోట్ల మేర అక్రమ లబ్ధి పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. సునీల్‌కుమార్ ఇంట్లో రోలెక్స్ వాచీలు, రేంజ్ రోవర్ స్వాధీనం చేసుకున్నారు. హవాలా లావాదేవీల్లో కారుమూరికి రూ.15 కోట్లు చేరినట్లు ఇడి దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. కారుమూరికి సంబంధించిన రూ.87.7 కోట్ల ఆస్తులను ఇప్పటికే ఇడి జప్తుచేసింది. ఈ కేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని కావాలనే రాష్ట్ర ప్రభుత్వం తనపై కుట్రలు చేస్తోందని కారుమూరు నాగేశ్వరరావు ఆరోపిస్తున్నారు. ఇక ఈ కేసులో విచారణ జరిపిన సిట్ కోస్తాంధ్రలో రవాణా వాహనాల కోసం సుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థతో సిగ్మా సంస్థ ఒప్పందం కుదుర్చుకుందని తెలిపింది. ఈ సంస్థను నాటి మంత్రి, వైఎస్సార్సీ నేత కారుమూరి నాగేశ్వరరావు రంగంలోకి దించారని తన కుమారుడు కారుమూరి సునీల్, కోడలు కీర్తి ఆ సంస్థతో మరో ఒప్పందం చేసుకున్నట్లు సృష్టించారని గుర్తించింది. పేరుకే సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ తప్ప నిర్వహణ మొత్తం కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీలే చూసుకున్నారని సిట్ దర్యాప్తులో తేలింది. ఈడీ విచారణలోనూ ఇదే వెల్లడైంది. సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ సంస్థ వల్లు సందీప్ అనే వ్యక్తిదని సిగ్మా నుంచి ఆ సంస్థ ఖాతాల్లోకి రూ.68 కోట్లు చేరగా అందులోంచి రూ.15 కోట్లు కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీల్, కోడలు కీర్తి ఖాతాల్లోకి జమైనట్లు వెల్లడైంది. మరికొంత సొమ్ము నగదు రూపంలో వారికి అందినట్లు ఇడి గుర్తించింది. రెండు నెలల క్రితం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేసిన సోదాల్లో ఈ హవాలా లావాదేవీల ఆధారాలు, సుదర్శన్ కన్‌స్ట్రక్షన్‌తో కుదిరినట్లు చెబుతున్న ఒప్పంద పత్రాలు లభ్యమయ్యాయి. ఒప్పందపత్రం అసలైనదేనా? హవాలా లావాదేవీల ఇతర వివరాలేంటనే కోణంలో ఇడి దర్యాప్తు ముమ్మరం చేస్తోంది.

# మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కీలక ఫెసిలిటేటర్‌గా వ్యవహరించారు: ఇడి

**విజయవాడ.ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం రవాణాలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కీలక ఫెసిలిటేటర్‌గా వ్యవహరించారని ఇడి తెలిపింది. కారుమూరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఇడి ప్రకటించింది. ప్రభుత్వ ఖజానాకు రూ.195 కోట్ల నష్టం జరిగిందని కేసు నమోదైనట్లు వెల్లడించింది. మద్యం రవాణా నిబంధనలను కొన్ని సంస్థలకు అనుకూలంగా మార్చారని ఇడి స్పష్టం చేసింది. సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్స్ ఫ్రంట్ సంస్థలుగా పనిచేశాయని తెలిపింది. కారుమూరి, సునీల్, డమ్మీ సబ్ కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేశారని తెలిపింది. సుదర్శన కన్‌స్ట్రక్షన్స్ ద్వారా నిధులు మళ్లించినట్లు ఇడి ఆరోపణలు చేసింది. కారుమూరి, కుటుంబసభ్యుల ఖాతాలకు బదిలీ చేసినట్లు దర్యాప్తులో తేలిందని స్పష్టం చేసింది. అక్రమ ఆదాయాన్ని లగ్జరీ కార్లు, ఖరీదైన వాచీలకు ఖర్చు చేశారని తెలిపింది. స్థిరాస్తుల కొనుగోలు, రాజకీయ నిధులు, వ్యక్తిగత ఖర్చులకు వాడారన్న ఇడి తెలిపింది. ఇప్పటికే రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డి, సునీల్‌కుమార్‌ను ఇడి అరెస్టు చేసింది. ఇప్పటికే రూ.37.79 కోట్ల విలువైన ఆస్తులు అటాచ్ చేసినట్లు ఇడి వెల్లడించింది. కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని ఇడి అధికారులు వెల్లడించారు.

# భారీగా ఎసిబి దాడులు

>> ఎసిబి అధికారులు స్పష్టం చేశారు. పూర్తిస్థాయి నివేదిక అందాక తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. ఇదిలా ఉంటే ఇంజనీరింగ్ విభాగంలో అధికారుల ఫోన్లను ముందుగానే స్వాధీనం చేసుకొని, ఏ అధికారిని, సిబ్బందిని బయటకు పోనీకుండా ఉంచి అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చిన ఫైళ్లు మొత్తం స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇటువంటి అవకతవకలు జరిగిన, అవినీతి కార్యకలాపాలపై, అధికారులు లంచం డిమాండ్ చేసిన వెంటనే 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం అందించాలని, సమాచారం అందుకున్న వెంటనే దాడులు చేయటం జరుగుతుందని ఎసిబి అధికారులు వెల్లడించారు. ప్రజలు లంచాలు ఇచ్చి అధికారులను ప్రోత్సహించవద్దు అని కోరారు.

# నిందితుడు సాదిక్ అరెస్టు

>> వచ్చింది. ఈ ఘటనలో రియాన్స్ ప్రాణాలతో బయటపడగా, మిగిలిన వారి ఆచూకీపై ఆందోళన నెలకొంది. ఈ ఘటనపై రాజమహేంద్రవరం టు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సూసైడ్ నోట్లు స్వాధీనం చేసుకున్నారు.సూసైడ్ నోట్ ఆధారంగా తమ మరణానికి సాదిక్ ఖాన్ వేధింపులే కారణమని, అలాగే జగదీష్ రెడ్డికి సాదిక్ ఖాన్ కెమికల్ పాయిజన్ ఇచ్చి చంపాడని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

**మీరట్‌లో నిందితుడి అరెస్ట్..**

విశ్వసనీయ సమాచారం ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందం ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ చేరుకుంది. స్థానిక పోలీసుల సహకారంతో ఈ నెల 22న ఉదయం సుమారు 9 గంటలకు నౌచండి పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతంలో షేక్ సాదిక్ ఖాన్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం మీరట్‌లోని చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో నిందితుడిని హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్ తీసుకున్నారు. అనంతరం నిందితుడిని కాకినాడకు తీసుకొచ్చి కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**పలు కోణాల్లో కొనసాగుతున్న దర్యాప్తు..**

మృతుల సూసైడ్ నోట్లు, నిందితుడి పాత్ర, జగదీష్ రెడ్డి మరణానికి సంబంధించిన కారణాలు, అనుమానాస్పద అంశాలు, మతమార్పిడికి సంబంధించిన ఆరోపణలు, మృతులపై నిందితుడు చేసినట్లు పేర్కొన్న బెదిరింపులు తదితర అంశాలపై పోలీసులు సమగ్ర దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా మొబైల్ ఫోన్లు, డిజిటల్ ఆధారాలు, సిసిటివి ఫుటేజ్, కాల్ డేటా రికార్డులు, వైద్య రికార్డులు, బ్యాంకు లావాదేవీలు తదితర ఆధారాలను శాస్త్రీయంగా పరిశీలిస్తున్నారు.

# ఆన్‌లైన్ సేవలు ఇక సులభతరం

>> నీటి వరకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని చెప్పారు. అటు మలేరియా, డెంగీ కేసుల నివారణకు హాట్ స్పాట్‌లు గుర్తించి, నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అయితే గత యేడాది ఇదే సమయానికి 1,361 డెంగీ కేసులు నమోదైతే... ఈ యేడాది ఇప్పటికి 401 కేసులు నమోదైనట్టు అధికారులు తెలిపారు.ప్రజారోగ్యం విషయంలో అశ్రద్ధ ఉండకూడదన్నారు.తరుణ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని మందులన్ని సిద్ధంగా ఉంచుకోవాలని సిద్ధం చేసారు. మరోవైపు రాష్ట్రంలో కార్బన్ న్యూట్రల్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే రెన్యువబుల్ ఎనర్జీపై ఎక్కువ దృష్టి పెట్టాలని అధికారులకు సిఎం సూచించారు. సోలార్ రూఫ్ టాప్‌లు పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కారిడార్

>> పోలవరం, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాలలోని..కురుపాం, పార్వతీపురం, సాలూరు, మక్కువ, అరకు, పాడేరు, చింతపల్లి, గోకవరం, కన్నాపురం, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి, కామవరపుకోట, ద్వారకా తిరుమల, నూజివీడు మీదుగా ఆగిరిపల్లి దగ్గర అమరావతి ఔటర్‌రింగ్ రోడ్‌లో కలుస్తుంది.ఈ కారిడార్‌కు సంబంధించి ఐదు జిల్లాల్లో అవసరమైన భూసేకరణకు సంబంధించిన బాధ్యతల్ని జాయింట్ కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్ వంటి అధికారుల్లో ఎవరినైనా నియమించనున్నారు. ఇప్పటికే పార్వతీపురం మన్యం, తూర్పుగోదావరి జిల్లాలకు సంబంధించి భూసేకరణ అధికారులను ఎంపికచేసి గెజిట్ జారీ చేసేందుకు మోర్త్ ఉన్నతాధికారులకు ఆ వివరాలను పంపారు. త్వరలోనే మిగిలిన జిల్లాల అధికారుల పేర్లను మోర్త్‌కు పంపిస్తారు. భూసేకరణ 90 మీటర్ల వెడల్పుతో చేయనున్నారు. అలాగే గంటకు 110 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో వెళ్లేలా ప్లాన్ చేశారు. ఈ కారిడార్ మొత్తానికి ప్రాజెక్ట్ వ్యయం రూ.75,629 కోట్లు. కేంద్రం ఈ కారిడార్ ప్రాజెక్ట్‌ను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే మంజూరు చేయడంపై ఫోకస్ పెట్టింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ పశ్చిమబెంగాల్, ఒడిశాలలో కూడా అలైన్‌మెంట్‌పై స్పష్టత వచ్చాక ఖరారు చేయనున్నారు.ఖరగ్‌పూర్- అమరావతి కారిడార్‌లో దాదాపు 457 కిలోమీటర్లు రహదారి ఆంధ్రప్రదేశ్ మీదుగానే వెళుతుందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఏపీకి రవాణా రంగంలో వేగవంతమైన పురోగతి సాధిస్తుందన్నారు. ఈ కారిడార్ ఏపీకి చాలా కీలకమని చంద్రబాబు అన్నారు.

# హిందూ ధర్మంపై దాడికి కుట్ర


## ఎపి బిజెపి అధ్యక్షుడు పివిఎన్.మాధవ్



**విజయవాడ, ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధర్మం, దేవాలయ వ్యవస్థలను నాశనం చేసేందుకు పెద్ద కుట్ర జరుగుతోందని, శబరిమల పవిత్రతను కాపాడటానికి అయ్యప్ప భక్తులు, హిందూ సమాజం నడుం బిగించాలని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపు నిచ్చారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అయ్యప్ప గురుస్వాముల రాష్ట్ర సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, నాస్తికులు, కొందరు అన్యమతస్థులు హిందూ ధర్మంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. గతంలో తిరుమలలో ఏడుకొండలను రెండు కొండలుగా మార్చేందుకు, ఆచారాలను మార్చేందుకు ప్రయత్నాలు జరిగాయని గుర్తు చేశారు. అప్పుడు హిందూ సమాజం పోరాడి తిరుమల పవిత్రతను కాపాడుకుందని, అదే స్ఫూర్తితో ఇప్పుడు శబరిమల రక్షణకు కూడా పోరాడాలన్నారు. 'స్వామియే శరణమయ్యప్ప అంటూనే, ధర్మాన్ని నాశనం చేసే శక్తుల పీచమణిచేందుకు కూడా సిద్ధం కావాలి' అని ఆయన ఉద్బోధించారు. ఈ సమావేశంలో పాల్గొన్న టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప భక్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కేరళలోని ప్రభుత్వం మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని విమర్శించారు. గతంలో టీటీడీ నిధులపై జరిగిన చర్చను ప్రస్తావిస్తూ, 'వెంకటేశ్వర స్వామి వడ్డీ కాసుల వాడే కానీ,వడ్డీ వ్యాపారి కాదు' అని తాను అధికారులకు స్పష్టం చేసినట్లు తెలిపారు.టీటీడీ చట్టం ప్రకారం ఇతర దేవాలయాల్లో అన్నప్రసాదం అందించేందుకు అవకాశం ఉందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేలా మాధవ్‌తో చర్చిస్తామన్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో భక్తులు లేవనెత్తిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఇది కేవలం అయ్యప్ప భక్తుల సమస్యకాదని, యావత్ హిందువుల సమస్యగా భావించి పరిష్కారం కోసం కలిసికట్టుగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

# అభివృద్ధిని ఓర్వలేక గొడ్డలిపార్టీ అరాచకాలు

## వైసిపి నేతల అక్రమాలపై కఠినచర్యలు: మంత్రి అనగాని




**తిరుపతి,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధిదిశగా పనిచేసుకువెళుతుంటే వైసిపి గొడ్డలిపార్టీ నేతలు ఓర్వలేక అరాచకాలకు పాల్పడుతోందని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. అక్రమాలకు,అవినీతికి పాల్పడి, భూకబ్జాలు చేసిన వాళ్ళు పెద్దమనుషులుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. తిరుపతి ప్రజలు వైసిపి నేతల అక్రమాలు తెలుసుకున్నారని అన్నారు. సోమవారం మధ్యాహ్నం ఓ హోటల్‌లో మీడియా సమావేశం మంత్రి అనగాని నిర్వహించారు. తిరుపతికి సమీపంలోని దామినేడు భూములకు కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా పరిష్కరిస్తున్నామన్నారు. మఠానికి సంబంధించినటువంటి భూములకు కూడా సమస్యల్ని పరిష్కరించేలా చూస్తున్నామన్నారు. గొడ్డలి పార్టీ నేతలకు ప్రజలు బాగుండడం ఇష్టం లేదని, కులాల మధ్య మతాల మధ్య,నాయకుల మధ్య అధికారుల మధ్య చిచ్చులు పెడుతున్నారని తీవ్రంగా మండిపడ్డారు. రాజకీయంగా దమ్ము ధైర్యంతో ఎదుర్కోవాలని,అడ్డదారుల్లో వ్యక్తిగతంగా ఎవరినీ విమర్శించొద్దని మంత్రి హితవు చేశారు.గతంలో తిరుపతిలో వైసిపి నేతలు భూములను దోచుకున్నట్లు విజిలెన్స్ విచారణలో తేలిందన్నారు. తిమ్మనాయుడుపాలెం,మంగళం ,తిరుచానూరు వివిధ ప్రాంతాలలో భూకబ్జాలు పాల్పడ్డారని ఆయన తెలిపారు. వైసిపి నేతలు చేసిన పాపాలు పండే రోజులు దగ్గరపడ్డాయని, తిరుపతి ప్రశాంతతకు భంగం వాటిల్లేలా వైసిపి నేతలు ప్రతి రోజూ ఏదో ఒక రాద్ధాంతం చేస్తున్నారని దుయ్యబట్టారు. మీలాంటి వాళ్ళు ఎంతమంది వచ్చినా తిరుపతి ప్రజలకు హాని చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని మంత్రి అనగాని ఘాటుగా హెచ్చరించారు.డిఎస్సీ పై తప్పుడు లెక్కలు చెబుతున్నారని, దుష్ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. 16,263 మందికి ఉద్యోగాలు ఇచ్చామని, తొలి సంతకం చేసింది చంద్రబాబు డిఎస్సీ పైనే అని తెలుసుకోవాలన్నారు. వైసిపికి 18 స్థానాలు ఉంటేనే ప్రతిపక్ష హోదా అనేది తెలుసుకోవాలని,రానున్న ఎన్నికల్లో పార్టీ జెండా కూడా కనిపించదన్నారు.

# రెండో రోజు పరీక్షకు 73 శాతం హాజరు

**తిరుపతి, ఆగస్టు24ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పీడిసిఎల్ పరిధిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న నియామక పరీక్ష రెండో రోజు సోమవారం 73శాతం మంది హాజరయ్యారు.ప్రశాంత వాతావరణంలో ఈ పరీక్షలు జరిగిందని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఎస్పీడీసీఎల్ పరిధిలోని 21 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 2,427 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి వుండగా, 1,779మంది ఈ పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు.

# మృతుల కుటుంబాలకు డి.సిఎం పవన్, ఎమ్మెల్యే నానాజీ ప్రగాఢ సానుభూతి

**కాకినాడ రూరల్, ఆగస్టు 24 ప్రభాత వార్త:** సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్ వద్ద అలల ఉధృతికి నలుగురు యువకులుగల్లంతై, ఇద్దరు మృతి చెందినఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. వారి ఆదేశాల మేరకు రెస్క్యూ బృందాలు, గజఈతగాళ్లు, మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి ఇద్దరి మృతదేహాలనువెలికితీశారు. సురక్షితంగా బయటపడిన మరో ఇద్దరు యువకులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే నానాజీ తనయుడు పంతం సందీప్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకులను పరామర్శించి, మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని సందీప్ భరోసా ఇచ్చారు.

# కుటుంబ సభ్యుల వివాదాన్ని రాజకీయం చేస్తున్నారు: మాజీ మంత్రి జోగి రమేష్

**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** తమ కుటుంబ సభ్యుల నడుమ వివాదాన్ని రాజకీయం చేస్తున్నారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ ఆరోపించారు.తన కుటుంబంలో కుమారుడు,కోడలు మధ్య తలెత్తిన వివాదంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడు రాజీవ్, కోడలు మేఘన మధ్య ఉన్న విభేదాలను కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఒక టీడీపీ ఎమ్మెల్యే ప్రమేయం ఉందంటూ వీడియో ద్వారా ప్రకటన విడుదల చేసారు. జోగి రమేశ్ మాట్లాడుతూ, 'నా కోడలు మేఘన కుటుంబ సభ్యులు మైలవరం టీడీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కార్యాలయానికి వెళ్లారు. కేవలం నా కుటుంబాన్ని రాజకీయంగా లక్ష్యంగా చేసుకోవాలనే దురుద్దేశంతోనే ఈ వివాదంలోకి రాజకీయాలను లాగుతున్నారు' అని ఆరోపించారు. ఇది తనను, తన కుటుంబ సభ్యులను మానసిక ఇబ్బందులకు గురిచేసేందుకు జరుగుతున్న కుట్ర అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

జోగి రమేశ్ చేసిన ఆరోపణలపై మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ స్పందించారు. ప్రజాప్రతినిధిగా తన కార్యాలయానికి ఎవరైనా రావొచ్చని, ఆ క్రమంలోనే మేఘన కుటుంబ సభ్యులు కూడా తనను కలిశారని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలతో స్పష్టత ఇస్తానని ఆయన వెల్లడించారు. ఈ పరిణామాలతో జోగి రమేశ్ వ్యక్తిగత కుటుంబ వివాదం కాస్తా వైసీపీ, టీడీపీ నేతల మధ్య పరస్పర రాజకీయ ఆరోపణలకు దారితీసింది.

# పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం: హోంమంత్రి అనిత



**తిరుమల,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మహిళల భద్రతతోబాటు పోలీసుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. తిరుపతి నగరంలో నూతనంగా నిర్మించిన మహిళా పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభించుకోవడం సంతోషమన్నారు. ఆ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అవగాహన బోర్డులు కూడా ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంపొందించేలా ఉన్నాయని పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఆమె కుటుంబంతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఇక్కడ పోలీస్ కమిషనరేట్ ప్రతిపాదనల్లో ఉందని హోంమంత్రి పేర్కొంటూ పుణ్యక్షేత్రాలకు నిలయమైన తిరుపతి జిల్లాలో నేరాల శాతం బాగా తగ్గిందని, కొత్త జిల్లాల్లో నూతన మహిళా పోలీస్టేషన్ల నిర్మాణం జరుగుతోందని హోంమంత్రి అనిత తెలిపారు.

# డ్రోన్ బ్యాటరీ తగిలి హోంమంత్రికి స్వల్పగాయం

**తిరుపతి,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో అట్టహాసంగా ప్రారంభమైన అమరావతి ఛాంపియన్‌షిప్ కార్యక్రమంలో అపశృతి చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితకు ఓ డ్రోన్‌కు చెందిన బ్యాటరీ ప్రమాదవశాత్తు ఆమె చేతిపై పడటంతో స్వల్ప గాయమైంది. అమరావతి ఛాంపియన్‌షిప్ 2026 కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో ఓ డ్రోన్‌కు సంబంధించిన బ్యాటరీ ఛార్జింగ్ తగ్గిపోయింది. దాంతో ఆ డ్రోన్ కిందికి పడిపోగా, దాంట్లోని బ్యాటరీ ఊడి, నేరుగా వేదికపై ఉన్న మంత్రి అనిత కుడిచేతిపై పడింది. ఈ అనూహ్య ఘటనతో అక్కడున్న అధికారులు, భద్రతా సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే అప్రమత్తమైన తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు మంత్రి అనితకు ప్రథమ చికిత్స అందించి, గాయమైన చేతికి బ్యాండేజ్ వేశారు. చేతికి గాయమైనప్పటికీ అనిత బ్యాండేజ్‌తోనే తన ప్రసంగాన్ని పూర్తి చేశారు. ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించారు. ప్రమాదానికి కారణమైన డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సాంకేతిక లోపం వల్లే ఈ ప్రమాదం జరిగిందనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటన నేపథ్యంలో వివిపిల భద్రత, కార్యక్రమాల్లో డ్రోన్ల వినియోగంపై ఉన్న నిబంధనలను సమీక్షించనున్నట్లు తెలుస్తోంది.

# ఎన్నికల షెడ్యూల్ పేరుతో దుష్ప్రచారం

## ఎస్ఇసి అనిల్‌చంద్ర పునేఠా



**విజయవాడ,ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** 'స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ పేరుతో దుష్ప్రచారం జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారి (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ అంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతుందన్నారు.ఈ మేరకు ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. కీలకంగా వాట్సాప్‌లో తిరిగే ఎన్నికల తేదీలను నమ్మవద్దు అని ఆయన తెలిపారు. తప్పుడు ప్రచారం చేసేవారిపై సైబర్ చట్టాల కింద కేసులు నమోదు చేస్తామన్నారు.ఇంకా ఎన్నికల ఓటరు జాబితా వెల్లడి ,రిజర్వేషన్ల కల్పన తదితరంశాలపై నిర్ణయాలు స్పష్టం జరగవలసి ఉందన్నారు.ఇవన్ని పూర్తయిన తరువాత ఎన్నికల నిర్వహణంశం కొలిక్కి వస్తుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల సమాచారం మీడియా ద్వారానే వెల్లడిస్తామని వివరించారు. అధికారిక ప్రకటన వచ్చేవరకు ఇలాంటి వాటిని నమ్మవద్దు అని ఎస్ఈసీ స్పష్టం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నకిలీ జీవోలు, షెడ్యూల్‌ను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న వారిపై ఇప్పటికే సైబర్ నేర పరిధిలో ఫిర్యాదులు చేసామన్నారు. బాధ్యులను గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ఎన్నికల నిర్వహణ షెడ్యూల్ అంశంపై తమను సంప్రదించాలని ఎస్ఈసీ మీడియాకు విజ్ఞప్తి చేసారు.

# మైలవరంలో ఫేక్ ఫుడ్ ఆఫీసరు బెదరింపు

**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరంలో ఓ హోటల్‌లో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పేరుతో ఓ వ్యక్తి హాల్‌చల్ చేశాడు. హోటల్‌ను సీజ్ చేస్తామని, తనిఖీ సమయంలో తీసిన వీడియోలను మీడియాలో ప్రచారం చేస్తామని బెదిరింపులకు దిగాడు. డబ్బులు డిమాండ్ చేయడంతో పోలీసులను బాధితుడు ఆశ్రయించాడు. ఆధునిక టెక్నాలజీ సురక్షా 360 సీసీ టీవీ కెమెరాల ద్వారా సదరు వ్యక్తి కారును పోలీసులు గుర్తించారు. ఆ కారును స్వాధీనం చేసుకున్న సమయంలో తుపాకీ లాంటి ఒక బొమ్మ పిస్టల్‌ను గుర్తించారు. అది సిగరెట్ లైటర్ మాత్రమే అని, నిజమైన తుపాకీ కాదని పోలీసులు నిర్ధారించారు. ఫేక్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కుంభా గోవిందును పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

# ఓ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులపై కేసు నమోదు

**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులపై సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. 2023 అక్టోబర్‌లో ఈ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అప్పయమ్మ అనే వృద్ధురాలు మృతి చెందింది. అయితే అర్హత లేని వైద్యులు చికిత్స అందించడం వల్లే తన తల్లి మరణించిందని బాధితుడు కృష్ణమూర్తి కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో, విజయవాడ మూడో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు సదరు వైద్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఇంద్రకీలాద్రిపై రూ.13కోట్లతో రెండో ఘాట్‌రోడ్డు



**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రం బెజవాడ ఇంద్రకీలాద్రిపై రెండో ఘాట్‌రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. ఈ గిరిపై కొలువైన కనకదుర్గమ్మ తల్లి సన్నిధికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండో ఘాట్ రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేసారు. ఈ క్రమంలో దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం, ఆర్అండ్‌బీ శాఖ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (ఎన్ఐఆర్ఎం)సంయుక్త ఆధ్వర్యంలో రెండవ ఘాట్‌రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. కొత్త ఘాట్‌రోడ్డు నిర్మాణానికి రూ.13 కోట్లతో బడ్జెట్ అంచనాలను ఆర్అండ్‌బీ సిద్ధం చేసి దేవస్థానానికి ఇచ్చింది. త్వరలో డీపీఆర్ తయారీ బాధ్యతలను ఆర్అండ్‌బీ ద్వారా ఓ సంస్థకు అప్పగించనున్నారు. ప్రస్తుతం దుర్గా ఘాట్ ఎదురుగా ఉన్న ఘాట్‌రోడ్డును 50 ఏళ్ళ పూర్వం నిర్మించారు. అప్పటితో పోలిస్తే ఆలయానికి వచ్చే భక్తులు, వాహనాల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఈ మార్గం తీవ్ర రద్దీని ఎదుర్కొంటోంది. హైదరాబాద్ వైపు నుంచి ఎన్‌హెచ్65 మీదుగా వచ్చే మార్గంలో కనకదుర్గ ఫ్లైఓవర్ కింద కుమ్మరిపాలెం జంక్షన్ దాటిన తర్వాత కొత్త ఘాట్‌రోడ్డు ప్రారంభం కానుంది. కొండపై ప్రస్తుతం ఉన్న 'ఓం టర్నింగ్' వద్ద కలిసేలా ప్రతిపాదనలు రూపొందించారు. దీంతో ఆలయానికి వెళ్లే వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి రానుంది. దుర్గగుడి ఈవో వి.కె. శీనానాయక్‌ను వివరణ కోరగా, రెండో ఘాట్‌రోడ్డుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆర్అండ్‌బీ, ఎన్ఐఆర్ఎం అధికారులతో ఇప్పటికే సమీక్ష నిర్వహించామని, దసరా ఉత్సవాల అనంతరం ఈ ప్రాజెక్టుపై పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తామని వెల్లడించారు.

# ఏషియా బుక్ ఆఫ్‌రికార్డ్స్‌లో ఎపి మల్టీస్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్

## అమరావతి ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం





**తిరుపతి/తిరుపతి క్రీడ,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి చేపట్టిన ప్రతిష్టాత్మక మల్టీ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ కార్యక్రమం నూతన రికార్డు సృష్టించింది. రాష్ట్రవ్యాప్తంగా తిరుపతి వేదికగా నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం ద్వారా ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అధికారికంగా స్థానం సంపాదించింది. 175 నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రాథమిక పోటీల్లో సుమారు 2,07,000 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు.జిల్లా స్థాయిలో సుమారు 84,000 మంది పోటీపడగా, ప్రతిభ కనబరిచిన 9,911 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 12 క్రీడా విభాగాల్లో అండర్-17, అండర్-23 కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాల, ఇంటర్మీడియట్, డిగ్రీ, యూనివర్సిటీ స్థాయిల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికితీయడమే ఈ క్రీడల పోటీల లక్ష్యంగా నిర్దేశించారు. తిరుపతి ఎన్టీఆర్ స్టేడియం వేదికగా అమరావతి ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి, తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, క్రీడల శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ,శాప్స్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు జ్యోతిప్రజ్వలనతో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడ, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా అమరావతి ఛాంపియన్‌షిప్‌ను రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు 92లక్షల రూపాయలు ప్రైజ్ మనీతో బాటు గుర్తింపు, ప్రోత్సాహకాలు అందించనున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం సహకారంతో రాష్ట్రంలోని క్రీడా మైదానాల అభివృద్ధికి 2025లో 75కోట్లు కేటాయించారని, ఈ ఏడాది కూడా సుమారు 200-250 కోట్ల వరకు నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. వచ్చే మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో క్రీడా మౌళిక వసతులను భారీగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. క్రీడా కోటా రిజర్వేషన్‌ను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచడంతో పాటు, డీఎస్సీ ద్వారా 382 క్రీడా కోటా పోస్టులను భర్తీ చేసి ఉపాధ్యాయ ఉద్యోగాలకు అవకాశం కల్పించినట్లు మంత్రి తెలిపారు. హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ రాష్ట్రంలోని పాఠశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మట్టిలో మాణిక్యాలైన క్రీడా ప్రతిభను తీసుకురావడంలో శాప్స్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ క్రీడలతో విద్య-విద్యతో ఉద్యోగం అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. శెట్టిపల్లిలో సుమారు 20 ఎకరాల్లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటు కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, ఎం ఎల్ సి లు బల్లి కల్యాణ చక్రవర్తి, కంచర్ల శ్రీకాంత్, రాం భూపాల్ రెడ్డి, తిరుపతి,చిత్తూరు జిల్లాల ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, పులివర్తి నాని, ఆదిమూలం, బొజ్జల సుధీర్ రెడ్డి, నెలవల విజయశ్రీ, మురళి మోహన్, పాశం సునీల్, ఆరవ శ్రీధర్, గురజాల జగన్మోహన్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# 2029లో ఆలూరు గడ్డపై టిడిపి జెండా ఎగరాలి

## స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలి

### సాగు, తాగునీటిపై ప్రత్యేక దృష్టి

### మంత్రులు నిమ్మల రామానాయుడు, సవితమ్మ



సోమవారం ఆలూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

**ఆలూరు,ఆగస్టు 24, ప్రభాతవార్త :** రాబోయే 2029 ఎన్నికలలో ఆలూరు గడ్డపై టిడిపి జెండా రెపరెపలాడాలని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ అన్నారు. సోమవారం ఆలూరులోని ఆర్ అండ్‌బి అతిథి గృహం ఆవరణ నందు జరిగిన నియోజకవర్గ టిడిపి నాయకుల సమన్వయ సమావేశానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి సమన్వయంతో పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆలూరు నియోజకవర్గానికి ఇన్‌చార్జి మంత్రిగా తనతో పాటు మంత్రి సవితమ్మను పంపించారని తెలిపారు.ఈ సమావేశానికి జనసేన ఇన్‌చార్జి వెంకప్ప,బీజేపీ ఇన్‌చార్జి తిమ్మప్ప, రాష్ట్ర బోయ వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బుజ్జమ్మ,ఇతర కార్పొరేషన్ల చైర్మన్లు,ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్లు,టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు, కార్యకర్తలు,పాత్రికేయులకు మంత్రి నిమ్మల రామానాయుడు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ,మూడు పార్టీలు ఒకే మాటపై నడవడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇదే ఐక్యతను కొనసాగించి అత్యధిక స్థానాలలో విజయాలను సాధించాలన్నారు. 2029 ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ఇప్పటి నుంచే పటిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం ఆర్థికంగా తీవ్రంగా వెనుకబడిందని రామానాయుడు విమర్శించారు. రాయలసీమలో సాగు,తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని రామానాయుడు తెలిపారు.ఆలూరు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామని,సుమారు రూ.1,607 కోట్ల విలువైన పనులను రెండేళ్లలో పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఎన్నికలలోపు పనులను పూర్తి చేసి ప్రజలకు సాగు,తాగునీటి సౌకర్యం మెరుగుపరచడమే లక్ష్యమన్నారు.కర్నూలు పశ్చిమ ప్రాంతాన్ని సుభిక్షంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల మద్దతు అవసరమని రామానాయుడు కోరారు.

# విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

## ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం వహించే క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి హెచ్చరించారు. ఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సిఎండి జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా సంస్థ పరిధిలోని 9 జిల్లాల నుంచి 56 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను విన్నవించారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో సర్వీసుల మంజూరులో జాప్యం వహించే అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సంబంధిత నోడల్ ఆఫీసర్లను సిఎండి ఆదేశించారు. ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభాల మార్పు, ఓల్టేజ్ సమస్యలు, పేరు మార్పిడి తదితర సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే వాటిని పరిష్కరించాలని సూచించారు. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ



కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్‌ఏసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎం. మురళి కుమార్, ఎన్. శోభా వాలెంటీనా, సిహెచ్ రామ చంద్ర రావు, కే. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, జగదీష్, భాస్కర్ రెడ్డి, హేమలత, లత, పిఆర్ఒ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

# విస్తృతంగా సేవా కార్యక్రమాలు: ఆవుల ఈశ్వర్ రెడ్డి

**తిరుపతి,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లాలో లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీ శ్రీనివాస సేవలు మరింత విస్తృత పరుస్తామని, పేదలను ఇతోధికంగా ఆదుకోవడమే ఈ క్లబ్ ప్రధాన లక్ష్యమన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస చాప్టర్ నూతన అధ్యక్షుడిగా ఆవుల ఈశ్వర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఉదయం ఓ హోటల్‌లో లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు విజయభాస్కర రెడ్డి, రాజారెడ్డి నేతృత్వం లో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. వెంటనే ఈశ్వర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం లయన్స్ పిన్ గావెల్ , హామర్‌ను జోన్ ఇంచార్జ్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా లయన్ ఇంటర్నేషనల్ ప్రతినిధి రాజారెడ్డి మాట్లాడుతూ నూతన సభ్యత్వం పొందిన సభ్యులను పరిచయం చేసి వారి విధి విధానాలను తెలియజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నో నూతన కార్యకలాపాలు నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలియజేశారు.


**EASTERN POWER DISTRIBUTION COMPANY OF A.P. LTD**
Corporate Office, P&T Colony, Seethammadhara, Visakhapatnam-530 013.

**"ape-Procurement Tender Notice"**

Tenders are invited from APEPDCL for supply of AB Switch spares, LT HG Fuse sets through ape-Procurement. For further details please visit www.apeprocurement.gov.in Phone No.: 0891-2582302,303, Email: cgm_pmm@apeasternpower.com

Advt-45 Chief General Manager /P&MM

వార్త

యువతను మోసగించడం తేలిక. ఎందుకంటే వారు తొందరగా ఆశలు పెంచుకొని భ్రమల్లో పడిపోతారు.

- అరిస్టాటిల్

# వంటబట్టని 'పట్ట' భద్రత


'చదివిన చదువు ఒకటైతే చేసే ఉద్యోగం వేరు' అనుకుంటూ చాలా కాలంగా నిరుద్యోగులు సద్యోగులుగా మారి కాలం గడిపేసారు. సద్యోగమంటే మంచి ఉద్యోగం. ఏమాత్రం ఉపాధి లభించినా ఎలాగోలా బతికేస్తారులే అని సరిపెట్టుకునే రోజులు పోయాయి. సాధారణ డిగ్రీలుగా పేరుపడిన బిఎ, బికాం, బిఎస్సీ కోర్సులు ప్రస్తుత పరిస్థితుల్లో కాలం చెల్లినవిగానే చెప్పుకోవాలి. అంతకన్నా మంచి విజ్ఞానం లభించే కోర్సులకు ప్రత్యేక రూపకల్పనంటూ ఏమీ లేదు. ఆర్ట్స్, సైన్స్ అని విడి విడిగా ఉండే ఆయా సబ్జెక్టులను అటు చేసి ఇటు చేసి కాంబినేషన్‌లు మార్చి కొత్త కోర్సుల రూపకల్పన జరుగుతోందే తప్ప మరో ప్రయత్నం కానరాదు. పనికి రావని ఉద్యోగ ప్రవేశాల సమయంలోనే తెలియవస్తోంది. ఆ తర్వాత మళ్లీ అనుబంధ కోర్సులు తప్పనిసరి. వాటిపై అవగాహన పెంచుకుంటేనే ఏదో ఓ ఉపాధి దొరుకుతుంది. లేదంటే అంతే. బతుకు బస్టాండ్‌లో వెళ్లదీయాల్సిందే. పూర్వం అయితే 'సత్ర భోజనం మఠం నిద్ర' అనే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడాపరిస్థితి లేదు.కఠోర శ్రమ ద్వారా విద్యావంతులై ఆపై ఉన్నత ఉద్యోగాల్లోకి వెళ్లిన వారు లేకపోలేదు. అలాంటి వారు బహుతక్కువ. అందుకనే విద్యావిధానంలో కోర్సుల్లోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉందంటుంటాం. కానీ అసలు సిసలు లోపమెక్కడుందో కనిపెట్టడానికి వేగిరం పూనుకోలేం. సంస్కరణలు చేపట్టలేం. అదే జరిగితే ఉన్నత విద్యావంతులంతా ఉత్తమ ఉద్యోగ పీఠాలు ఎక్కేవారే. దానాదీనా ఇటీవల 'నీతి అయోగ్' వెల్లడి చేసిన రిపోర్టులో 'సాధారణ డిగ్రీలకు ఉపాధి దొరక్క ఉద్యోమూ దక్కదంటూ చేసిన వ్యాఖ్యానాలను బట్టి భారతీయ విద్యావిధానం డొల్లతనం అర్థమవుతోంది. భారతదేశంలో 15 నుంచి 29 ఏళ్ల మధ్య యువత 8.7 కోట్ల మంది నిరుద్యోగులుగా ఉన్నా వారి ఆర్థిక పరిస్థితుల కారణంగా వారు ఏమీ పనిచేయకుండా ఖాళీగానే ఉన్నారని నీతి అయోగ్ స్పష్టం చేసింది. వికసిత్ భారత్ కోసం 'నైపుణ్యాభివృద్ధి పునఃకల్పన 2047' పేరిట నీతి ఆయోగ్ విడుదల చేసిన పుస్తకంలో ఎన్నో ఆసక్తికర అంశాలున్నాయి. 2021లో తన 78వ జాతీయ శాంపిల్ సర్వే ఆధారంగా ఈ నివేదిక రూపుదిద్దుకుంది. దేశంలో 8.5శాతం మంది పట్టభద్రులకే వారి అర్హతకు తగిన ఉపాధి దొరుకుతోంది. మిగిలిన వారికి తగిన ప్రాక్టికల్ నైపుణ్యత లేకపోవడంతో ఉపాధి మృగ్యమౌతోంది. 2014-15 నుంచి ప్రస్తుతం వరకు 7.67 కోట్ల మందికే సరైన శిక్షణ లభించినట్లు తేటతెల్లం చేసింది. చాలా మంది తమకు ఆర్థిక స్తోమతలేక సంప్రదాయ 'డిగ్రీ' కోర్సులు చదివాకతక్కువ వేతనాలకు చిన్నాచితకా ఉద్యోగంలో చేరి కుటుంబాన్ని పోషించుకుంటూ లేక చదువుల లక్ష్యాన్ని మరచిపోతున్నారు. అదీ గత్యంతరం లేక. ఇది నిజమేకావచ్చు. కానీ ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయా?లేవా? అన్నది ప్రశ్న. యువత చదివిన చదువుల్లో పసలేదని వారి అత్తెసరు చదువులకు వాళ్లే బాధ్యులని చెప్పడమే అసలు బాగోలేదు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్న వారెవరూ వారి చదువులను పక్కన బెట్టడంలేదు. భవిష్యత్తుకోసం ఆరాటపడుతూనే ఉన్నారు. కానీ వాళ్ల చదువులే వాళ్లకు శాపంగా ఉన్నాయనే ధోరణిలో నివేదికల విశ్లేషణలు సమంజసం కాదు. ప్రధానంగా విద్య నేర్చుకున్న వారందరికీ ఉపాధి లభించకపోవడానికి కారణాన్ని ఆ నివేదికలో విశ్లేషిస్తూ కళాశాలల్లో బోధించే సిలబస్‌కు,పరిశ్రమల వాస్తవ అవసరాలకు మధ్య ఏమాత్రం పొంతన ఉండటం లేదన్నది నీతి ఆయోగ్ ఉవాచ.చాలా విద్యాసంస్థల్లో పాఠ్యప్రణాళికలు కాలం చెల్లినవిగా ఉండి నేటి పారిశ్రామికావసరాలకు తగినట్టుగా లేవన్నదినివేదిక సారాంశం. ఇదంతా ఇలా ఉంటే ఉద్యోగవకాశాలు పరిమితంగా ఉన్నందున కూడా నిరుద్యోగుల్లో పోటీ వలన సంక్షోభానికి కారణమని నీతి ఆయోగ్ చెబుతోంది. వారి నివేదికలో ఒక ఉదాహరణను జోడిస్తూ ఇటీవల కేవలం 55 వేల ప్రభుత్వ పోస్టుల కోసం ఏకంగా 1.86 కోట్ల దరఖాస్తులు రావడం నిరుద్యోగ సమస్య తీవ్రతను తెలియచేస్తోంది. ఇలా వృత్తి ఉద్యోగాలేమీ లేకుండా ఖాళీగా ఉన్నవారిని 'నీట్' కేటగిరిగా విభజించింది. ఈకేటగిరీలో ఉన్న 88 శాతం మంది గృహసంబంధిత 'ఇంటిపనుల్లో' నిమగ్నమై ఉన్నారని పేర్కొంది. అంటే వారెవరికీ మంచి ఉద్యోగాల శిక్షణ ఏమీలేనందున ఖాళీగా ఉన్నారని చెబుతూనే వాళ్లకు శిక్షణనిచ్చే అవకాశాలను ప్రధానంగా చర్చించింది. దేశంలోని వర్క్‌ఫోర్స్‌ను పాఠశాల విద్యార్థులో, ఉన్నత విద్య, ఫార్మల్, ఇన్‌ఫార్మల్ వర్కర్లు, 'నీట్' యువత మహిళలు అనే ఐదు విభాగాలుగా విభజించి నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సిన ఆవశ్యకతను తెలియచేస్తోంది. ప్రభుత్వమే వారికి ఆర్థిక సహాయం చేయాలని సూచిస్తోంది. ఆయా రాష్ట్రాలు తమ ప్రాంతానికి అవసరమైన స్కిల్స్, నేర్పే దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలని స్పష్టం చేసింది. మార్కెట్ డిమాండ్‌కు తగినట్లుగా నేటి పట్టభద్రులు తమ నైపుణ్యాలను పెంచుకుంటేనే పేద, మధ్య తరగతి విద్యార్థులకు కాలేజీ ఫీజులు భరించడమే కష్టమౌతున్న తరుణంలో కొత్తగా కోర్సులు నేర్చుకోవడం వారి తలకుమించిన భారమౌతోంది. ఈ నేపథ్యమేవారిని ప్రభుత్వ ఉద్యోగాల కోసం వెంపర్లాడే పరిస్థితి తెస్తోంది. అవేమీ కానరాక కేవలం కాగితం 'పట్టా'లతో తృప్తి పొందుతున్నారు. ఆ తర్వాత 'పని'కి రాకుండాపోతున్నారు. ఈ దేశ యువశక్తిని సక్రమంగా వినియోగించే దిశగాఆలోచనచేసి 'పట్టా' లిచ్చే కర్మాగారాలస్థానే 'స్కిల్డ్' శిక్షణనిచ్చి ప్రభుత్వమే వారికిఉద్యోగాలివ్వడం వల్ల యువతలో నైరాశ్యం తొలగుతుంది. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 8.23 లక్షలకుపైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఇటీవలనే సమాచారం బయట కొచ్చింది. వీటిని భర్తీ చేస్తే కొంతమందికైనా కొలువులు దొరకుతాయి కదా!

యుద్ధ వినాశన కాలంలో, ఆ మారణహోమం సమయంలో ఏ అమెరికా పౌరుడు భోగభాగ్యాలను సంపాదిస్తూ మత్తెక్కి ఉండకూడదని విశ్వసిస్తాడు.



రూజ్‌వెల్ట్

రాకుమారులు యుద్ధం గురించి మాత్రమే అధ్యయనం చేయాలి. వారికి శాంతి ఓ ఆటవిడుపు. మరో యుద్ధానికి సంసిద్ధత అవడానికి అవకాశం.



మాకియవెల్లి

# సంస్కరణలే కాదు, నిత్యం నిఘా ముఖ్యం!

***ఈ మధ్యన నేరాలకు అలవాటుపడ్డవారికి సైబర్ క్రయిం తేలిక అనిపిస్తుంది! అలాంటి నేర ప్రవృత్తి ఉన్న వారికి సహకారం అందించి, తెలివితేటలతో, చేతికి మట్టి అంటకుండా డబ్బు సంపాదించే వారిసంఖ్య ఎక్కువయింది! వీరి మీద నిఘా మరింత అవసరం! రాష్ట్రాల పరిధులను దాటి జైళ్లల్లో స్నేహాలు పెంచుకొనే అనుభవజ్ఞులైన నేరస్థుల మీద జైలు అథార్టీలు, పోలీసులు ఎక్కువ నిఘా ఉంచక తప్పదు! గొలుసులు తెంపుకొని పోయేవారు, కార్లు, స్కూటర్లు దొంగిలించే వారు, మాయమాటలు చెప్పి సొమ్ము అపహరించే వారు ఇలాంటి వారికై పోలీసులు అప్రమత్తంగా వుండక తప్పదు! ఇలాంటి వారే జైలులో నేరాలు నేర్పరితనంలో నిష్ణాతులైన పాత నేరస్థుల దగ్గర శిక్షణ పొంది బయటకు వస్తారు! వారిని నిరంతరం నేరాలు చేయ కుండా అదుపులో వుంచుకోవటానికి పోలీసులు ఒక కన్నేసి వుండకతప్పదు! నేరాలు, నిఘా,నేరస్థులూ, పోలీసులూ, జైలులోపల, బయట, ఆనేర ప్రపంచమే మరో లోకం లాంటిది!***



రావులపాటి సీతారాంరావు

పోలీసుల సంస్కరణల గురించి చాలా చర్చలు దేశంలో జరిగాయి! ప్రస్తుతం మేధావులు, మీడియా ఫోకస్ పెట్టాల్సింది, జైళ్లలో సంస్కరణల గురించి! ఈమధ్యన విచ్చల విడిగా పెరుగుతున్న నేరాల వెనక ఏం జరుగుతున్నది అని శోధిస్తే జైళ్ల ల్లో వున్న నిందితులు, నేరస్థులే 'క్రయిం' అనే అగ్నికి ఆజ్యం పోస్తున్నట్లుగా అనేక ఉదంతాలు సోదాహరణలతో సహా బయటకు రావటం దీర్ఘంగా, లోతుగా ఆలోచించాల్సిన అంశంగా కనపడుతున్నది! సంస్కరించబడాల్సిన నేరస్థులు జైళ్లల్లో వృత్తి నైపుణ్యాలకు పదును పెట్టుకుంటున్నారన్న వార్త విభ్రాంతి కలగజేయటమే కాదు ఆధునిక జీవన శైలికి అలవాటుపడినవారికి కలవరపాటు కలిగిస్తున్నది! అంతా బాగుంది, సాంకేతికంగా అభివృద్ధి పథంలో పయనిస్తున్నాం సంస్కరణలు అన్ని శాఖలలో చేపట్టాం అని చంకలు గుద్దుకుంటున్న ప్రభుత్వాలూ, సంబంధిత అధికారులూ, ఒక్క క్షణం ప్రసిద్ధి గాంచిన జైళ్ల వైపు దృష్టి మరల్చి లోతుపాతులలోకి వెళ్తే నేర సంబంధిత నైపుణ్య చరిత్రలో దేశం ఎంతగా కూరుకొనిపోయి వుందో ఇట్టే అర్థమవుతుంది! కానీ ఆ విషయం మీద దృష్టి పెట్టే అధ్యయనపరులూ, అనుభవజ్ఞులు కనుమరుగవటంతో ఈ విషయం నివురు గప్పిన నిప్పులా వుంది! జైళ్లల్లో కొత్తగా నేరాలు ఆపాదించబడిన వారు, కొద్దిపాటి శిక్షలు పడినవారూ, పశ్చాత్తాపంతో కృంగిపోతూ, జైలు గోడలు దాటగానే బుద్ధిగా వుండాలనే మానసిక దృక్పథంతో సహజంగానే వుంటారు! నేరస్థులుగా ముద్రించబడటం అలాంటి వారిని కృంగదీస్తుంది! కొత్తగా జైలు గోడలు మధ్య అడుగు పెట్టిన వారికోసమే సంస్కరణలు విజ్ఞులు తలపోసారు! ఓపెన్ ఎయిర్ జైళ్ళు అందుకోసమే నిర్మించారు! జైలులో కృంగిపోతూ, నిరంతరం చేసిన తప్పును గురించి ఆలోచించకుండా, బయటనే ఆకాశం, ప్రకృతి, చెట్లూ, చేమలు చూస్తూ జైలు జీవితం మరిచిపోయేలా చేసే ప్రయత్నమే ఓపెన్ ఎయిర్ జైళ్ల ప్రయోగం! సేద్యం చేయటం, పంటలు పండించటంతో పాటు చదువు కోవటం, పరీక్షలురాయటం, డిగ్రీలు సంపాదించుకొని బయటకు వచ్చి నేర ప్రవృత్తిని పూర్తిగా వదిలేసి నేర రహిత జీవితాన్ని గడిపేందుకు అవకాశాలు కల్పించాలనే ఆలోచన చాలా గొప్పది! కానీ ఎంత వరకు ప్రభుత్వాలు ఈ విషయంలో సఫలీకృతులవుతున్నారనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది! సైబర్ క్రయిం వచ్చింతర్వాత ఈ నేరాల తర్ఫీదు జైళ్లల్లోనే లభ్యపడుతున్నదనే విషయం గూడా ఈమధ్య వెలుగులోకి వస్తున్నది! 'హేబిట్యుయల్ అఫెండర్స్' పేరుతో (హెచ్.ఓస్) (పోలీసు పరిభాషలో) నిరంతరం నేరాలు చేసేవాళ్లను రికార్డుల కెక్కిస్తారు! డోషియర్ క్రిమినల్స్ (డి.సి) లాంటి గుర్తింపుతో క్రయిం రికార్డ్ బ్యూరోలలో జిల్లాలలో, రాష్ట్ర పరిధులను, దేశ పరిధులను అతిక్రమించి చేసే వారిని జాబితాల్లో నమోదు కాబడుతాయి! నేషనల్ క్రయిం రికార్డ్ బ్యూరోలో వారి చరిత్ర నిక్షిప్తపర్చ బడివుంటుంది! ఈ రికార్డులకు తోడు కొత్తగా సైబర్ క్రైం నేరస్థుల జాబితా గూడా ప్రత్యేకంగా చేర్చబడింది! హేబిట్యుయల్ అఫెండర్స్ జైళ్లల్లో కొత్తవారిని చేరదీసి, మాయమాటలతో లొంగదీసుకొని జైళ్ళ బయటకు వెళ్ళగానే ఏవిధంగా లింక్లు ఏర్పరుచుకొని నేరాలు చేయాలనే 'జ్ఞానాన్ని' వారు ప్రసాదిస్తున్నారు! కొత్తవారు



అవిధంగా బయటకు వచ్చింతర్వాత గూడా మరిన్నినేరాలు, మరింత అనుభవంతో చేయటానికి సాహసిస్తున్నారు. జైళ్ల ల్లో నిఘా బయటకు రాగానే ఏర్పరిచే పోలీసుల నిఘాతో బాటు, జైళ్లల్లో వుండే నేరస్థుల్లో గూడా కొందరు పోలీసులకు ఇన్ఫార్మెంట్సుగా మారి అవసరమైన 'క్లూస్' యిచ్చే సహకారం గూడా అందిస్తున్నమాట ప్రక్కనపెడితే ఏవిధంగా జైళ్లల్లో మరింత కట్టుదిట్టంగా ఇలాంటి నేరప్రక్రియను ఆపు చేయాలనే అంశం మీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడింది! ఈ మధ్యన తెలంగాణా పోలీసుల దృష్టికి నేరస్థుల జైలు లింకులు కొన్ని కేసుల ద్వారా బయటకు వచ్చాయి.! ఒక నేరస్థుడు, జైలు నుంచి బయటకు రాగానే, అమాయకుడైన కారు డ్రైవర్ను పెద్ద రెంట్‌ను చెల్లించి, ఆ కారుడ్రైవర్ వాష్ రూంకు వెళ్ళినప్పుడు ఆ కారుతో ఉడాయించిన సంగతి, మరో కారును అతను దొంగిలించినప్పుడు బయట పడింది! సిద్ధిపేట పోలీసులు ఈ కేసులను పరిష్కరించటంతో జైళ్లల్లో నేరస్థుల లింక్లు బాగా బయటకు వచ్చాయి! సుదర్శన్ అనే ఈ నేరస్థుడికి జైలులో వున్న ఒరిస్సా నేరస్థుడితో స్నేహం ఏర్పడిన తర్వాత విడుదల అయిన సుదర్శన్ ఒరిస్సాకు వెళ్ళి అక్కడ నేరస్థులతో సంబంధాలు ఏర్పరుచుకొని వివిధ రకాల నేరాలకు పాల్పడిన విషయం పోలీసుల దర్యాప్తులో తేలింది! నేరస్థుడితో జైలులో ఏర్పడిన సంబంధాలు, జైలు బయటకు వచ్చే నేరస్థుడికి బాగా ఉపయోగపడ్డాయి! కొత్తగా పెళ్ళయిన పిల్ల మంగళ సూత్రం చైన్ స్నాచర్లు తెంపుకొని పోవటంతో ఆ పిల్ల తల్లిదండ్రులు, సెంటిమెంట్ దృష్టిలో పెట్టుకొని బాధపడ్తుంటే అనుభవజ్ఞుడైన పోలీసు ఆఫీసర్ 'మీ అమ్మాయి మంగళసూత్రం తప్పక దొరుకుతుంది' అని హామీ యిచ్చి ఆ సాయంత్రానికల్లా ఆ మంగళ సూత్రం చెక్కు చెదరకుండా తీసుకొని వచ్చి ఇవ్వగానే పిల్ల తల్లిదండ్రులు ఆ ఆఫీసర్ను దేవుడిగా భావించారు! పోలీసు ఆఫీసర్కు క్రితం రోజు రాత్రి జైలు నుంచి బయటకు వచ్చిన నేరస్థుడు మరో నేరస్థుడు ఇలాంటి దొంగతనాలలో ఆరితేరిన వాడని చెప్పిన సంగతి జ్ఞప్తికి తెచ్చుకొని తనకు ఆచూకీ ఇచ్చిన నేరస్థుడి సహకారంతో మంగళ సూత్రం దొంగిలించిన నేరస్థుడిని పట్టుకోగలిగాడు. జైలు నుంచి బయటకు వచ్చే నేరస్థుల మీద నిరంతర నిఘా అవసరం! అనుభవజ్ఞులైన క్రయిం పర్యవేక్షించే పోలీసులు చేసే పని అదే! అయితే నిఘా, ఇన్ఫార్మెంట్సును డెవలప్ చేసే విధానాలు, బయట మంచిగా బ్రతుకుదామని వచ్చే నేరస్థులను టార్గెట్ చేయగూడదు!. నిజానికి బయటకు వచ్చే నేరస్థుల్లో చాలామంది బుద్ధిగా బయట బ్రతుకుదామని వచ్చేవారే ఎక్కువ మంది! వారికి ఉపాధి కల్పించే అవకాశాన్ని అధికారులూ ప్రభుత్వమూ, సంస్కరణల్లో ఒక భాగంగా తీసుకోక తప్పదు! ఈమధ్యన నేరాలకు అలవాటుపడ్డవారికి సైబర్ క్రయిం తేలిక అనిపిస్తుంది! అలాంటి నేర ప్రవృత్తి వున్న వారికి సహకారం అందించి, తెలివితేటలతో, చేతికి మట్టి అంటకుండా డబ్బు సంపాదించే వారి సంఖ్య ఎక్కువయింది! వీరి మీద నిఘా మరింత అవసరం! రాష్ట్రాల పరిధులను దాటి జైళ్లల్లో స్నేహాలు పెంచుకొనే అనుభవజ్ఞులైన నేరస్థుల మీద జైలు అథార్టీలు, పోలీసులు ఎక్కువ నిఘా ఉంచక తప్పదు! గొలుసులు తెంపుకొని పోయేవారు, కార్లు, స్కూటర్లు దొంగిలించే వారు, మాయ మాటలు చెప్పి సొమ్ము అపహరించే వారు ఇలాంటి వారికై పోలీసులు అప్రమత్తంగా వుండక తప్పదు! ఇలాంటి వారే జైలులో నేరాలు నేర్పరితనంలో నిష్ణాతులైన పాత నేరస్థుల దగ్గర శిక్షణ పొంది బయటకు వస్తారు! వారిని నిరంతరం నేరాలు చేయకుండా అదుపులో వుంచుకోవటానికి పోలీసులు ఒక కన్నేసి వుండక తప్పదు! నేరాలు, నిఘా, నేరస్థులూ, పోలీసులూ, జైలు లోపల, బయట, ఆ నేర ప్రపంచమే మరో లోకం లాంటిది! ●

# కృత్రిమ మేధతో మారుతున్న ఉపాధి ప్రపంచం..

డాక్టర్ మోటె చిరంజీవి

కృత్రిమ మేధ (ఏఐ) విస్తరణతో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల భవిష్యత్తుపై చర్చ మొదలైంది. నిన్నటి వరకు మనిషి గంటల తరబడి చేసిన పనిని నేడు ఏఐ కొన్ని నిమిషాల్లో పూర్తి చేస్తోంది. కంటెంట్ రచన నుంచి సాఫ్ట్‌వేర్ కోడింగ్ వరకు, కస్టమర్ సేవల నుంచి డేటా విశ్లేషణ వరకు అనేక రంగాల్లో ఏఐవినియోగం వేగంగా పెరుగుతోంది. దీంతో ఉద్యోగాలు పోతాయన్న ఆందోళన సహజమే. అయితే అసలు ముప్పు సాంకేతికతలో కాదు.దానికి అనుగుణంగా మన నైపుణ్యాలను మార్చుకోకపోవడంలో ఉంది. ఏఐ కొన్నిరకాల పునరావృత పనులను సులభంగా నిర్వహించగలదు. ఒకప్పుడు ఒక పనికి పలువురు ఉద్యోగులు అవసరమైతే.. ఇప్పుడు సాంకేతికత సహాయంతో అదే పనిని తక్కువ మంది పూర్తి చేయగలుగుతున్నారు. సంస్థలకు ఇది వ్యయ నియంత్రణ, వేగం, ఉత్పాదకతను పెంచే మార్గంగా కనిపిస్తోంది. ఫలితంగా సంప్రదాయ ఉద్యోగాల్లో మార్పులు తప్పనిసరిగా వస్తున్నాయి.అయితే ఏఐ మనిషిని పూర్తిగా భర్తీ చేస్తుందనే భయం అంతగా వాస్తవికం కాదు.యంత్రానికి సృజనాత్మక ఆలోచన, మానవీయ అనుభూతి, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకునే సామర్థ్యం పరిమితమే.ఏఐ ఇచ్చిన సమాచారాన్ని పరిశీలించి, సరైనదేదో నిర్ణయించి, దానికి మానవీయవిలువను జోడించేది మనిషే. ఏఐ వేగంగా విస్తరిస్తుండటంతో ప్రపంచ ఉపాధి రంగం పెనుమార్పులకు లోనవుతోంది. మనిషి గంటల తరబడి చేసే పనులను ఏఐఆధారిత సాధనాలు నిమిషాల్లో పూర్తి చేస్తున్నాయి. కంటెంట్ తయారీ, సాఫ్ట్‌వేర్, కస్టమర్ సేవలు, డేటా విశ్లేషణ, అకౌంటింగ్, మార్కెటింగ్ వంటిరంగాల్లో దీని వినియోగంపెరుగుతోంది. దీంతో ఉద్యోగ భద్రతపై ఆందోళన కూడా పెరుగుతోంది. అయితే ఏఐ వల్ల ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా ఎంత మందిఉద్యోగాలు కోల్పోయారన్నదానికి ఖచ్చితమైన గణాంకం లేదు. కంపెనీలు ఉద్యోగ కోతలకు ఏఐతో పాటు పునర్వ్యవస్థీకరణ, ఆర్థిక పరిస్థితులు, ఆటోమేషన్ వంటి పలు కారణాలను చూపుతున్నాయి. అమెరికాలో ఉద్యోగ కోతలను నమోదు చేసే సంస్థ మాత్రం 2023 నుంచి ఏఐను ప్రత్యేక కారణంగా నమోదు చేస్తోంది.ఆ సంస్థ తాజా గణాంకాల ప్రకారం 2023 నుంచి 2025 చివరి వరకు అమెరికాలో 71,825ఉద్యోగ కోతలప్రకటనలకుఏఐ కారణంగా పేర్కొన్నారు.ఇందులో 2025లోనే 54,836 ఉద్యోగ కోతలు ఏఐతో అనుసంధానించబడ్డాయి. అంటే కేవలం రెండేళ్ల వ్యవధిలోనే ఏఐ ప్రభావం గణనీయంగా పెరిగిందని ఈ గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వేదిక అంచనాలు మరింత ఆసక్తికరంగా ఉన్నాయి.2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక, ఆర్థిక,జనాభా, పర్యావరణ మార్పుల ప్రభావంతో 9.2కోట్ల ఉద్యోగాలుకనుమరుగయ్యే అవకాశం ఉండగా, 17కోట్ల కొత్త ఉద్యోగాలు ఏర్పడవచ్చని అంచనా వేసింది. అంటే మొత్తంగా 7.8 కోట్ల ఉద్యోగాల నికర పెరుగుదల ఉండొచ్చని పేర్కొంది. అందువల్ల సమస్యఉద్యోగాలు పూర్తిగా అంతరించిపోవడమేకాదు. ఉద్యోగాల స్వరూపం మారడం.పాత నైపుణ్యాలకు డిమాండ్ తగ్గుతూ, ఏఐ, బిగ్‌డేటా, సైబర్ సెక్యూరిటీ, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సృజనాత్మక ఆలోచన, కమ్యూనికేషన్, సమస్య పరిష్కారం వంటి మానవ నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది.కాబట్టి ఏఐని ఉద్యోగాల శత్రువుగా చూడటం కంటే.. దానిని ఉపయోగించగల నైపుణ్యాన్ని పెంచుకోవడమే పరిష్కారం. ●

# సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సామాన్యులకు చేరేదెన్నడు?

ఐ.ప్రసాదరావు

సుమారు 200 సంవత్సరాల బ్రిటిష్ సామ్రాజ్య పతనం కోసం 90 సంవత్సరాల సుదీర్ఘ స్వాతంత్య్ర పోరాటం చేసి ఎందరో మహానుభావులు, స్వాతంత్య్ర సమర యోధులు తమ జీవితాలను త్యాగం చేసిన ఫలితంగా 1947 ఆగష్టు 15వ తేదీన దేశానికి స్వాతంత్య్రం సాధించుకుని నేటికి 79 సంవత్సరాలు పూర్తి చేసుకుని 80వ స్వాతంత్య్ర దినోత్సవం వేడుకలు ఘనంగా జరుపుకున్నాం. మన స్వాతంత్య్ర సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన ఆశయాలు లక్ష్యాలు స్వాతంత్య ఫలాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సామాన్యులకు అందుతున్నాయా అంటే నిస్సందేహంగా అందరికీ సమానంగా అందడంలేదు అనేది నిర్వివాదాంశం.అయితే పాలకులు త్వరలో భారత్ మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది అంటూ, 500ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతుంది అని, దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగుతోంది అని చెప్పడం విడ్డూరంగా ఉంది. అయితే 1947 నాటికి నేటికి కొన్నిరంగాల్లో అభివృద్ధి చెందిన మాట వాస్తవమే. అక్షరాస్యత యనభై శాతం సాధించాం. ఐ.టి,ఫార్మా, రక్షణ, ఉత్పత్తిలో ముందంజలో ఉన్నాము. కొంతమేరకు మౌలిక వసతులు అభివృద్ధి పరచుట జరిగింది.అంతరిక్షంలో విజయ విహారం చేస్తున్నాం. అయినప్పటికీ నేటికీ 145కోట్ల మంది భారత జనాభాలో సుమారు ఎనభై శాతం ప్రజలు ప్రభుత్వాలు అందించే ఉచిత పథకాలు, సంక్షేమ పథకాలు మీదే ఆధారపడి జీవిస్తున్నారు అని గణాంకాలు చెబుతున్నాయి. ఇటీవల సుప్రీంకోర్టు, వివిధ రాష్ట్రాల హైకోర్టులుకూడా ఈ పథకాలు పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కోకొల్లలుగా దేశంలో ప్రభుత్వ పథకాలపై ఆధారపడి బ్రతుకుతున్న ప్రజలను చూసి ఆశ్చర్యపోయారు. అసలు ప్రభుత్వాలురాజ్యాంగ నిర్మాతలు ఆశించిన విధంగా అందరికీ విద్య, వైద్యం,ఆర్థిక సామాజిక న్యాయం అందిస్తున్నాయా? ప్రభుత్వ ఆధీనంలో ఉండవలసిన అనేక అంశాలు, శాఖలు ప్రైవేటీకరణ కార్పోరేటీకరణ చేస్తూ ప్రజాసంక్షేమం నుంచి ప్రభుత్వాలు పక్కకు జరుగుతూ, బడా పారిశ్రామిక వేత్తలకు, కార్పోరేట్ ప్రపంచానికి రాయితీలు ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా వారి సంపదే దేశాభివృద్ధికి సూచిక అంటూ సంబురం పడిపోతున్నారు. దేశంలో సుమారు అరవై శాతం సంపద కేవలం ఒక శాతం ధనికుల వద్ద పోగుపడటం సమంజసమేనా? పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి ఉపయోగించవలసిన ప్రజాధనాన్ని 'రైటాఫ్'లద్వారా బడా పారిశ్రామిక వేత్తలకు ధారాదత్తం చేస్తూ, ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేయడం ప్రజాస్వామ్య పాలనా?ఈ డెభై తొమ్మిది సంవత్సరాల కాలంలో వివిధ పార్టీలు, ప్రభుత్వాలు అటు కేంద్రంలో, ఇటు వివిధ రాష్ట్రాల్లోపాలన కొనసాగించాయి. కేవలం ఆయా పార్టీల మనుగడకోసం,అధికారం సుస్థిరం చేసుకోవడం కోసమే ఓటుబ్యాంకు రాజకీయాలు చేసారు తప్పా దేశాభివృద్ధికి ముఖ్యంగా పేద మధ్య తరగతి ప్రజల జీవితాలు ఆర్థికంగా సామాజికంగా మెరుగుపరచడానికి, ముఖ్యంగా యువత విద్యార్థుల్లో ఆకాంక్షలను నెరవేర్చడానికి, విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి, వ్యవసాయ పారిశ్రామిక రంగాలను బలోపేతం చేయడానికి ఏ మాత్రం ఇటీవల కాలంలో చిత్తశుద్ధితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయటలేదు అనేవాస్తవాన్ని మరువరాదు.అందుచేతనే ఇటీవల కాలంలో రైతులు, శ్రామికులు, ముఖ్యంగా



యువత జెన్‌జెడ్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా దేశం అభివృద్ధి చెందితే వలసలు వెళ్ళడం ఉండవు. ఏ రంగం నుంచి నిరసనలు వ్యక్తం కావుకదా!. ప్రభుత్వాలు చెబుతున్న అభివృద్ధి మాటల్లో ఏమాత్రం వాస్తవం లేదని వివిధరంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో మన దేశ ర్యాంకులు చూస్తే అర్థమవుతుంది. ముఖ్యంగా డాలర్‌తో రూపాయి మారకం విలువ రోజు రోజుకు పతనం అవుతోంది. దాదాపు 96 వద్ద అటుఇటుగా కొనసాగుతోంది అంటే మన ఆర్థికవ్యవస్థ ఎంత బలహీన పడిందో అర్థం అవుతుంది. ప్రపంచ స్థాయిలో మన దేశం ఆకలి సూచిలో హాంగర్ ఇండెక్స్‌లో 102వ ర్యాంకు, పౌర స్వేచ్ఛలో 110వ ర్యాంకు, ఆరోగ్య సూచికలో 45, విద్యా సూచికలో 101, అవినీతిలో 91, పత్రికా స్వేచ్ఛలో 157, ప్రజాస్వామ్య సూచిలో 104, మానవ అభివృద్ధిసూచికలో (హెచ్ డి ఐ) 130లో ర్యాంకు, తలసరి ఆదాయంలో149వ ర్యాంకు, జెండర్ గ్యాప్‌లో 148వ ర్యాంకు,శాంతి విషయంలో 127, సంతోష సూచిలో 116వ స్థానంలో ఉన్నట్లు వివిధ అంతర్జాతీయ నివేదికలు చెబుతున్నాయి. ఇక ఎంత సంపాదించినా కనీసం తినడానికి తిండి లేక ప్రజలు అలమటిస్తున్నారు. దీనికి కారణం అధిక ధరలు దేశంలో నేడు ద్రవ్యోల్బణం 4.38శాతం పైనే కదలాడుతుంది.ఇక ప్రపంచ దేశాల్లో కన్నా అతి తక్కువ తలసరి ఆదాయం సగటున 2.35 లక్షల రూపాయలు సంవత్సరం ఆదాయంతో చాలా మంది బ్రతుకుతున్న పరిస్థితి. జూన్ 2026గణాంకాలు ప్రకారం దేశంలో నిరుద్యోగం 5.5శాతం పైబడి ఉంది. సరి కదా అరకొరగా అప్పుడు అప్పుడు ఎన్నికల్లో ఓట్లు సంపాదించుకోవడం కోసం జాబ్ క్యాలెండర్ అని చెబుతూ చేపట్టే పోటి పరీక్షలు దాదాపు అన్ని అవినీతి, పారదర్శకలేమితో జరుగుతున్న సందర్భంలో నేడు దేశంలో జన్‌జీ యువత నిరసన వ్యక్తం చేస్తున్నారు.ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వాలు జవాబుదారీతనం లేకుండా నియంతృత్వ ఆధిపత్య ధోరణితో నిరసనలు అణిచివేసేందుకు ప్రయత్నాలు చేయడం జరుగుతుంది. ఇదేనా మన స్వాతంత్య్ర సమర యోధులు, రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన ఆశయాలు. ఇకనైనా పాలకులు మారాలి. నేడు మనదేశంలో ప్రతీ సంవత్సరం 100 కోట్ల రూపాయలు పైబడి సంపాదించే అపార కుబేరులు బిలియనీర్ల సంఖ్య 576మంది అని గ్రహించాలి. అదే సమయంలో పేదవాడు మరీ పేదవాడుగా మారుతున్న పరిస్థితి. అనేకమంది రైతులు,ఉద్యోగాలు రాక నిరుద్యోగులు ప్రతీ సంవత్సరం ఆత్మహత్య చేసుకుంటున్నారు.అదే సమయంలో ప్రతీఒక్కరి నెత్తిమీద దాదాపు 1.5లక్షల రూపాయలు ప్రభుత్వ రుణం ఉందనే విషయాన్ని మరువరాదు. అభివృద్ధి పేరుతో కార్పొరేట్ వ్యక్తులు తీసుకున్న రుణాలు చెల్లించకపోవడంతో 'రైటాఫ్' పేరుతో ఈ పది సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం పది లక్షల కోట్ల రూపాయలు రద్దు చేసింది. అదే పేదవాడు, నిరుద్యోగి సామాన్య ప్రజలుఒక్క రూపాయి బాకీ ఉన్నా ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్న పరిస్థితి.అనర్హులకు కూడా ఉచిత పథకాలు, సంక్షేమ పథకాలు అమలు చేయడం శోచనీయం. ప్రతీ విషయంలో రాజకీయ జోక్యంపెరుగుతుంది. ఇకనైనా పాలకులు ప్రభుత్వాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రశ్నిస్తే వారి ఆకాంక్షలను, ఆక్రందనలు పరిశీలించి పరిష్కారానికి కృషిచేయాలి. నైతికతతో, జవాబుదారీతనం ఉండటం ముఖ్యం. రాజ్యాంగ బద్ధమైన సంస్థలను స్వతంత్ర ప్రతిపత్తిగా పనిచేసే విధంగా చూడాలి. వ్యవసాయ పారిశ్రామిక రంగాలను బలోపేతం చేయాలి. నోటి మాటలతో స్వదేశీ అని కాకుండా, అందరూ స్వదేశీ వస్తువులు వాడేవిధంగా ప్రోత్సాహించాలి. ఎగుమతులు పెరగాలి. దిగుమతులు తగ్గాలి. విద్యా రంగంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెంచాలి.రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్‌కు, నైపుణ్యాభివృద్ధి పెద్దపీట వేయడం ద్వారా అభివృద్ధి చెందుతుంది. సమన్యాయం, సామాజిక న్యాయం ఆధారంగా ప్రభుత్వాలు పనిచేయాలి. ●

# ప్రజావాక్కు

## ప్రణాళిక అత్యవసరం

**భారత్** వేగంగా పట్టణీకరణ చెందుతున్న వేళ, నగరాభివృద్ధిని కేవలం ఎత్తైనభవనాలు,ఎక్స్‌ప్రెస్‌వేలు, మెట్రో రైళ్లతో కొలవడం సరిపోదు.స్వచ్ఛమైన గాలి, తాగునీరు, సురక్షిత రహదారులు, సమర్థవంతమైన ప్రజా రవాణా, వరదలేని వీధులు,అందుబాటులో ఉండే గృహాలు కూడా నగర ప్రగతికి కీలక ప్రమాణాలే. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం భారత పట్టణ జనాభా 2050 నాటికి సుమారు95కోట్లకు చేరవచ్చు.దీనికిఅనుగుణంగా మౌలిక సదుపాయాల ప్రణాళిక అత్యవసరం.వాతావరణ మార్పులతో పట్టణ వరదలు,తీవ్రఉష్ణోగ్రతలు, కాలుష్యం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. కాబట్టి చెరువులు, కాలువలు, పచ్చనిప్రాంతాలను రక్షిస్తూ వర్షపునీటి నిర్వహణను బలోపేతం చేయాలి. 2025 తొలి అర్ధభాగంలో పరిశీలించిన 239 నగరాల్లో 122 నగరాలు జాతీయ పీఎం 2.5 ప్రమాణాన్ని మించినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి.ఇది పట్టణ ప్రణాళికలో పర్యావరణానికి మరింత ప్రాధాన్యం అవసరమని స్పష్టం చేస్తోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## బోధనలో నైతిక విలువలు భాగమవ్వాలి

**భర్తృహరి**, భాస్కర, సుమతీ,వేమన, శ్రీ కాళహస్తి శతకాలందు సమాజంలో ఎలా నడుచుకోవాలి, పెద్దలను ఎలా గౌరవించాలి, మంచి వారి సావాసంవల్ల కలిగే ప్రయోజనాలు, చెడు వారి దూరాలు,కష్టాల్లో కూడా ధర్మం తప్పకుండా ఉండటం,ఎప్పుడూ నిజంమాట్లాడటం, నమ్మకంగాఉండటం,ఇతరుల అభిప్రాయాలను హక్కులను, వ్యక్తిత్వాన్ని గౌరవించడం,తోటివారి కష్టాలను అర్థంచేసుకుని సహాయం చేయడం, మనం చేసే పనులకు నిర్ణయాలకు మనమే బాధ్యులమని గుర్తించడం. ఇవి సమాజంలో శాంతిని,వ్యక్తుల మధ్యపరస్పరనమ్మకాన్ని పెంచుతాయి. మంచి వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాయి.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

## విద్యార్థులు నడవడికను అలవర్చుకోవాలి

**నేటి** యువత చిన్న చిన్న విషయాలను సైతం జీవితంలో పెద్ద విజయాలుగా భావిస్తున్నారు.వారికి నచ్చింది సంపాదించడంలో ఎంతవరకైనా బరి తెగిస్తూ తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తూ ప్రాణాలు తీసుకుంటున్నయువత భారీగా పెరిగిపోయింది. కుటుంబ నేపథ్యం తెలుసుకుని భవిష్యత్ జీవితంపట్ల అవగాహనతో ముందుకెళ్లాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## పథకాలతో పెరుగుతున్న అవినీతి

**నేడు** మన దేశంలో ఆధునిక సాంకేతిక విజ్ఞానం పెరుగుతుంటే అవినీతి, అక్రమాలు తగ్గకపోగా శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్న సామెత వలె ఇంకా పెరుగుతున్నాయి. ఈ మధ్య మన రాష్ట్రంలో అవినీతి అనూహ్యంగా పెరగటానికి మరోకారణం అనుచిత జనాకర్షక పథకాలు. కొందరు స్థితి పరులు వాటిని ఆశిస్తుంటే, వారికి అనుచితలబ్ధి కల్పిస్తున్నం దుకు సదరు ఉద్యోగులు డిమాండ్ చేస్తుంటే, కష్టపడకుండ వచ్చే డబ్బేనని లబ్దిదారులు ఉదారంగా ఇస్తున్న కారణంవల్ల అవినీతి బాగా పెరిగిపోయింది. కనుక ఇక ముందు ఎవరైనా ప్రభుత్వోద్యోగంలో చేరేముందు గానీ, పార్లమెంటు,శాసన సభ్యులు,న్యాయ శాఖల్లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టే ముందు గానీవారూ, వారికుటుంబీకుల ఆస్తుల వివరాలను బహిరంగంగా తెలపాలని కేంద్రప్రభుత్వం ఒక చట్టం తేవాలి.అప్పటి,ఇప్పటి ఆస్తులకి పొంతనలేని భారీతేడాఉంటే, ఆ అక్రమఆస్తులను అవినీతినిరోధకశాఖతక్షణం జప్తుచేయాలి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

## తొండ ముదిరితే ఊసరవెల్లి

**మందులు** డాక్టరుగారి చీటి ప్రకారం ఇవ్వడం మందులు అమ్ముకునే దుకాణదారుల పని. తొండ ముదిరి ఊసరవెల్లిగా రంగులు మారుస్తుంది. మందులమ్ముకునే దుకాణాలు మందులు తయారుచేసి అమ్ముతున్నారు. ఆస్పత్రులు నడుపుతున్నారు. ప్రభుత్వం ఎంత మొత్తుకున్నా జనం చౌకయిన జనరిక్ మందులు వాడరు. ఏలనంటే డాక్టర్లు వారు మార్కెట్ చేయదలచిన మందులు రాసానతరు. జనాన్ని చైతన్యపరిచే ఉద్యమాలు ఈ దిశగా రావాలి.

- వి.ఆర్.ఆర్.ఎ. రాజు, హైదరాబాద్

## ధరలను తగ్గించాలి

**ప్రస్తుత** బ్లాక్ మార్కెట్ కారణంగా సిలిండర్ల అమ్మకాలు తగ్గడంతో సరఫరా గొలుసు సాధారణ స్థితికి వచ్చింది. అయితే, హోటల్స్‌లోదొరికే టిఫిన్, భోజనం,కాఫీ, టీ,ధరలు మాత్రం తగ్గలేదు. హోటల్ యజమానులు ధరలు తగ్గించకపోవటంతో వినియోగదారులు చాలా నిరాశ చెందుతున్నారు. సిలిండర్ ధరను యాభై లేదా వంద రూపాయలు పెంచినవెంటనే, ఒక రకమైన టిఫిన్, భోజనం, టీ, కాఫీ ధరలను అమాంతం పది రూపాయలు పెంచారు. సిలిండర్ ధరల తగ్గింపు హోటళ్లకు ప్రయోజనకరమైనప్పటికీ, ఇది వినియోగదారులకు చాలా భారంగా మారింది. ధరలను వెంటనే తగ్గించాలి.

-డి. వెంకటరెడ్డి, బెంగుళూరు

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ప్రజారక్షకుల భద్రత మన బాధ్యత



## నిరసన తెలిపే హక్కు హింసగా మారకూడదు..

## పోలీసులపై భౌతిక దాడులు ప్రజాస్వామ్య విరుద్ధమే

## ప్రజల భద్రత కోసం పోలీసులు చేసే త్యాగాలను గుర్తించాలి

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** ఏ ప్రజాస్వామ్య వ్యవస్థ సజావుగా పనిచేయాలన్నా నిరసన తెలిపే హక్కు, భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ, వ్యవస్థలో జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసే హక్కు అత్యంత కీలకం. పౌరులకు తమ సమస్యలను గళమెత్తి చెప్పే, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే, మార్పు కోసం డిమాండ్ చేసే ప్రాథమిక స్వేచ్ఛ ఉంది. అయితే, చట్టబద్ధమైన పౌర నిరసన హింస, విధ్వంసం, చట్టవ్యతిరేక చర్యలు, ప్రజా శాంతి భద్రతలను కాపాడే పోలీసులపై ప్రత్యక్ష దాడులుగా మారినప్పుడు పరిస్థితి తీవ్రంగా మారుతుంది. ఢిల్లీలో ఇటీవల ఉద్రిక్తతలుతీవ్రరూపం దాల్చి, రాళ్లు రువ్వడం, బారికేడ్లను ధ్వంసం చేయడం వంటి ఘటనల్లో 100 మందికి పైగా పోలీసు సిబ్బంది గాయపడటం తీవ్రంగా పరిగణించాల్సిన అంశం. ఇది కేవలం నిరసన కాదు. చట్టబద్ధమైన సమాజ వ్యవస్థను కాపాడేందుకు విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ సిబ్బందిపై జరిగిన హింసాత్మక దాడిగా చూడాల్సి ఉంటుంది. యూనిఫాం వెనుక ఉన్న మానవీయ కోణంపోలీసు వ్యవస్థను కేవలం ప్రభుత్వ ప్రతినిధులుగా లేదా నిరసనకారులకు అడ్డుగా నిలిచే వ్యక్తులుగా చూడటం సరికాదు. హెల్మెట్లు, రక్షణ కవచాలు ధరించి విధులు నిర్వహించే ప్రతి పోలీసు వెనుక ఒక మనిషి ఉంటాడు. వారు తల్లులు, తండ్రులు, కుమారులు, కుమార్తెలు. ప్రతిరోజూ తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తూ, తమ కుటుంబాల వద్దకు సురక్షితంగా తిరిగి వెళ్లాలని కోరుకునే వారే. కొన్ని వారాలుగా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ భద్రతా సిబ్బంది ఎంతో సహనం, వృత్తి నైపుణ్యం, సంయమనంతో వ్యవహరించారు. దూషణలు, ఎగతాళి, నినాదాలు ఎదురైనా శాంతి భద్రతలను కాపాడే తమ బాధ్యతను నిర్వర్తించారు. అయితే పోలీసులపై భౌతిక దాడులకు దిగడం మాత్రం ప్రజాస్వామ్య నిరసనకు సంబంధించిన అన్ని హద్దులను దాటడమే. న్యాయం కోసం పోరాడుతున్నామనే పేరుతో అల్లకల్లోలాన్ని సమర్థించే ప్రమాదకర ధోరణి ఇటీవలి కాలంలో కనిపిస్తోంది. అయితే వ్యవస్థలో జవాబుదారీతనం కోరుతూ అదే సమయంలో ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం, పోలీసులపై దాడులు చేయడం, రోడ్లపై పూర్తిస్థాయి అరాచక పరిస్థితులు సృష్టించడం ద్వారా నిజమైన మార్పు సాధ్యం కాదు. సమాజం ఒక సామాజిక ఒప్పందంపై ఆధారపడి ఉంటుంది. ప్రజలు సామూహిక ప్రయోజనం కోసం రూపొందించిన చట్టాలను పాటించాలి. ప్రభుత్వం ప్రజలను రక్షిస్తూ న్యాయాన్ని అమలు చేయాలి. గుంపులు బారికేడ్లను కూల్చి పోలీసు బలగాలపై దాడి చేసినప్పుడు ఈ సామాజిక ఒప్పందాన్నే దెబ్బతీసినట్టవుతుంది.

**భిన్నాభిప్రాయాలకు గౌరవం అవసరం:**

జవాబుదారీతనం పారదర్శకత, చర్చ, చట్టపరమైన వ్యవస్థల ద్వారా సాధించాలి. భౌతిక బెదిరింపులు, గుంపుల ఆధిపత్యం ద్వారా కాదు. చట్టబద్ధ వ్యవస్థను ధ్వంసం చేస్తూనే ప్రభుత్వ సంస్థల నుంచి జవాబుదారీతనం కోరడం పరస్పర విరుద్ధమైన చర్య. జవాబుదారీతనం సాధించాలంటే ముందుగా చట్టబద్ధమైన వ్యవస్థ, క్రమశిక్షణ అవసరం. రాజధాని భద్రతను కాపాడటం పోలీసుల బాధ్యనిరసనలు పద్ధతి ప్రకారం నిర్వహించే కార్యక్రమాల నుంచి పోలీసు బలగాలపై ప్రణాళికాబద్ధమైన దాడులుగా మారినప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోతుంది. అది ఇక సాధారణ నిరసన కాదు. ప్రజల భద్రత, జాతీయ భద్రత, చట్టబద్ధ పాలనకు ప్రత్యక్ష ముప్పుగా పరిణమిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో నగర భద్రతను, ప్రభుత్వ మౌలిక వసతులను, అమాయక ప్రజలను కాపాడాల్సిన చట్టపరమైన, నైతిక బాధ్యత పోలీసు వ్యవస్థపై ఉంటుంది. పోలీసులు ఘర్షణను కోరుకోరు. ప్రజా భద్రతకు స్పష్టమైన ముప్పు ఏర్పడినప్పుడు స్పందించాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది అదుపు తప్పిన హింస, అల్లకల్లోలం నుంచి సామాన్య ప్రజలను కాపాడటం పోలీసుల ప్రాథమిక బాధ్యత. బారికేడ్లను రక్షించడం, హింసకు పాల్పడుతున్న వారిని అడ్డుకోవడం ద్వారా స్థానికంగా మొదలైన అల్లర్లు విస్తృత విధ్వంసానికి దారితీయకుండా నిరోధించవచ్చు.

**చట్టబద్ధ పాలన పరిరక్షణ:**

పోలీసులపై ఎలాంటి శిక్ష లేకుండా హింసకు పాల్పడేందుకు అనుమతిస్తే, చట్టం కంటే బలప్రయోగమే పైచేయి అనే ప్రమాదకర సందేశం వెళ్తుంది. ఇది చట్టంపై ఆధారపడే ప్రతి పౌరుడి భద్రతకు ముప్పుగా మారుతుంది. పోలీసు, భద్రతా సిబ్బందికి మన మద్దతు అవసరంభద్రతా బలగాలపై హింసను సాధారణ చర్యగా అంగీకరించడాన్ని సమాజం స్పష్టంగా తిరస్కరించాలి. ప్రభుత్వ విధానాలను విమర్శించడం, నిర్ణయాలను ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు. అయితే చట్టాన్ని అమలు చేసే బాధ్యతలో ఉన్న పోలీసు సిబ్బందిపై భౌతికంగా దాడి చేయడంమాత్రం నేరం. సమాజంగా మనం పోలీసు, భద్రతా సిబ్బందికి అండగానిలవాలి. ఉద్రిక్త పరిస్థితుల్లో వారు ప్రదర్శించిన సంయమనాన్ని గౌరవించాలి. ప్రజల భద్రత కోసం వారు చేస్తున్న త్యాగాలను గుర్తించాలి. శాంతిభద్రత లను కాపాడే తమ విధులను ఎలాంటి అనవసర హింసా భయం లేకుండా నిర్వర్తించే పరిస్థితిని కల్పించాలి. పరస్పర గౌరవం, చట్టబద్ధత, శాంతియుత నిరసనల ద్వారానే నిజమైన పురోగతి, న్యాయం, సంస్కరణ సాధ్యమవుతాయి. ప్రజలను రక్షించే వారిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజానిదే.



# కేంద్ర కేబినెట్ ప్రక్షాళనకు ముహూర్తం ఖరారు!

## 20 మంది మంత్రులపై వేటు లేదా శాఖల్లో మార్పు?

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే కేంద్ర కేబినెట్ ప్రక్షాళన చేసేందుకు సిద్ధమైన ప్రధాని మోడీ వివిధ కారణాలతో అది కాస్తా వాయిదా వేసుకున్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా జాతీయ స్థాయిలో ఒక్కసారిగా పెనుమార్పులు సంభవించాయి. అదే సమయంలో వీటి ప్రభావం త్వరలో జరిగే మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై పడేలా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ముందుగా బిజెపి జాతీయ కార్యవర్గంలో మార్పులు చేర్పులు చేసిన మోడీ ఇప్పుడు తన కేబినెట్ ప్రక్షాళనకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ముహుర్తం కూడా ఖరారైనట్లు తెలుస్తోంది. దేశంలో మారిన పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యతల్ని మార్చుకోవడంతో పాటు తిరిగి జనంలో విశ్వాసం పెంచుకోవడానికి ప్రధాని మోడీ ప్రయత్నిస్తున్నట్లు ఢిల్లీ వర్గాల సమాచారం. ముఖ్యంగా రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు వీలుగా కేబినెట్లో మార్పులు చేసుకోవాలని మోడీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఈసారి కేబినెట్ మార్పులు కచ్చితంగా జాతీయ స్థాయిలో కీలక సంకేతాలు ఇచ్చే విధంగా ఉంటాయని చెప్తున్నారు. ఇప్పటికే కేబినెట్ ప్రక్షాళనకు రంగం సిద్ధంచేసుకున్న ప్రధాని మోడీ అందులో భాగంగానే ఇద్దరు మంత్రులకు రాజ్యసభ కొనసాగింపు ఇవ్వలేదు, అలాగే మరో ముగ్గురిని ఎన్నికలు జరిగేరాష్ట్రాలకు ఇన్‌ఛార్జులుగా పంపారు. ఇప్పుడు కేబినెట్లో మిగిలిన మంత్రుల్లోనూ పలువురికి ఉద్వాసన పలికేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మరికొందరు శాఖల మార్పు తప్పనిసరిఅవుతోంది. ఇందులో ప్రధానంగా వినిపిస్తున్న పేరు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్. ఆమెను వేరే శాఖకు పంపి, ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌ను ఆర్థికమంత్రిగా నియమించే అవకాశముంది. అలాగే రెగ్యులర్ విద్యాశాఖ మంత్రిని కూడా నియమించే అవకాశం ఉంది. పలు కీలక శాఖల్లోనూ మార్పులు ఉంటాయని తెలుస్తోంది. ఇలా చూస్తే మొత్తం మీద 20 మంది మంత్రుల వరకూ వేటు లేదా శాఖలమార్పు ముప్పు ఎదుర్కొంటున్నట్లు ఢిల్లీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ఇందులో భాగంగా పలువురు జూనియర్ మంత్రులపై వేటుపడొచ్చని చెప్తున్నారు. లేదా వేరే శాఖలకూ పంపే అవకాశం ఉంది. అలాగే ఎన్నికలు జరిగే యూపీ, గుజరాత్, పంజాబ్ నుంచి కొత్త మంత్రులు కేబినెట్లోకి రాబోతున్నారు.

# మిస్ యూనివర్స్ ఇండియాగా కజియా లిజ్‌మెజో



**జైపూర్, ఆగస్టు 24:** కేరళకు చెందిన 19 యేళ్ల కజియా లిజ్ మెజో మిస్ యూనివర్స్ ఇండియా 2026 కిరీటం దక్కించుకుంది. జైపూర్‌లోని జీ స్టూడియోస్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలేలో ఆమె విజేతగా నిలిచింది. దేశవ్యాప్తంగా పోటీపడిన 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి టైటిల్ సొంతం చేసుకుంది. మిస్ యూనివర్స్ ఇండియా 2025 విజేత మానికా విశ్వకర్మ ఆమెకు కిరీటం అలంకరించారు. దీంతో నవంబర్‌లో ప్యూర్టోరికోలో జరిగే 75వ మిస్ యూనివర్స్ పోటీలో భారత్ తరఫున కజియా ప్రాతినిధ్యం వహించనుంది. కిరీటం దక్కిన అనంతరం కజియా ఆనందం వ్యక్తం చేసింది. ఈ కిరీటం కోసం మూడేళ్లకు పైగా కష్టపడ్డానని తెలిపింది. తన సొంత రాష్ట్రం కేరళకు ఈ విజయాన్ని తీసుకెళ్లడం ఎంతో గర్వంగా ఉందని చెప్పింది. 19 ఏళ్ల వయసులో ఇంత పెద్ద వేదికపై నిలవడానికి ఎంతో ధైర్యం అవసరమైందని కజియా పేర్కొంది. తనపై తనకు నమ్మకం పెంచుకోవడం అతిపెద్ద సవాలుగా భావించానని తెలిపింది. భారత్‌కు మిస్ యూనివర్స్ కిరీటం తీసుకురావడమే తన తొలి లక్ష్యమని కజియా చెప్పింది. తాను చేసే ప్రతి పనిలో భారత్, కేరళకు ప్రాతినిధ్యం వహించాలనుకుంటున్నట్లు తెలిపింది. విజేతను ఎంపిక చేసిన జడ్జింగ్ ప్యానెల్‌లో మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్, ఉర్వశి రౌతేలా, రియా సింఘా, పర్యావరణవేత్త ప్రగ్యా కపూర్ ఉన్నారు. సెలీనా జైట్లీ కూడా జడ్జిగా వ్యవహరించారు. వైష్ణవి గణేశ్ తొలి రన్నరప్‌గా నిలిచింది. ఆమెకు మిస్ ఇంటర్నేషనల్ ఇండియా 2026 టైటిల్ దక్కింది. అనుశ్రీ సాతవ్లేకర్ రెండో రన్నరప్‌గా నిలిచింది. తేజస్విని శ్రీవాస్తవ మూడో రన్నరప్, అనుభా వశిష్ఠ్ చౌదరి నాలుగో రన్నరప్‌గా నిలిచారు.



# విద్యార్థినులతో కలిసి ప్రిన్సిపల్ జలకాలాటలు

## సస్పెండ్‌చేసిన సెకండరీ విద్యాశాఖ

**ఆల్వార్, ఆగస్టు 24:** విద్యార్థినులతో కలిసి నీళ్లలో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్‌పై అధికారులు వేటు వేశారు. విద్యార్థినులతో ఆయన జలకాలాటలు ఆడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌కావడంతో, విద్యాశాఖ అతడిని సస్పెండ్ చేసింది. ఈ ఘటన రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లాలో చోటుచేసుకుంది. అల్వార్ జిల్లాలోని ఒక ప్రభుత్వ సీనియర్ సెకండరీ పాఠశాల ప్రిన్సిపాల్ లాల్‌చంద్ మీనా, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సుమారు 200 మంది విద్యార్థులను పిక్నిక్‌కు తీసుకెళ్లారు. వీరిలో 11, 12వ తరగతి చదువుతున్న బాలికలు కూడా ఉన్నారు. పాఠశాలకు సమీపంలోని ఓ డ్యామ్ వద్దకు వెళ్లిన వీరంతా నీటిలో ఆడుకున్నారు. ఈ క్రమంలో ప్రిన్సిపాల్ లాల్‌చంద్ మీనా కూడా విద్యార్థులతో కలిసి నీళ్లలోకి దిగారు. విద్యార్థినుల ముందే దుస్తులులేకుండా నీటిలో ఈదినట్టుగా ఉన్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో విస్తృతంగా వ్యాపించింది. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి విద్యార్థినుల పట్ల ప్రిన్సిపాల్ ప్రవర్తించిన తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వీడియో ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వారు వెంటనే స్పందించారు. ప్రభుత్వ ఉద్యోగి ప్రవర్తనా నియమావళిని మీనా ఉల్లంఘించారని నిర్ధారించారు. ఈ మేరకు బికనీర్ సెకండరీ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రిన్సిపాల్ లాల్‌చంద్ మీనాపై శాఖాపరమైన విచారణకు కూడా ఆదేశించింది. ప్రస్తుతం ఈ ఘటనపై విచారణ కొనసాగుతోంది.

# యేడాదికి మూడు ఉచిత ఎల్పీజీ సిలిండర్లు

## ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం



**చెన్నై, ఆగస్టు 24:** తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సోమవారం పలు సంక్షేమ పథకాలను ప్రకటించారు. యేడాదికి మూడు ఉచిత ఎల్పిజి సిలిండర్లు అందించే పథకంతో పాటు ట్రాన్స్ జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. అన్నపూర్ణి సూపర్ సిక్స్ పేరుతో గ్యాస్ సిలిండర్ల పథకం అమల్లోకి రానుంది. 2027 సంక్రాంతి నుంచి దీనిని ప్రారంభించనున్నారు. యేటా రూ.2.5 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. అర్హులైన కుటుంబాలు కొనుగోలు చేసే మూడు గ్యాస్ సిలిండర్ల ఖర్చును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఈ పథకానికి ఏటా సుమారు రూ.4వేల కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులతో గ్యాస్ కొరత, ధరల పెరుగుదల కుటుంబాలపై అదనపు భారాన్ని మోపాయని విజయ్ తెలిపారు. మహిళల ఉచిత బస్సుప్రయాణ పథకం పరిధిని ప్రభుత్వం విస్తరించింది. ఇకపై సాధారణ బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్, ఎల్ఎస్ఎస్, డీలక్స్ బస్సుల్లోనూ మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. జిల్లాల మధ్య నడిచే బస్సుల్లోనూ ఈ సదు పాయం కల్పించ నున్నారు. వెట్రి పయనం పేరుతో అక్టోబర్ 2 నుంచి ఈవిస్తరణ అమల్లోకి వస్తుంది. ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు విజయ్ ప్రకటించారు. చెన్నై సమీపంలోని పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టుపై విజయ్ మరో సారి తనవ్యతిరేకతను స్పష్టంచేశారు. ప్రాజెక్టుతో ప్రభావిత మయ్యే కుటుంబాల పక్షాన నిలుస్తామని చెప్పారు. ప్రత్యామ్నాయ ప్రాంతాలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాలను గుర్తించినట్లుతెలిపారు. ప్రస్తుత మీనంబాక్కం, చెన్నై విమానాశ్రయంలోని కొత్త టెర్మినల్5 నిర్మించనున్నట్లు కూడా ప్రకటించారు.

# హెచ్‌వన్-బి, ఒపిటిలపై షాకింగ్ ఫీజులు!

## అమెరికాకు వెళ్లే కల కలగానే మారుస్తున్న ట్రంప్




**వాషింగ్టన్, ఆగస్టు 24:** అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడయ్యాక భారతీయులకు ఏదో విధంగా నిత్యం షాకులు తగులుతూనే ఉన్నాయి. ఇదే క్రమంలో తాజాగా భారతీయులకు మరో షాక్ ఇచ్చేందుకు ట్రంప్ సర్కార్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా హెచ్1బీ వర్క్ వీసా, ఎఫ్1 ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లపై కొత్త ఫీజుల్ని ప్రవేశపెట్టేందుకు అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రతిపాదనలు ప్రస్తుతం వైట్ హౌస్ బడ్జెట్ విభాగం పరిశీలనలో ఉన్నాయి. అమెరికా తాజా నిర్ణయం వల్ల అక్కడికి వెళ్లాలనుకునే లక్షలాది మంది భారతీయులపై ఆర్థిక భారం భారీగా పెరిగే అవకాశం ఉంది. అమెరికాలో 2024 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన హెచ్1బీ వీసాలలో దాదాపు 71 శాతం భారతీయులకే దక్కాయి. ఈ నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం తీసుకోబోయే ఫీజుల పెంపు నిర్ణయం నేరుగా మన ఐటీ నిపుణులపై తీవ్ర ప్రభావం చూపనుంది. న్యూయార్క్‌కు చెందిన ప్రముఖ ఇమ్మిగ్రేషన్ లా సంస్థ ఫ్రాగోమెన్ ప్రకారం, ఇప్పటికే ఈ ప్రతిపాదనల ముసాయిదా యూఎస్ బడ్జెట్ విభాగానికి చేరింది. గతంలో ట్రంప్ ప్రభుత్వం హెచ్1బీ వీసా పిటిషన్లపై ఏకంగా లక్ష డాలర్ల ఫీజు విధించాలని ప్రయత్నించగా, కోర్టు దాన్ని తిరస్కరించింది. దాంతో ఇప్పుడు హోంల్యాండ్ సెక్యూరిటీ మరో ప్రత్యామ్నాయ మార్గంలో ఫీజులు పెంచేందుకు చట్టపరమైన సన్నాహాలు చేస్తోంది.

మరోవైపు విద్యార్థుల విషయానికి వస్తే, ఉన్నత విద్య పూర్తి చేసిన తర్వాత ఉద్యోగం చేసుకునేందుకు ఉపయోగపడే ఎఫ్1 ఓపీటీ దరఖాస్తులపై కూడా ఈ పెరిగిన ఫీజుల ప్రభావం పడనుంది. ఈ ఫీజుల్ని కూడా భారీగాపెంచవచ్చని సమాచారం. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఓపిటి దరఖాస్తుకు 470 డాలర్లు, పేపర్ రూపంలో అయితే 520 డాలర్లు చెల్లించాల్సి ఉంది. సాధారణంగా హెచ్1బీ వీసా రుసుములను కంపెనీలే భరిస్తాయి. కానీ ఓపీటీ ఫీజులను విద్యార్థులే స్వయంగా చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుఖర్చులు భారీగా పెరిగితే భారతీయ విద్యార్థుల ఉన్నత చదువులపై, ఆ తర్వాతి ఉపాధి అవకాశాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. అమెరికాలో స్థిరపడేందుకు చాలా కాలంగా ఉన్న ఎఫ్1 నుండి హెచ్1బీ మార్గం మరింత వ్యయ భరితంగా మారనుంది. తుది నోటిఫికేషన్ వచ్చే వరకు ఫీజు ఎంత పెరుగుతుందనే దానిపై పూర్తి స్పష్టత రాదు.

# భర్తను హత్యచేసి, పొట్టనుచీల్చి పేగులు సంచిలోకి

## ఇంటియజమాని చూడటంతో ఆత్మహత్యాయత్నం



**కురుక్షేత్ర, ఆగస్టు 24:** హర్యానాలోని కురుక్షేత్రలో అత్యంత దారుణమైన, ఒళ్లు గగుర్పొడిచే ఘటన వెలుగులోకి వచ్చింది. భర్తను కిరాతకంగా హత్య చేసిన ఓ మహిళ, అతని శరీరాన్ని ఛిద్రం చేసింది. ఈ క్రమంలో ఇంటి యజమానికి అడ్డంగా దొరికిపోవడంతో భయంతో టెర్రస్‌పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసుల వివరాల ప్రకారం, పీహోవా రోడ్డులోని రాజ్ ప్యాలెస్ సమీపంలో రాజేశ్, విమలా దేవి దంపతులు ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజేశ్ స్థానికంగా ఓ వాటర్ ట్రేడింగ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో వీరిద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.

వారి ఇంట్లోంచి పెద్దగా అరుపులు వినిపించడంతో ఇంటి యజమాని రింకూ వారిని చూసేందుకు టెర్రస్‌పైకి వెళ్లాడు. అక్కడ కనిపించిన దృశ్యం చూసి రింకూ షాక్‌కు గురయ్యాడు. రాజేశ్ రక్తపు మడుగులో పడి ఉండగా, అతని పొట్ట భాగం చీల్చి ఉంది. బయటకు వచ్చిన పేగులను విమల ఓ సంచిలో పెడుతుండటం అతను గమనించాడు. ఇంతలో తనను ఇంటి యజమాని చూశాడని గ్రహించిన విమల, కంగారుతో టెర్రస్‌పై నుంచి కిందికి దూకేసింది. గాయపడిన ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. పోస్టుమార్టం నివేదికలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. రాజేశ్ పొట్టపై సుమారు 35 సెంటీమీటర్ల పొడవున కోసి ఉంది.

అతని శరీరం నుంచి కాలేయంలో కొంత భాగం, కుడివైపు కిడ్నీ మాయమైనట్టు వైద్యులు గుర్తించారు. ఘటనా స్థలంలో మూడు వేర్వేరు పరిమాణాల్లో ఉన్న కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విమల క్షుద్రపూజలు, చేతబడి వంటివి చేస్తుండేదని, ఈ విషయమై దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవని ఇంటి యజమాని పోలీసులకు తెలిపాడు. కొన్నేళ్ల క్రితం వివాహం చేసుకున్న ఈ దంపతులకు పిల్లలు లేరు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విమల కోలుకుని వాంగ్మూలం ఇస్తేనే ఈ హత్య వెనుక ఉన్న పూర్తి వివరాలు, అసలు కారణాలు తెలిసే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

# వచ్చేనెల 28 నుంచి మూడురోజులు బ్యాంకు ఉద్యోగుల సమ్మె




**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మరోసారి సమ్మె గంటలు మోగనున్నాయి. తమ ప్రధాన డిమాండ్లను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ) విఫలమయ్యాయని ఆరోపిస్తూ బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక అయిన యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. వారానికి ఐదు రోజుల పనిదినాలు, పనితీరు ఆధారిత ప్రోత్సాహకం (పిఎల్ఐ) విధానంలో మార్పులు వంటి కీలక అంశాలపై ఉద్యోగ సంఘాలు పట్టుబడుతున్నాయి. ఈ మేరకు దశలవారీ ఆందోళనల షెడ్యూల్‌ను ప్రకటించాయి. యుఎఫ్‌బియూ ప్రకటించిన వివరాల ప్రకారం, సెప్టెంబర్ 11న ఒక రోజు దేశవ్యాప్త సమ్మె, సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మె నిర్వహించనున్నారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే, అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని యూనియన్లు స్పష్టం చేశాయి. ఈ సమ్మెల కారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల సేవలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉంది. 2024 మార్చి 8న జరిగిన 12వ ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా, వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయడానికి ఐబీఏ అంగీకరించింది.

దీనికి బదులుగా సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజుకు 40 నిమిషాలు అదనంగా పనిచేయడానికి ఉద్యోగులు అంగీకరించారు. ఐబీఏ ఈ ప్రతిపాదనను ప్రభుత్వ ఆమోదం కోసం పంపినప్పటికీ, రెండేళ్లు దాటినా ఇప్పటికీ ఆమోదముద్ర పడలేదు. ఈ జాప్యంపై ఉద్యోగ సంఘాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ ఇటీవల సవరించిన పీఎల్ఐ విధానం తీవ్ర వివక్షాపూరితంగా ఉందని యూనియన్లు ఆరోపిస్తున్నాయి. కొత్త విధానం ప్రకారం, స్కేల్4, ఆపై స్థాయి అధికారులకు వారి వ్యక్తిగత పనితీరు ఆధారంగా గరిష్ఠంగా 365 రోజుల బేసిక్ పే వరకు ప్రోత్సాహకం లభిస్తుంది. అదే సమయంలో, స్కేల్3 వరకు ఉన్న అధికారులు, ఇతర సిబ్బందికి కేవలం 15 రోజుల బేసిక్ పే, డిఏ మాత్రమే అందుతుంది. ఇది ఐబిఎతో చేసుకున్న ఒప్పందానికి విరుద్ధమని యూఎఫ్‌బీయూ వాదిస్తోంది.

# సంక్షిప్త వార్తలు

## ట్రంప్ తనయుడికి ఇరాన్ టివిలో బెదిరింపులు



**టెహ్రాన్, ఆగస్టు 24:** ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడిపై టెహ్రాన్ ప్రత్యక్ష బెదిరింపులకు పాల్పడింది. ట్రంప్ చిన్న కుమారుడు బారెన్ ట్రంప్‌ను హత్య చేస్తామని బెదరిస్తూ.. ఇరాన్ ప్రభుత్వ అనుబంధ మీడియా ఛానల్ ఓ విడియోను ప్రసారం చేసింది. అతడి తలపై 10 మిలియన్ డాలర్ల రివార్డును ప్రకటించింది. ఈ విడియోలో బారెన్ ఏ సమయంలో ఎక్కడ ఉంటారు? అతడిని లక్ష్యం చేసుకొనేందుకు సరైనచోటు ఏది? అనే విషయాలను గ్రాఫిక్స్‌లో చూపించింది. అంతేకాకుండా అతడి కదలికలపై నిఘా, ఆన్‌లైన్ కార్యకలాపాలు, చుట్టూ ఉండే వ్యక్తుల గురించి తెలియజేసింది.

## రష్యా 3లక్షల మంది సైనికులను సిద్ధం చేస్తోంది: జెలెన్‌స్కీ

**కీవ్, ఆగస్టు 24:** ఉక్రెయిన్-రష్యా మధ్య ఘర్షణ ఇటీవల మరింత తీవ్రమవుతోంది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమపై దాడులు మరింత పెంచేందుకు రష్యా సన్నాహాలు చేస్తోందని అన్నారు. దాదాపు 3 లక్షల మంది సైనికులను కొత్తగా సమీకరించేందుకు ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. డొనెట్స్క్ ప్రాంతాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవడమే మాస్కో ప్రధాన లక్ష్యమని, ఇందులో భాగంగానే కొత్తగా సమీకరించే బలగాలను అక్కడ మోహరించే అవకాశం ఉందని చెప్పారు. సెప్టెంబరులో రష్యా పార్లమెంటరీ ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు.

## బిచ్చగత్తె ఇంట్లో రూ.8.40 లక్షల నగదు

**మాండ్య, ఆగస్టు 24:** కర్ణాటకలో ఆశ్చర్యకర ఘటన వెలుగులోకి వచ్చింది. జీవితమంతా భిక్షాటన చేస్తూ గడిపిన 68 యేళ్ల మహిళ ఇంట్లో రూ.8.40 లక్షల నగదు బయటపడింది. 30కి పైగా బస్తాల్లో నోట్లను, నాణేలను దాచిపెట్టినట్లు గుర్తించారు. అయితే ఆ డబ్బు ఆమెకు ఉపయోగపడకుండానే కన్నుమూశారు. మాండ్యకు చెందిన హూర్ వృద్ధాప్య సంబంధ అనారోగ్యంతో నిన్న మృతి చెందారు. ఆమె మరణించిన తర్వాత స్థానికులు ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా బస్తాల్లో పెద్ద మొత్తంలో నగదు కనిపించింది. రూ.10, రూ.20, రూ.50 నోట్లు భారీగా ఉన్నాయి. వేల సంఖ్యలో నాణేలు కూడా బయటపడ్డాయి.

## పరందూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు వెనక్కి

**చెన్నై, ఆగస్టు 24:** తమిళనాడు రాజధాని చెన్నై సమీపంలో గతంలో ప్రతిపాదించిన విమానాశ్రయ ప్రాజెక్ట్ ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న టివికె, ప్రతిపక్ష డిఎంకె మధ్య తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. చెన్నైకి సుమారు 70 కిలో మీటర్ల దూరంలో ఉన్న పరందూర్ ప్రాంతంలో సారవంతమైన వ్యవసాయ భూములు, పర్యావరణ వ్యవస్థలు దెబ్బతింటాయని ఆందోళన చేపడుతున్న రైతులకు మొదటి నుంచీ మద్దతుగా నిలిచిన ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తాజాగా ఆ ప్రాజెక్ట్‌ను పూర్తిగా విరమిస్తున్నట్లు ప్రకటిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు.

## నెదర్లాండ్స్‌లో ఊబర్‌కు రూ.9245 కోట్ల జరిమానా

**ఆమ్‌స్టర్‌డామ్, ఆగస్టు 24:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిర్ణయంతో ఉద్యోగం కోల్పోవాల్సి వస్తే ఈ ప్రశ్న ఇప్పుడు యూరప్‌లో తీవ్రచర్చకు దారితీస్తోంది. డ్రైవర్ల ఖాతాలను నిలిపివేయడంలో ఆటోమేటెడ్ వ్యవస్థలను ఉపయోగించినందుకు ఊబర్‌కు భారీ జరిమానా పడింది. నెదర్లాండ్స్ డేటా ప్రొటెక్షన్ అథారిటీ ఊబర్‌పై 825 మిలియన్ యూరోల జరిమానా విధించింది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.9,245 కోట్లకు సమానం.

## వెంటిలేటర్ పేలి ముగ్గురు శిశువులు మృతి

**అమ్రావతి, ఆగస్టు 24:** మహారాష్ట్రలో ఘోర విషాదం చోటుచేసుకుంది. అమ్రావతిలోని జిల్లా మహిళా ఆసుపత్రిలో సోమవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. వెంటిలేటర్ పేలిన ఘటనలో నవజాత శిశువుల ఐసియులో చికిత్స పొందుతున్న ముగ్గురు పసికందులు దట్టమైన పొగకు ఊపిరాడక మృతి చెందారు. మరో ఆరుగురు శిశువులను రక్షించి, స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

## తిరుమల సమాచారం



### శ్రీవారి ఆలయంలో పవిత్రాల సమర్పణ

**తిరుమల,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమోక్తంగా పూజలందుకుంటున్న తిరుమల శ్రీవారి ఆలయ పవిత్రోత్సవాల్లో రెండో రోజు సోమవారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ జరిగింది. ఈ సందర్భంగా ఉదయం యాగశాలలో హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. ఆ తరువాత సంపంగి ప్రాకారంలో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. వేద ఘోష, మంగళ వాయిద్యాల నడుమ శ్రీవారి మూలవర్లకు, ఉత్సవ మూర్తులకు, జయవిజయులకు, గరుడాళ్వారుకు, వరదరాజస్వామివారికి, వకుళమాత అమ్మవారికి, ఆనంద నిలయం, యాగశాల, విష్వక్సేనులకి, యోగనరసింహ స్వామికి, భాష్యకార్లకు, పోటు తాయారుకు, ధ్వజస్తంభం, బలిపీఠం, భూవరాహ స్వామికి, బేడి ఆంజనేయస్వామికి పవిత్రమాలలు సమర్పించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పవిత్రోత్సవాలు తిరుమలలో 1516 శతాబ్దాల వరకు జరిగినట్టు ఆధారాలున్నాయి. 1962వ సంవత్సరం నుండి దేవస్థానం ఈ ఉత్సవాలను పునరుద్ధరించింది. స్వామివారి ఉత్సవమూర్తులకు కావలసిన పవిత్రాలు చేయడానికిగాను శ్రేష్టమైన జాతి పత్తి మొక్కలను అత్యంత పవిత్రమైన దైవమొక్కగా భావించే తులసి పెంచడానికి ఉపయోగించే పెరటి భూమిలో పెంచడం విశేషం. పవిత్రాలను తయారు చేయడానికి 20 మూరల పట్టుదారం గానీ 200 మూరల నూలుదారం గానీ ఉపయోగిస్తారు. ఈ దారాలకు తెలుపుతో పాటు నలుపు, ఎరుపు, ఆకుపచ్చ, పసుపుపచ్చ రంగులు అద్దకం చేస్తారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ.వెంకయ్య చౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ,అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



### శ్రీవారి ఆశీస్సులందరిపై ఉండాలి: ప్రముఖులు



**తిరుమల,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి ఆశీస్సులతో తెలుగుప్రజలందరికీ శుభాలు కలగాలని ప్రముఖులు ఆకాంక్షించారు. సోమవారం ఉదయం తిరుమలకు ప్రముఖులు పోటెత్తారు. ఉదయం విఐపి బ్రేక్ లో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపిలు సానా సతీష్, భాష్యం రామకృష్ణ, అప్పలనాయుడు, వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ, సినీనటి మంగ్లీ శ్రీవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



### రూ.60లక్షల విలువైన కంప్యూటర్లు విరాళం


**తిరుమల,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:**టిటిడి అవసరాలకు సంబంధించి దాత 60లక్షల విలువైన కంప్యూటర్లును విరాళంగా ఇచ్చారు. సోమవారం ఉదయం మాధవరాయుడుపాలెం గ్రామసర్పంచ్ (జేగురుపాడుతూర్పుగోదావరి) అన్నందేవుల వీరవెంకట సత్యనారాయణ 60లక్షలు విలువైన 50 హెచ్.పి. కంప్యూటర్‌లను టిటిడి అదనపుఇఒ వెంకయ్య చౌదరికి విరాళంగా అందించారు.



### విలువలతో కూడిన విద్యే ఉత్తమ సమాజానికి పునాది
#### 'సద్గమయ'లో డాక్టర్ మేడసాని మోహన్

**తిరుమల,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** విద్యార్థుల్లో నైతిక విలువలు సత్ప్రవర్తన, ఆధ్యాత్మిక అవగాహనతో సనాతన ధర్మంపై జ్ఞానాన్ని పెంపొందించడమే 'సద్గమయ' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి డాక్టర్ మేడసాని మోహన్ తెలిపారు. టిటిడి డిపిపి ఆధ్వర్యంలో తిరుపతిలో సోమవారం సద్గమయ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు విలువలు, సంస్కారం, ఆధ్యాత్మిక చైతన్యం అందిం చినప్పుడే ఉత్తమ వ్యక్తిత్వం, బాధ్యతాయుత పౌరసమాజం నిర్మాణ మవుతుందన్నారు. వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాలు, భగవద్గీతతో పాటు మహనీయుల జీవితాలు, వారి బోధనల ద్వారా విద్యార్థులకు విలువాధారిత విద్యను అందించనున్నట్లు తెలిపారు. నీతి పద్యాలు, సుభాషితాలు, ఎంపిక చేసిన పద్యాలను విద్యార్థులు నేర్చుకుని, వాటి భావాలను అర్థం చేసుకుని జీవితంలో ఆచరించేలా ప్రోత్సహిస్తామన్నారు. దీనివల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, వ్యక్తీకరణ సామర్థంతో పాటు నైతిక వ్యక్తిత్వం కూడా వికసిస్తుందని వివరించారు. టిటిడి పాఠశాలల్లో 1,678 మంది విద్యార్థులకు సద్గమయ ఈనెల 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిపిపి అదనపు కార్యదర్శి కల్యాణి,ఎఇఒ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లిక్కర్ స్కాం దోషులను వదలం
## లక్షల కోట్లు దోచుకుని విదేశాల్లో దాచుకున్నారు:మంత్రి పార్థసారథి



**విజయవాడ,ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** లిక్కరు స్కామ్‌తో ప్రమేయం ఉన్న ఎవ్వరిని వదిలిపెట్టమని ఏపీ సమాచార శాఖా మంత్రి మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేసారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీ స్థాయిలో మద్యం కుంభకోణం జరిగిందని ఆరోపించారు. సుమారు రూ.3,500 కోట్ల లిక్కర్ స్కామ్ జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ మద్యం పాలసీని మార్చి వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. మద్యం తయారీ, రవాణా, హోలోగ్రామ్‌ల వ్యవహారాల్లో అక్రమంగా డబ్బులు సంపాదించి, వాటిని రహస్య ప్రాంతాల్లో దాచుకున్నారని మంత్రి ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతుంటే.. రాజకీయ కక్ష సాధింపుగా చిత్రీకరిస్తూ ఎదురు దాడికి దిగుతున్నారని విమర్శించారు. లిక్కర్ స్కామ్‌లో స్పష్టమైన ఆధారాలు ఉండటం వల్లే సుప్రీంకోర్టు, హైకోర్టులు కూడా కారుమూరి కుటుంబానికి బెయిల్ ఇవ్వలేదని పార్థసారథి పేర్కొన్నారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసి రాష్ట్రానికి నష్టం కలిగించిన వారిని కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని మంత్రి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో బలహీన వర్గాలకు ప్రాధాన్యం, గౌరవం ఉంటాయని పార్థసారథి అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై సోషల్ మీడియాలో మద్యం బ్రాండ్ల వ్యవహారంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని మంత్రి పార్థసారథి కోరారు. మద్యం వ్యాపారం ద్వారా వచ్చిన అక్రమ సొమ్మును విదేశాల్లో మైనింగ్, రియల్ ఎస్టేట్ వంటి వ్యాపారాల్లోకి మళ్లించారని పార్థసారథి ఆరోపించారు. తమపై కేసులు నమోదైతే కోర్టులపై నమ్మకం లేదంటూ, రాజకీయ కక్ష సాధింపుగా ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యత లేని మద్యం బ్రాండ్లను రాష్ట్రంలోకి తీసుకువచ్చి ప్రజల ఆరోగ్యానికి నష్టం కలిగించారని మంత్రి ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో కారుమూరి నాగేశ్వరరావు కూడా ఇరుక్కున్నారని ఆయన పేర్కొన్నారు.మద్యం రవాణా ఛార్జీల విషయంలోనూ అక్రమాలు జరిగాయని పార్థసారథి ఆరోపించారు. గతంలో రూ.13గా ఉన్న ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీని ప్రభుత్వ మద్దతుతో రూ.35కు పెంచుకుని సుమారు రూ.400 కోట్ల మేర అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. మద్యం వ్యాపారం, రవాణా కాంట్రాక్టులకు సంబంధించిన విషయాలను కారుమూరి కుటుంబ సభ్యులే అంగీకరించారని మంత్రి పేర్కొన్నారు. మద్యం ద్వారా వచ్చిన అక్రమ సొమ్మును కుటుంబ సభ్యులు, సంస్థలతో పాటు మహిళల బ్యాంకు ఖాతాల్లోకి కూడా మళ్లించారని ఆరోపించారు. ప్రజల ప్రయోజనాల కోసం కాకుండా అప్పటి సీఎం వైఎస్ జగన్ తన ఆర్థిక ప్రయోజనాల కోసమే మద్యం పాలసీని రూపొందించారని విమర్శించారు. చేసిన అవినీతి, అక్రమాల నుంచి తప్పించుకునేందుకు కులాలు, మతాలను అడ్డుపెట్టుకుంటున్నారని పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్ కసిరెడ్డి వంటి సలహాదారుల సహకారంతో ఈ విధానాన్ని రూపొందించారని ఆయన ఆరోపించారు. బలహీన వర్గాలకు చెందిన నాయకులను మద్యం వ్యవహారంలో పావులుగా ఉపయోగించుకుని, చివరకు వారినే బాధ్యులను చేశారని వ్యాఖ్యానించారు.

# పులివెందుల మంచి నీటి పథకానికి పునరుజ్జీవం
## డి.సిఎం పవన్ చొరవతో తీరనున్న ప్రజల దాహార్తి



**విజయవాడ,ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** పులివెందుల మంచి నీటి పథకానికి పునరుజ్జీవం కల్పించినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. డీసీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకట నను అనుసరించి జల్ జీవన్ మిషన్ అమరజీవి జలధార కింద రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన మంచి నీటి ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లా, పులివెందుల నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేసేందుకు పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టారు. దాదాపు రూ. 426 కోట్ల విలువైన గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. ఏడు మండలాల పరిధిలో ఐదున్నర లక్షల మంది ప్రజల దాహార్తి తీర్చే లక్ష్యంతో రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో జల్ జీవన్ మిషన్ కింద ప్రారంభమైన పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం పనులు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమృద్ధిగా ఉన్నప్పటికీ పనులను ముందుకు తీసుకువెళ్లే అంశంలో శ్రద్ధ చూపలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జల్ జీవన్ మిషన్ పనుల మీద జరిగిన తొలి సమీక్షలోనే పవన్ కల్యాణ్ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పథకాలను సైతం ప్రాధాన్య క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి జల్ జీవన్ మిషన్ గడువు కూడా పూర్తి కావడంతో, కేంద్రం వద్ద ఉన్న మిగులు నిధులు ఖర్చు చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఉప ముఖ్యమంత్రి, కూటమి నాయకులు చేసిన ప్రయత్నాల ఫలంగా జల్ జీవన్ మిషన్‌ను మరో 4 ఏళ్ల పాటు పొడిగించేందుకు కేంద్రం అంగీకారం తెలపడంతో పులివెందుల మెగా తాగునీటి సరఫరా పథకం తిరిగి ఊపిరి పోసుకుంది.

అప్పటి నుంచి పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో దాదాపు రూ. 280 కోట్లు ఒక్క పులివెందుల పథకానికే కేటాయించి వేగంగా పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో అరకొర పైప్‌లైన్లు వేయడం మినహా పెద్దగా పనులేమీ పూర్తి కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 96 శాతం పనులు పూర్తి చేశారు. అందులో పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఇప్పటికే ఈ పథకం ద్వారా తాగునీరు అందుతోంది. పులివెందుల పట్టణానికి సంబంధించిన పనులు కూడా 100 శాతం పూర్తయ్యాయి. లింగాల మండలం పరిధిలో 27 ఆవాసాలకు గాను 24 ఆవాసాలకు త్వరలో తాగునీరు అందుతోంది. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులు పూర్తి కాగా, 65 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంట్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్‌కుగాను 1,106 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయ్యింది. ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణం కూడా దాదాపు తుది దశకు చేరింది.

# గోదావరి పుష్కరాలకు భారీగా వైద్యసేవలు
## మంత్రి సత్యకుమార్ యాదవ్



సోమవారం అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

**సచివాలయం,ఆగస్టు 24,ప్రభాతవార్త :** గోదావరి పుష్కరాలు-2027ను పురస్కరించుకొని వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా భారీ ఎత్తున ఏర్పాట్లు జరగబోతున్నాయి.గత పుష్కరాల సందర్భంగా భక్తులకు వైద్యసేవల్ని అందించడంలో ఎదురైన ఇబ్బందుల్ని దృష్టి లో పెట్టుకొని ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలని అధికారులను రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.2027జూన్ 26నుంచి జూలై 7వ రకు 12రోజులపాటు జరిగే పుష్కరాలకు 8నుంచి 10కోట్ల మంది భక్తులు వస్తారన్న అంచనాలకు అనుగుణంగా చర్యలు ఉండాలని స్పష్టంచేశారు. మంగళగిరి ఏపిఐఐసిలోని వైద్య,ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ అన్ని విభాగాల అధిపతులతో మంత్రి సోమవారం రెండు గంటల పాటు గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై క్షుణ్ణంగా చర్చించారు. వైద్య,ఆరోగ్య శాఖ తీసుకునే చర్యలకు సుమారు 490సివిల్ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రాథమిక స్థాయిలో రూ.93 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు. గత పుష్కరాల్లో 225ఘాట్లను ఏర్పాటు చేయగా,ఈసారి మరో 300ఘాట్లను ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు.తూర్పు గోదావరి,పశ్చిమ గోదావరి, డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, కాకినాడ,పోలవరం జిల్లాల్లో మొత్తం 525ఘాట్లను సిద్ధం చేయనున్నారు.ఘాట్లను భక్తుల రద్దీ ఆధారంగా మూడు కేటగిరిలుగా విభజించారు.అత్యధికంగా కోనసీమలో 175, తూర్పు గోదావరిలో 167 ఘాట్లు ఉన్నాయి. భక్తుల ఆరోగ్యరక్షణకు 1110 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు.వీటికి అదనంగా 950ఫస్ట్ ఎయిడ్ పోస్టులు,300హెల్త్ పోస్టులు, 30ఫీల్డ్ ఆస్పత్రులు అందుబాటులోనికి తీసుకురానున్నారు. .పోలీసు,రెవెన్యూ శాఖల సమన్వయంతో గ్రీన్ కారిడార్‌ను అమలు చేస్తారు. మొత్తం 523వాహానాలను రంగంలోనికి దించనున్నారు. 108అత్యవసర అంబు లెన్స్‌లు, 104మొబైల్ హెల్త్ యూనిట్లు,మాతా శిశు సేవలకు ప్రత్యేక వాహానాలు వృద్ధులు, దివ్యాంగుల కోసం ఫీడర్ వాహానాలు 19బోటు అంబులెన్స్‌లు నడపనున్నారు.

సమావేశంలో వైద్య,ఆరోగ్య శాఖ కార్యదర్శి జి.వీరపాండియన్,ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్‌బాబు,ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ,ఏపి శాక్స్‌ప్రాజెక్ట్ డైరెక్టర్ స్మరణ్ రాజ్,డైరెక్టర్ జనరల్ ఆఫ్ డ్రగ్ కంట్రోల్ ఆథార్టి అరుణ్‌బాబు,డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్,డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ పద్మావతి,వివిధ హోదాల్లో ఉన్న ఇతర అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పట్ట పగలే తలుపులు పగులగొట్టి చోరీ
## రూ. 5 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు, 15 వేలు నగదు అపహారణ
### లేగుంటపాడులో ఘటన

**కోవూరు (నెల్లూరు), ఆగస్టు 24, ప్రభాతవార్త :** వివాహ నిమిత్తం పక్క ఊరు వెళ్లి రెండు గంటల్లోపే కుటుంబ సభ్యులు వచ్చే సరికి ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న రూ. 5 లక్షలు విలువ చేసే నగదు, 15 వేలు నగదు గుర్తు తెలియని దొంగలు అపహరించిన సంఘటన కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఈ గ్రామానికి చెందిన దాసరి మురళి కుటుంబం వివాహం నిమిత్తం పక్క ఊరికి వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం 2 గంటల్లోగా తిరిగి వచ్చేలోగా ఇంటి తాళాలు పగలగొట్టడంతో వెంటనే కోవూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న సీఐ వి. సుధాకర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన ఇంటి పరిసరాలను నిశితంగా పరిశీలించి ఇంటి యజమాని దాసరి మురళితో దీనిపై పలు విషయాలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం చుట్టుపక్కల గ్రామస్తులతో



సీఐ మాట్లాడుతూ పట్టపగలే దొంగతనం జరుగుతున్నా కనీసం చుట్టుపక్కల వారు స్పందించకపోతే ఎలా అని ప్రశ్నించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై సత్యనారాయణ, పోలీసులు శివకృష్ణ, తదితరులు ఉన్నారు.

# వంశధార కాలువలోకి దూసుకెళ్లిన కారు
## డ్రైవర్ క్షేమం.. మృతదేహాల కోసం గాలింపు

**శ్రీకాకుళం, ఆగస్టు 24 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం కిన్నెరవాడ గ్రామ సమీపంలోని వంశధార ఎడమ కాలువలో సోమవారం మధ్యాహ్నం కారు అదుపుతప్పి పడిపోయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు నీటిలో గల్లంతయ్యారు. స్థానికులు కారు డ్రైవర్ నాగరాజును సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. కాలువలో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కారు కొట్టుకుపోయింది. డ్రైవర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం అలుదు గ్రామంలో జరిగిన వివాహానికి వెళ్లి వడ్డీనివలస రోడ్డు మీదుగా బుడితి వైపు వస్తుండగా కిన్నెరవాడ పాత బ్రిడ్జి వద్ద ఎదురుగా వచ్చిన లగేజీ వ్యాన్‌కు సైడ్ ఇచ్చే క్రమంలో కారు అదుపుతప్పి కాలువలో పడిపోయింది. స్థానికులు వెంటనే స్పందించి డ్రైవర్‌ను నీటిలో నుంచి బయటకు తీశారు. కారును బయటకు తీసేందుకు స్థానికులు ప్రయత్నించినప్పటికీ కాలువలో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కారు నీటిలో కొట్టుకు పోయింది. కారులో ఉన్న కోటబొమ్మాళి మండలం శ్రీపురం గ్రామానికి చెందిన పీస రాము, ఆయన మేనల్లుడు విశాల్‌కుమార్ నీటిలో గల్లంతైనట్లు స్థానిక ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వంశధార కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన ఇద్దరిలో పీస రాము మృతదేహం లభించగా, విశాల్‌కుమార్ మృతదేహం లభించాల్సి ఉందని అధికారులు తెలిపారు. కాగా కారు



డ్రైవర్ నాగరాజు మద్యం సేవించినట్లు స్థానికులు చెబుతున్నప్పటికీ, దీనిపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



### 15వ రోజుకు చేరిన జూడాల సమ్మె
#### గుంటూరులో కొనసాగిన శాంతియుత నిరసన

**గుంటూరు మెడికల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:**ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాష్ట్రవ్యాప్త సమ్మె సోమవారం 15వ రోజుకు చేరుకుంది. మూడో దశలో భాగంగా 8వ రోజు కూడా జూనియర్ వైద్యులు తమ ఆందోళనను కొనసాగించారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన పీజీ వైద్యులు, వైద్య శిక్షణార్థులు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని పర్యవేక్షణాధికారి కార్యాల యం సమీపంలో శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఆందోళనలో భాగంగా సుమారు 15 మంది పీజీ వైద్యులు స్వచ్ఛందంగా మారుతూ చేపట్టే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఉదయం నుంచే తమ న్యాయ బద్ధమైన డిమాండ్లకు మద్దతుగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. రోజంతా ఆందోళన కార్యక్రమాలు కొనసాగాయి.

**వర్షాన్ని లెక్కచేయని నిరసన:** ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నప్పటికీ జూనియర్ వైద్యులు, వైద్య శిక్షణార్థులు వెనక్కి తగ్గలేదు. వర్షంలోనే నినాదాలు చేస్తూ తమ డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా నిలిచారు.

### భక్తుల భద్రతకే తొలి ప్రాధాన్యత
#### ఆక్టోపస్ మాక్‌డ్రిల్

**తిరుమల,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** రానున్న బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని సోమవారం రాత్రి తిరుమలలో ఆక్టోపస్ సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. వీఐపీలు, ప్రముఖుల రాకపోకలు అధికంగా ఉండే గాయత్రి నిలయం పరిసర ప్రాంతాల్లో భద్రతా పరిస్థితులను సమీక్షించి, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, వాహనాలపై తనిఖీలు చేపట్టారు. ప్రముఖుల కదలికల సమయంలో భద్రతా చర్యలు, సిబ్బంది అప్రమత్తత, అనుమానాస్పద కదలికల గుర్తింపు, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన వంటి అంశాలను మాక్ డ్రిల్ ద్వారా పరిశీలించారు. అనుకోని సంఘటనలు ,అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు పోలీస్, విజిలెన్స్, ఫైర్, మెడికల్, రెవెన్యూ ఆక్టోపస్ తదితర విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయడం, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వెంటనే సమాచారం చేరవేయడం పరిస్థితిని అదుపులోకి తీసుకురావడం వంటి అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

### నాన్ జీఎంఓ మొక్కజొన్న వంగడాల సృష్టి వ్యవసాయ రంగ విప్లవంలో కీలక మైలురాయి: డిసిఎం పవన్

**విజయవాడ,ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** కొత్త వంగడాన్ని ఆవిష్కరించిన గోర్మె పాప్ కార్నికా సంస్థకు పవన్ కళ్యాణ్ అభినందనలు తెలిపారు. మొక్కజొన్న సాగులో రైతులకు నాణ్యమైన, అధిక దిగుబడులు అందించే వంగడాలను అభివృద్ధి చేసిన ఏలూరు జిల్లా, ముసునూరు గోర్మె పాప్ కార్నికా సంస్థకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ "ఎక్స్" వేదికగా అభినందనలు తెలియజేశారు. వ్యవసాయ రంగ విప్లవంలో ఈ వంగడం కీలక మైలురాయిగా పేర్కొన్నారు. గోర్మె పాప్ కార్నికా సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన జన్యుపరంగా మార్పులు చెందని ) పాప్ కార్న్ మొక్కజొన్న వంగడాన్ని గౌరవ భారత ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ , గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆవిష్కరిం చడం రాష్ట్ర వ్యవసాయ రంగానికి గర్వకారణమన్నారు. ఈ పరిశోధనలు రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. జన్యుపరంగా మార్పులు చెందని వంగడాల అభివృద్ధి రైతులతోపాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వినూత్న ఆవిష్కరణను విజయవంతంగా రూపొందించిన గోర్మె పాప్ కార్నికా సంస్థ యాజమాన్యానికి, శాస్త్రవేత్తలకు, పరిశోధక బృందానికి పవన్ కళ్యాణ్ అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధి, రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.



### నోటీసు జారీచేస్తే ఓటు తొలగింపు కాదు: కలెక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, ఆగస్టు 24, ప్రభాతవార్త :**సర్ కార్యక్రమంలో భాగంగా జారీ చేస్తున్న నోటీసులపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని నోటీసు జారీచేస్తే ఓటుహక్కు కోల్పోయినట్లు కాదని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా స్పష్టం చేసారు. సోమవారం విజయవాడ తూర్పునియోజకవర్గ పరిధిలోని అయ్యప్పనగర్ స్వర్ణవార్డు కార్యాలయం వద్ద జరిగిన సర్‌నోటీసుల విచారణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా విచారణకు హాజరైన ప్రజలతో మాట్లాడి సర్ కార్యక్రమం గురించి వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటీసులు జారీ వివరాలు పరిశీలించి వాస్తవాలను నిర్ధారించుకునే ప్రక్రియలో భాగమన్నారు. జిల్లావ్యాప్తంగా 1,88, 769 మందికి నోటీసులు జారీచేసామని, వీటిలో 61284 మంది విచారణ పూర్తయ్యిందన్నారు. 64,252మందికి విచారణ గడువు ముగియటంతో రీషెడ్యూల్ చేస్తామని తెలిపారు. సందేహాల నివృత్తికోసం బిఎల్ఓలను స ంప్రదించాలని, కొత్తగా ఓటు నమోదుకు ఫారం-6తోపాటు ఫారం-7, ఫారం-8లుకూడా బిఎల్ఓల వద్ద ఉంటాయని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

### 100 టన్నుల చికెన్ వ్యర్థాలు సీజ్
#### ఎపికి తరలిస్తుండగా పట్టుకున్న అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 24,ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా వ్యవహారం మరోసారి తీవ్ర కలకలం రేపింది. నగరంలో ఉన్న కోళ్ల దుకాణాలు, చికెన్ సెంటర్లు, ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి భారీ మొత్తంలో చికెన్ వ్యర్థాలను సేకరించి ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న చేపల చెరువులకు తరలిస్తున్న ముఠాపై సైబరాబాద్ పోలీసులు, పశువైద్య శాఖ అధికారులు జాయింట్ ఆపరేషన్ చేపట్టి దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో దాదాపు 100 టన్నుల చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు, పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కోళ్ల దుకాణాలు, మాంసం ప్రాసెసింగ్ కేంద్రాల నుంచి వెలువడే చికెన్ వ్యర్థాలను కొందరు వ్యక్తులు సేకరిస్తున్నారు. ఆతర్వాత వాటిని లారీల్లో నింపి.. ఆంధ్రప్రదేశ్‌కు తరలించి.. అక్కడ చేపల చెరువుల యజమానులకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ చికెన్ వ్యర్థాల అక్రమ రవాణాకు సంబంధించి.. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన సైబరాబాద్ పోలీసులు, వెటర్నరీ అధికారులు నగరంలోని అత్తాపూర్, మియాపూర్, అమీన్‌పూర్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, చింతల్ వంటి ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా లారీల్లో తరలిస్తున్న చికెన్ వ్యర్థాలను గుర్తించి సీజ్ చేసుకున్నారు. భారీ మొత్తంలో వ్యర్థాలు పట్టుబడటంతో ఈ అక్రమ రవాణా వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ చికెన్ వ్యర్థాలను ప్రధానంగా రాత్రి వేళల్లో ఏపీకి తరలించి అక్కడి చేపల చెరువు యజమానులకు అమ్ముతున్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

### ప్రతిభే కొలమానంగా జాబ్ కేలెండర్ ద్వారా

# పోస్టులు భర్తీ: డిసిఎం పవన్



**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** యువతరం ప్రతిభే కొలమానంగా జాబ్ క్యాలెండర్ ద్వారా పోస్టులు భర్తీ చేస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీకి కట్టుబడి కూటమి ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధికి ఇదొక నిదర్శనంగా అభివర్ణించారు. ఈ జాబ్ క్యాలెండర్ ప్రకారం గ్రూప్1లో 149 పోస్టులు, గ్రూప్2లో 673 ఉద్యోగాలు, డీఎస్సీ ద్వారా 2,991 ఉపాధ్యాయ పోస్టులతో పాటు పోలీస్, ఫైర్, జైళ్లు, అటవీ, పశుసంవర్ధక శాఖలు, ఎక్సైజ్, ఇంజినీరింగ్, విద్యుత్ శాఖలలో ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. మొదటి దశలో ఉన్నత విద్యాశాఖకు చెందిన 1,523 పోస్టులకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. ఉన్నత విద్యాశాఖ ద్వారా మే 15నే నోటిఫికేషన్ జారీ చేసి భర్తీ ప్రక్రియ ప్రారంభించారు. మిగిలిన మూడు దశల నోటిఫికేషన్ల కోసం ఆర్థికశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రెండో దశ నోటిఫికేషన్ సెప్టెంబర్ 15 విడుదల కానుంది. ఈ దశలో మొత్తం 3,231 పోస్టులకు నోటిఫికేషన్లు రానున్నాయి.ఇందులో 149 గ్రూప్1 పోస్టులు ఉన్నాయి. డిప్యూటీ కలెక్టర్లు 11, డీఎస్పీ సివిల్ 36, పంచాయతీ రాజ్ డీడీవోలు 35 పోస్టులతో పాటు మున్సిపల్ కమిషనర్, కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు ఇందులో ఉన్నాయి. ఇక ఇదే దశలో పోలీస్, ఫైర్, జైళ్ల శాఖలో భారీగా కొలువులు భర్తీ చేయనున్నారు. 542 సివిల్ కానిస్టేబుల్స్, 205 ఏఆర్ కానిస్టేబుల్స్, 182 సివిల్ ఎస్సై, 116 ఏఆర్ ఎస్సై పోస్టులు నోటిపై కానున్నాయి. ఫైర్ మెన్, జైలు వార్డర్ పోస్టులు, 164 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు ఈ ఫేజ్ లోనే భర్తీ కానున్నాయి.మూడో దశ అక్టోబర్ 15న నోటిఫికేషన్ రానుంది. ఈ దశలో మొత్తం 2,311 పోస్టులను భర్తీ చేస్తారు. ప్రధానంగా గ్రూప్2 అభ్యర్థులకు ఇది కీలకమైన దశ. 673 గ్రూప్2 పోస్టుల్లో రెండు వందలు డిప్యూటీ తహసీల్దార్, 176 డిప్యూటీ ఎంపీడీవో, 40 జీఎస్టీ ఆఫీసర్ (తిదిగివీ) పోస్టులు ఉన్నాయి.ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్లు 25, ఎక్సైజ్ కానిస్టేబుళ్లు 400 పోస్టులు భర్తీ చేయనున్నారు. అలాగే ఇంజనీరింగ్, విద్యుత్ శాఖల్లో ఏఈఈ పోస్టుల భర్తీ కూడా ఇదే దశలో ఉండబోతోంది. ఇరిగేషన్‌లో 224, పంచాయతీరాజ్‌లో 173, రోడ్లుభవనాల శాఖలో 79 ఏఈఈ పోస్టులతో పాటు ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో ఏకంగా 629 ఏఈఈ పోస్టుల భర్తీకి అక్టోబర్ 15న ప్రకటన వెలువడనుంది. నాలుగో దశ అక్టోబర్ 15న నోటిఫికేషన్ రానుంది. ఈ దశ పూర్తిగా ఉపాధ్యాయ కొలువులకు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ ద్వారా 2,995 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ తదితర ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ వ్యవస్థలను మరింత బలోపేతం చేయడమే జాబ్ క్యాలెండర్ లక్ష్యమని తెలిపారు. ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారు ఈ క్యాలెండర్‌కు అనుగుణంగా సిద్ధం కావాలన్నారు. కష్టపడి చదివి తమ ప్రతిభను నిరూపించుకునే వారికి ఈ నియామకాలు మంచి అవకాశంగా నిలుస్తాయని పవన్ తెలిపారు. మెరిట్ ఆధారంగా పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు.



# సౌదీఅరేబియా సమీపంలో ట్యాంకర్‌కు నిప్పు

### గుర్తుతెలియని క్షిపణి దాడి

**జెడ్డా, ఆగస్టు 24:** సౌదీ అరేబియాలోని ఎర్ర సముద్ర తీరానికి సమీపంలో సోమవారం ఓ చమురు ట్యాంకర్‌ను గుర్తుతెలియని క్షిపణి ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ట్యాంకర్‌లోని సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని బ్రిటన్‌కు చెందిన సముద్ర రవాణా సంస్థ యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ తెలిపింది. మంటల కారణంగా ఎలాంటి పర్యావరణ ముప్పు ఏర్పడినట్లు సమాచారం లేదని పేర్కొంది.సౌదీ అరేబియాలోని యన్బు నగరానికి 63 నాటికల్ మైళ్ల పశ్చిమాన ఈ ఘటన జరిగినట్లు యుకెఎంటివో వెల్లడించింది. యెమెన్‌కు వందల కిలోమీటర్ల దూరంలో ఉత్తరంగా యెన్బు ఉంది. ఇరాన్ మద్దతుతో పనిచేస్తున్న హౌతీల నుంచి ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలకు భద్రతా ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో తాజా ఘటన చోటుచేసుకుంది.ఈ నెల ప్రారంభంలోనూ సౌదీ సంబంధాలున్న ఓ ట్యాంకర్‌పై దాడి చేసినట్లు హౌతీ గ్రూప్ ప్రకటించింది. ఎర్ర సముద్రంలో జరిగిన ఆ దాడిలో కనీసం ఆరుగురు మరణించగా, మరో 10 మంది గాయపడినట్లు సమాచారం. తొలిదాడిలో ముగ్గురు పాకిస్థానీలు, ఒక ఇండోనేషియా వ్యక్తి సహా నలుగురు సిబ్బంది మృతి చెందారు. అనంతరం నౌకలోని వారిని తరలించేందుకు వచ్చిన సహాయక బృందాన్ని లక్ష్యంగా చేసుకుని రెండో క్షిపణి దాడి జరిగిందని యెమెన్ కోస్ట్ గార్డ్ తెలిపింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్‌లు ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన తర్వాత ఓ నౌకపై హౌతీలు జరిపిన తొలి ప్రాణాంతక దాడి ఇదే. జూలై 29న కూడా హౌతీలు ఓ సౌదీ చమురు ట్యాంకర్‌పై దాడి చేశారు. అంతకుముందు జూలైలో ఎర్ర సముద్రం మీదుగా సౌదీ అరేబియా నుంచి, సౌదీ అరేబియాకు వెళ్లే నౌకా రవాణాను దిగ్బంధిస్తామని హౌతీలు ప్రకటించారు. మరోవైపు, మార్చి నుంచి ఇరాన్ హోర్ముజ్ జలసంధిని ఇరాన్‌దిగ్బంధించడంతో సౌదీ అరేబియా తన చమురు ఎగుమతుల కోసం ఎర్ర సముద్రంలోని నౌకాశ్రయాలపై మరింతగా ఆధారపడాల్సి వస్తోంది.యెమెన్‌లోని ఎర్ర సముద్ర తీరప్రాంతంలో, ముఖ్యంగా బాబ్ అల్‌మందబ్ జలసంధి సమీపంలోని ప్రాంతాల్లో హౌతీలకు నియంత్రణ ఉంది. ఎర్ర సముద్రాన్ని హిందూ మహాసముద్రంతో అనుసంధానించే ఈ మార్గం ప్రపంచంలోని అత్యంత రద్దీగా ఉండే సముద్ర రవాణా మార్గాల్లో ఒకటి. ఇక్కడ నౌకా రవాణాకు దీర్ఘకాలిక అంతరాయం ఏర్పడితే ఆసియా మార్కెట్లకు వెళ్లే సరకు రవాణాపై ప్రభావం పడటంతో పాటు, నౌకలు మరింత సుదీర్ఘమైన ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

# ఉద్యోగం రాలేదని డిప్రెషన్‌లోకి..

### అమెరికాలో హైదరాబాద్ యువకుడి ఆత్మహత్య



**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త :** అమెరికా (యుఎస్‌ఏ)లో ఉన్నత విద్య పూర్తిచేసి మంచి భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న హైదరా బాదీ యువకుడు సాయిప్రదీప్ జీవితం విషాదాంతమైంది. హైదరాబాద్‌లోని దమ్మాయిగూడ శ్రీనివాస నగర్ కాలనీకి చెందిన సాయిప్రదీప్ 2024 లో ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లాడు. టెక్సాస్ రాష్ట్రంలోని శాన్ ఆంటోనియోలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. చదువు పూర్తయిన తర్వాత అక్కడే ఉద్యోగం సాధించి స్థిరపడాలని భావించాడు.అయితే గత నాలుగు నెలలుగా ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నా ఆశించిన ఫలితం దక్కలేదు. వరుసగా అవకాశాలు చేజారడంతో తీవ్ర ఒత్తిడికి లోనైన సాయిప్రదీప్ మానసికంగా కుంగిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ఈనెల 21న శాన్‌ఆంటోనియోలోని తన గదిలో సాయిప్రదీప్ ఆత్మహత్య చేసుకున్నాడు.



సోమవారం గన్నవరం విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్

# గన్నవరం విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతికి ఘనస్వాగతం

**గన్నవరం, ఆగస్టు24, ప్రభాతవార్త:** భారత ఉపరాష్ట్రపతి సీపి.రాధాకృష్ణన్‌కు పలువురు ప్రముఖులు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికారు. ఏలూరుజిల్లా ముసునూరులో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉపరాష్ట్రపతి వాయుసేన ప్రత్యేక విమానంలో సోమవారం ఉదయం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. రాష్ట్రగవర్నర్ అబ్దుల్ నజీర్, ఐటిశాఖా మంత్రి నారా లోకేష్, సమాచారశాఖామంత్రి కొలుసు పార్థసారథి, ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, శాసనమండలి ఛీఫ్‌విప్ పంచుమర్తి అనురాధ, ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజ, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, బోడే ప్రసాద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా తదితరులు విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతికి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, జిల్లాకలెక్టర్ డికె.బాలాజీ, ఏలూరురేంజ్ ఐజి అశోక్‌కుమార్, జిల్లాఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జాయింట్ కలెక్టర్ నవీన్, సహాయకలెక్టర్ నమ్రత, తది తరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన గవర్నర్‌తో కలిసి ప్రత్యేక కాన్వాయ్‌లో రోడ్డుమార్గాన ముసునూరు తరలి వెళ్ళారు.

**ఉపరాష్ట్రషపతికి వీడ్కోలు**

ముసునూరులో కార్యక్రమం అనంతరం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతికి గవర్నర్ అబ్దుల్ నజీర్, ఐటిశాఖా మంత్రి నారా లోకేష్, వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రభు త్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్, శాసనమండలి ఛీఫ్‌విప్ పంచుమర్తి అనురాధ, పలువురు అధికా రులు విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతికి వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన వాయుసేన ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీ తరలి వెళ్ళారు.

# కడప బేసిన్‌లో లక్షల కోట్ల విలువైన ఖనిజ నిక్షేపాలు: మంత్రి రవీంద్ర

### సిఎస్ఐఆర్- ఎన్‌జిఆర్ఐతో ఎపి ప్రభుత్వం చరిత్రాత్మక ఒప్పందం

**విజయవాడ,ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని కడప ప్రాంతం దేశ ఇంధన, పారిశ్రామిక రంగాల భవిష్యత్తును మార్చే ప్రధాన ఖనిజ కేంద్రంగా అవతరించబోతోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు హైదరాబాద్ సీఎస్ఐఆర్ -నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిటికల్ మినరల్స్ రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఇంటరాక్షన్ సమావేశంలో పాల్గొన్నారు. ఆర్ అండ్ డి కేంద్రంలోని'సీఎస్ఐఆర్- ఎన్‌జీఆర్ఐ ల్యాబ్స్ పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కడప వెంపల్లె పరిధిలో ముఖ్యంగా తుమ్మలపల్లె ప్రాంతంలో అత్యంత విలువైన వ్యూహాత్మక ఖనిజాలైన లిథియం, గాలియం నిక్షేపాలు భారీగా ఉన్నట్లు శాస్త్రవేత్తల పరిశోధనల్లో వెల్లడైంది. ఈ నిక్షేపాల అధునాతన అన్వేషణ కోసం ఆంధ్రప్రదేశ్ గనులు, భూగర్భ వనరుల శాఖ.. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పరిశోధనా సంస్థ నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌తో చారిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. సుమారు రూ. 13 లక్షల కోట్లకు పైగా విలువైన నిక్షేపాలు కడప బేసిన్ వెంపల్లె ఫార్మేషన్‌లో ఉన్నట్లు గుర్తించారు. అక్కడి భూగర్భంలో 1000 పిపిఎం వరకు లిథియం, 250 పిపిఎం వరకు గాలియం ఉన్నట్లు గుర్తించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం.. సుమారు రూ.2 లక్షల కోట్ల విలువైన లోహాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ నిక్షేపాలను పూర్తిగా వెలికితీసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తోంది. 2027లో ప్రారంభమయ్యే ఈ ప్రాజెక్టు 2032 నాటికి పూర్తి కానుంది. ఈ ఐదేళ్ల అన్వేషణ కార్యక్రమానికి అయ్యే వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ భరిస్తుంది. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్‌పై ఎలాంటి అదనపు ఆర్థిక భారం పడదు. కడప బేసిన్ పరిధిలో ఖనిజాలు ఎక్కడెక్కడ విస్తరించి ఉన్నాయో గుర్తించడానికి, లోతైన భూగర్భ పరిశోధనల కోసం అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగించనున్నారు. వైమానిక భూభౌతిక సర్వేలు, శాటిలైట్ రిమోట్ సెన్సింగ్, ఖనిజ లక్ష్యకరణ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ త్రీడీ సబ్ సర్ఫేస్ మోడలింగ్ చేపట్టనున్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా విద్యుత్ వాహనాలు, సెమీకండక్టర్లు, అధునాతన ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ మరియు రక్షణ రంగాలకు లిథియం, గాలియం వంటి క్రిటికల్ మినరల్స్ అత్యంత కీలకం. ప్రస్తుతం భారతదేశం వీటి కోసం ఇతర దేశాల దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఖినేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌ఖి లో భాగంగా ఈ ప్రాజెక్టు దేశానికి వ్యూహాత్మక ఆస్తిగా మారబోతోంది. కేవలం ఖనిజాల తవ్వకమే కాకుండా, ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న విస్తారమైన తీరప్రాంతం, ఓడరేవులు మరియు అనుకూల పారిశ్రామిక విధానాలను సద్వినియోగం చేసుకుని రాష్ట్రంలోనే ఖనిజ ప్రాసెసింగ్, రిఫైనింగ్, మరియు బ్యాటరీల తయారీ వంటి దిగువశ్రేణి పరిశ్రమలను కూడా పెద్ద ఎత్తున ప్రోత్సమిస్తాం. తద్వారా స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డా.ప్రకాశ్ కుమార్ నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్త డా.బి.శ్రీనివాస్ గారు, ఇతర మైన్స్ అండ్ జియాలజీ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.



క్రిటికల్ మినరల్స్ రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఇంటరాక్షన్ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర

# సంగంబండ రైట్ హైకెనాల్ కాల్వకు గండి

### చివరి ఆయకట్టుకు అందని సాగునీరు

### సాగునీటి కోసం రైతుల ఎదురుచూపు

### పట్టించుకోని సంబంధిత అధికారులు

**మాగనూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త :** సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ రైట్ హై లెవెల్ కాల్వకు సోమవారం తెల్లవారుజామున నేరడగం శివారులో గండి పడింది. నీటి ప్రవాహానికి వర్క్యూర్ శివారులో ఉన్న దాదాపు 30 ఎకరాల పొలంలోకి నీరు చేరి పంటలకు నష్టం కలిగించిందని రైతులు వాపోతున్నారు. కాలువలు అస్తవ్యస్తంగా మారడంతో నీటి ప్రవాహం ముందుకు పోకుండా మధ్యలో ఇలా గండ్లు పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. రైతులు మాట్లాడుతూ రిజర్వాయర్ రైట్ హై లెవెల్ కెనాల్ కాల్వకు గత కొన్ని సంవత్సరాలుగా మరమ్మత్తులు చేయడం లేదని, నామమాత్రంగా పెరిగిన తుంగను అక్కడక్కడ తీసి వదిలేస్తున్నారని అన్నారు. పూర్తిస్థాయిలో కాలువ పూడిక తీయకపోవడంతో పంటలకు సరిపడా సాగు నీరు అధికారులు విడుదల చేసినప్పుడు కాల్వలలో చెత్త చెదారం అడ్డు పడడంతో కాల్వ కోతకు గురై గండ్లు పడుతున్నాయని రైతులు అస హనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాలపై పలుమార్లు సంబంధిత అధికా రుల దృష్టికి తీసుకెళ్లిన ఏ ఒక్కరు పట్టించు కోవడంలేదని కాలువల వెంబడి బండి తోవలు కూడా చేసుకున్న సంఘటనలు ఉన్నాయని ఈ విషయాలపై ఏ ఒక్క అధికారి పట్టించుకోవడంలేదని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా గండిలను సరిచేసి సాగునీరు వృధాగా పారకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కాలువలు పూడికలు తీసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని రైతన్నలు ఆకాంక్షి స్తున్నారు.




కాల్వకు గండి పడడంతో పొలాల్లోకి భారీగా నీరు చేరిన దృశ్యం

# రైతు నాయకుడు, సిపిఎం సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూత

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఆగస్టు 24, ప్రభాతవార్త:** అఖిల భారత కిసాన్ సభా ఉపాధ్యక్షుడు, సిపిఎం సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి (90) సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. వయోభారంతోపాటు శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన, గత నాలుగు రోజులుగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆరోగ్యం మరింత క్షీ ణించడంతో వైద్యులు అత్యవసర చికిత్స అందించి నప్పటికీ ఫలితం లేకపోయింది. సోమవారం తెల్ల వారుజామున 3.30 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచి నట్లు నిమ్స్ వైద్యులు ధ్రువీకరించారు. జీవితాంతం వ్యవసాయరంగ పరిరక్షణ, రైతాంగ హక్కుల కోసం పోరాడారు. అఖిల భారత కిసాన్ సభా ఉపాధ్యక్షుడిగా దేశవ్యాప్తంగా రైతు ఉద్యమాలను ఏకీకృతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. సిపిఎం పార్టీలో సుదీర్ఘకాలం పనిచేస్తూ, సామాజిక, రాజకీయ పోరాటాల్లో నిత్యం ముందుభాగాన నిలిచారు. కార్మిక, గిరిజన సమస్యలు, రైతుల సమస్యలతోపాటు కౌలు రైతులు, వ్యవ సాయ కార్మికుల హక్కుల కోసం ఎన్నో ఆందోళన కార్యక్రమాలకు నాయకత్వం వహించారు.

# కేన్సర్ కణాల్లోనే పనిచేసే స్మార్ట్ డ్రగ్

### కిమోథెరపీకి ప్రత్యామ్నాయంగా కొత్త ఆశలు




**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** కేన్సర్ కణాల్లోకి ప్రవేశించిన తర్వాత మాత్రమే యాక్టివేట్ అయి, ఆరోగ్యకరమైన కణాలకు హాని కలిగించకుండా పనిచేసే కొత్త స్మార్ట్ కేన్సర్ ఔషధాన్ని భారత శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. సంప్రదాయ కీమోథెరపీలో కేన్సర్ కణాలతోపాటు ఆరోగ్యకరమైన కణాలు కూడా దెబ్బతినడం వల్ల అనేక దుష్ప్రభావాలు ఎదురవుతాయి.

ఈ నేపథ్యంలో సాధా రణ కణజాలాల్లో నిష్క్రియంగా ఉండి, కేవలం కణితి ప్రాంతంలోనే క్రియాశీలమయ్యే చికిత్సల అభివృద్ధికి ఈ పరిశోధన కీలక ముందడుగుగా భావిస్తున్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ ఆధ్వర్యంలోని స్వయం ప్రతిపత్తి సంస్థకు చెందిన డాక్టర్ అసిస్ బాలా, ఐఐటీ గువాహటి పరిశోధకుడు డాక్టర్ కె.పి భబక్ నేతృత్వంలోని సంయుక్త బృందం ఆర్‌కె-251 అనే కొత్త స్మార్ట్ కేన్సర్ డ్రగ్‌ను అభివృద్ధి చేసింది. కేన్సర్ కణాల్లోనే యాక్టివేట్ అయి కేన్సర్ కణాల్లో.. సాధారణ కణాలతో పోలిస్తే రియాక్టివ్ ఆక్సిజెన్ స్పెసీస్ ఆర్వోఎస్ అనే హానికర అణువులు అధిక స్థాయిలో ఉంటాయి.

ఆర్‌కె-251 కేన్సర్ కణంలోకి చేరినప్పుడు అక్కడి అధిక ఆర్వోఎస్ స్థాయి ఔషధాన్ని యాక్టివేట్ చేస్తాయి. దీంతో ఎన్బిడిహెచ్ఇఎక్స్ అనే శక్తివంతమైన యాంటీకేన్సర్ సమ్మేళనం విడుదలవుతుంది. ఈ సమ్మేళనం కేన్సర్ కణాలు జీవించడానికి, చికిత్సను తట్టు కోవడానికి ఉపయోగించుకునే కీలక టార్గెట్ ప్రోటీన్లను అడ్డుకుంటుంది. తద్వారా కేన్సర్ కణాలపై ప్రభావం చూపేలా ఈ ఔషధాన్ని రూపొం దించారు. ప్రాథమిక దశ ప్రయోగాల్లో ఆర్‌కె-251 దూకుడైన ట్రిపుల్ నెగెటివ్ బ్రెస్ట్ కేన్సర్ కణాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపించింది.

అదే సమయంలో ఆరోగ్యకరమైన కణాలపై దీని ప్రభావం చాలా తక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. జీబ్రాఫిష్ పిండాలపై నిర్వహించిన ప్రవర్తనా అధ్యయనంలోనూ ఔషధం వల్ల స్పష్టమైన విషపూరిత లక్షణాలు కనిపించలేదు. అలాగే ఆర్వోఎస్ సమక్షంలో అవసరమైన ఫ్లోరోసెన్స్‌ను ప్రదర్శించింది. ఈ ఫలితాలు ఆర్‌కె-251 మరింత పరిశోధన, భద్రతా ధ్రువీకరణకు అనుకూలంగా ఉండవచ్చునే సూచనలు ఇస్తున్నాయి.

ఈ ఔషధాన్ని మనుషులపై పరీక్షించే దశకు చేరుకోవడానికి ముందు మరిన్ని ప్రయోగాలు, భద్రతా పరీక్షలు అవసరం. ఈ పరిశోధన ఎసిఎస్ జర్నల్ ఆఫ్ మెడికల్ కెమిస్ట్రీలో ప్రచురితమైంది.



హుండీ లెక్కింపులు పరిశీలిస్తున్న చైర్మన్

# సెప్టెంబర్ 4న సామూహిక వరలక్ష్మి వ్రతాలు, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 24, ప్రభాతవార్త :** సెప్టెంబర్‌న దుర్గమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఉదయం 7 నుండి 9 వరకు సామూహిక ఉచిత వరలక్ష్మి వ్రతాలు, ఉద యం 10 నుండి 11 వరకు ఉభయ దాతలు రు.1,500 ల టికెట్‌పై వరలక్ష్మి వ్రతాలు జరిపిస్తామన్నారు.

**సెప్టెంబర్4న శ్రీకృష్ణాష్టమి వేడుకలు:** దుర్గమ్మవారి ఆలయంలో సెప్టెంబర్ 4న శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. సాయంత్రం 6.30కు ఉట్టికొట్టడం కూడా నిర్వహిస్తామన్నారు. శ్రీ మహాలక్ష్మి దేవిగా అలంకరిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. శ్రావణ శుక్రవారం పూజలు శ్రీ అమ్మవారికి అర్చకస్వాములు ఏకాంతంగా నిర్వహిస్తారని ఇఓ తెలిపారు. టికెట్లు కావాల్సిన భక్తులు పాల్గొనాలనుకునే భక్తులు ముందస్తుగా అధికారిక మనమిత్ర వాట్సాప్ సేవలు ద్వారా లేదా దేవస్థానం కౌంటర్ల వద్ద టికెట్లు పొందవచ్చునని ఇఓ తెలిపారు.

**27 నుండి పవిత్రోత్సవాలు:** దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 27 నుండి 29 వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

**హుండీ లెక్కింపుల్లో రు.3కోట్ల 91లక్షలు:** దుర్గమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రు.3,91,17,684 ల నగదు తో పాటు యుఎస్ఎ డాలర్స్ 663, మలేషియా రింగేట్స్ 107, యుఎఇ దిర్హమ్స్ 840, సింగపూర్ డాలర్స్ 28, యూరోలు 85, సౌదీ రియాల్స్ 21, కువైట్ దినార్లు 15.25, ఖతార్ రియాల్స్ 2, ఒమని రియాల్స్ 6, ఒమని బైంసాలు 4100, హాంకాంగ్ డాలర్స్ 20, కెనడా డాలర్స్ 90, న్యూజిలాండ్ డాలర్స్ 20, సౌతాఫ్రికా రౌండ్స్ 200, బహ్రైనీ దినార్లు 11, బంగారం 306 గ్రాములు, వెండి 4కెజిల 170 గ్రాములు లభించినట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి రు.1,00,116ల విరాళాన్ని కడపకు చెందిన చల్ల లక్ష్మిరెడ్డి సోమవారం అందించారు. పశ్చిమగోదావరికి చెందిన రేణుక స్వాతి రు.2,11,116 విరాళం నిత్యాన్నదాన పథకానికి అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



లలిత (ఫైల్)



చంద్రకళ (ఫైల్)



నాగరాజు (ఫైల్)

# అకస్మాత్తుగా అంగన్‌వాడీ టీచర్ మృతి

### అంత్యక్రియలకు వస్తూ ప్రమాదంలో కోడలు, అల్లుడు దుర్మరణం

**లింగాల, ఆగస్టు 24, ప్రభాతవార్త :** విధులు నిర్వర్తించడానికి వస్తూ కూర్చున్న చోటనే కుప్పకూలి మృతి చెందిన అంగన్‌వాడీ టీచర్ లలిత (40) అంత్యక్రియల్లో పాల్గొనడానికి వస్తూ మార్గమధ్యంలోనే రోడ్డు ప్రమాదంలో మృతురాలి అల్లుడు నాగరాజు(35), కోడలు చంద్రకళ (32) మృతి చెందగా కొడుకు శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉన్నది. మండల పరిధిలోని రాయవరం గ్రామానికి చెందిన లలిత అంగన్‌వాడీ టీచర్‌గా అదే గ్రామంలో విధులు నిర్వర్తిస్తున్నారు. అచ్చంపేటలో ఉంటున్న ఆమె సోమవారం ఉదయం విధులకు హాజర య్యేందుకు రాయవరం రావడానికి బస్టాండ్‌కు చేరుకున్నారు. అయితే అక్కడ కొద్దిసేపటి తర్వాత ఆమెకు కళ్లు తిరగడంతో పక్కనే కూర్చున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కూర్చున్నచోటే ఆమె మృతి చెందినట్లు పేర్కొన్నారు. లలిత మృతి చెందిన విషయం కుటుంబసభ్యులకు తెలియడంతో హైదరాబాద్‌లో ఉంటున్న ఆమె కుమారుడు శ్రీకాంత్, కోడలు చంద్రకళ (32), అల్లుడు నాగరాజు (35) అచ్చంపేటకు బయలుదేరారు. ముగ్గురూ ఒకే బైక్‌పై అచ్చంపేటవైపు వస్తుండగా నల్గొండ జిల్లా డిండి సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. అచ్చంపేట నుంచి వెళ్తున్న కారు బైక్‌ను బలంగా ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో చంద్రకళ, నాగరాజు మృతి చెందగా శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. లలిత మృతి పట్ల తోటి అంగన్వాడీ టీచర్లు తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేసి, ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# జీవితాన్ని రైతుల సంక్షేమానికి అంకితం చేసిన నాయకుడు

### సారంపల్లి మల్లారెడ్డి మరణంపై తెలంగాణ సిఎం సంతాపం

**పభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు24:** రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడిన రైతు నాయకుడు, కమ్యూనిస్టు నేత సారంపల్లి మల్లారెడ్డి మరణించారని తెలిసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.రైతుల హక్కులు, వ్యవసాయ సమస్యల పరిష్కారం కోసం ముందుండి అనేక ఉద్యమాలు నడిపిం చారని గుర్తుచేశారు. రైతు సంఘం నేతగా, అఖిల భారత కిసాన్‌సభ ఉపాధ్యక్షుడిగా ఆయన అందిం చిన సేవలు చిరస్మరణీయమని పేర్కొ న్నారు. భూమి హక్కులు, సాగునీరు, వ్యవసాయ రుణా లు, విత్తనాలు వంటి వ్యవసాయ రంగానికి సంబంధించిన విస్తృత అంశాలపై నిరంతరం కృషి చేస్తూ జీవితాన్ని రైతుల సంక్షేమం కోసం అంకితం చేసిన నాయకుడు మల్లారెడ్డి అని పేర్కొన్నారు.

ఆట



## వరల్డ్ కప్ సెమీఫైనల్స్‌కు.. భారత్ పురుషుల హాకీ జట్టు అగ్నిపరీక్ష

**న్యూఢిల్లీ:** వర్డ్ కప్ సెమీఫైనల్స్ అర్హత సాధించడం భారత పురుషుల హాకీ జట్టుకు అగ్నిపరీక్ష అయింది. ప్రస్తుతం బెల్జియంలోని వావ్రే, నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టెల్వీన్‌లలో సంయుక్తంగా నిర్వహిస్తున్న 2026 ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచ కప్‌లో పోటీపడుతోంది. తమ గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచిన భారత్, ఫేజ్ 2కు చేరుకుంది. వేల్స్‌పై 3-1 తేడాతో గెలుపుతో ప్రారంభించిన భారత్, ఆ తర్వాత ఇంగ్లాండ్ చేతిలో 2-4 తేడాతో ఓటమి చవిచూసింది. అనంతరం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 5-3 తేడాతో విజయం సాధించి పుంజుకున్న భారత్, ఫేజ్ 2లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఫేజ్ 2లో భారత్ ఇప్పుడు నెదర్లాండ్స్, అర్జెంటీనా, ఇంగ్లాండ్‌లతో పూల్ ఈ లో ఉంది. రెండో రౌండ్‌ను భారత్ నెదర్లాండ్స్‌తో 1-3 తేడాతో ఓటమితో ప్రారంభించింది. ఈ ఓటమి సెమీఫైనల్స్‌కు మరింత కష్టతరం చేసినా, అవకాశాలు ఇంకా సజీవంగా ఉన్నాయి. సెమీఫైనల్స్‌కు అర్హత సాధించడానికి భారత్ ముందు మూడు అవకాశాలు ఉన్నాయి. వీటిలో భారత్ ముందుగా అర్జెంటీనాను ఓడించి, వీలైనన్ని ఎక్కువ గోల్స్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలి. ఒకవేళ భారత్ అర్జెంటీనాను 2 గోల్స్ తేడాతో ఓడించి, సెమీఫైనల్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే నెదర్లాండ్స్ ఇంగ్లాండ్‌ను 3 గోల్స్ తేడాతో ఓడించాల్సి ఉంటుంది. భారత్ అర్జెంటీనాను 3 గోల్స్ తేడాతో ఓడిస్తే, నెదర్లాండ్స్ ఇంగ్లండ్‌ను 2 గోల్స్ తేడాతో, 4 గోల్స్ తేడాతో ఓడిస్తే, నెదర్లాండ్స్ ఇంగ్లండ్‌ను ఒక గోల్ తేడాతో ఓడించాల్సి ఉంటుంది. అర్జెంటీనాపై భారత్ సాధించే విజయ మార్జిన్ ఎంత ఎక్కువగా ఉంటే, ఇంగ్లాండ్‌పై నెదర్లాండ్స్‌కు అవసరమయ్యే మార్జిన్ అంత తక్కువగా ఉంటుంది. జట్టు ఇప్పుడు నెదర్లాండ్స్ ఇంగ్లాండ్ మ్యాచ్‌పై దృష్టి సారిస్తూనే, అర్జెంటీనాపై అవసరమైన ఫలితాన్ని సాధించడంపై దృష్టి పెట్టాలి. ఫలితంతో పాటు, గెలుపు అంతరం కూడా అంతే ముఖ్యం. ఇవన్నీ జరిగితేనే పురుషుల జట్టు హాకీ ప్రపంచ కప్ సెమీఫైనల్స్‌కు చేరుకునే అవకాశం ఇంకా ఉంది.



## వరల్డ్ బ్యాడ్మింటన్ క్వీన్‌గా అన్‌సే యంగ్

**న్యూఢిల్లీ:** దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచ నంబర్ 1 క్రీడాకారిణి ఆన్ సేయంగ్ న్యూఢిల్లీలో జరిగి బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుని ప్రపంచ బ్యాడ్మింటన్ క్వీన్‌గా నిలిచింది. ఆమె జపాన్‌కు చెందిన అకానె యమగుచిని ఫైనల్‌లో కేవలం 49 నిమిషాల్లోనే 21-17, 21-14 తేడాతో ఓడించింది. పాదపు గాయంతో బాధపడుతూ ఆడినప్పటికీ, ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా ఆరు మ్యాచ్‌లనూ గెలిచి, (2023 విజయం తర్వాత) తన రెండవ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఆరంభ పోరు తర్వాత, 7-7తో సమంగా ఉన్న స్కోరు నుండి సేయంగ్ ఊపు అందుకుని, వరుసగా పాయింట్లు సాధిస్తూ విరామ సమయానికి 11-8 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే, యమగుచి ఆమెను అంత సులభంగా గెలవనివ్వలేదు. 15-15 స్కోరు వద్ద, జపనీస్ క్రీడాకారిణి కొద్దిసేపు ఊపుతో ఆడించి. అయితే 17-17 స్కోరుతో ఆట సమంగా ఉన్నప్పుడు, కొరియన్ నిర్ణయాత్మక విజృంభణ చేసి వరుసగా నాలుగు పాయింట్లతో 21-17తో ఆధిక్యంకి వచ్చింది. రెండవ సెట్‌లో, యమగుచి 6-5 ఆధిక్యంతో ప్రారంభించినప్పటికీ, సేయంగ్ నిలకడగా ఆడి 7-7తో సమం చేసింది. తర్వాత 8-7 స్కోరు వద్ద, సేయంగ్ వేగంగా డౌన్‌దిలైన్ స్మాష్‌ను కొట్టింది. యమగుచి తన రాకెట్‌ను షటిల్‌కు తగిలించగలిగింది, కానీ తేరుకునే ప్రయత్నంలో ఆమె కోర్టులో కుప్పకూలిపోయింది. సేయంగ్ మళ్ళీ డౌన్ ది లైన్ స్మాష్‌కు ప్రయత్నించి విరామ సమయానికి, ఆమె 11-7 ఆధిక్యంలో ఉంది. అదృష్టవశాత్తూ నెట్ కార్డ్ తగలడంతో యమగుచి స్కోరు అంతరాన్ని 11-9కి, ఆపై 11-10కి తగ్గించగలిగింది. 13-11 వద్ద సేయంగ్ తడబడినా 16-11 స్కోరు వద్ద యమగుచి కొట్టిన షాట్ గురితప్పింది. సేయంగ్ ఆ తర్వాతి మూడు పాయింట్లను 18-14. 19-14. 20-14తో విజయాన్ని కైవసం చేసుకుంది.

## మహిళల ఛాంపియన్స్.. గ్రూప్‌స్టేజ్‌కు అర్హత సాధించిన బెంగాల్

**న్యూఢిల్లీ:** వరుసగా రెండుసార్లు ఏఎఫ్‌సి మహిళల ఛాంపియన్స్ లీగ్ గ్రూప్ స్టేజ్‌కు అర్హత సాధించి ఈస్ట్ బెంగాల్ చరిత్ర సృష్టించింది. మ్యాచ్‌లో మలేషియా క్లబ్ సబాను 2-0 తేడాతో ఓడించిన ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సి, ఎఎఫ్‌సి మహిళల ఛాంపియన్స్ లీగ్ గ్రూప్ దశలో వరుసగా రెండుసార్లు ఆడిన తొలి భారతీయ క్లబ్‌గా నిలిచింది. కోట కినాబాలులోని లికాస్ స్టేడియంలో రెండవ అర్ధభాగంలో ఒలివియా అనోక్యే (67వ నిమిషం) మరియు సౌమ్య గుగులోత్ (87) చేసిన గోల్స్‌తో హోరాహోరీగా సాగిన పోరు ముగిసింది. దీంతో ఈస్ట్ బెంగాల్ గరిష్ట పాయింట్లతో గ్రూప్ ఎ లో అగ్రస్థానంలో నిలిచింది. ఐడబ్ల్యూఎల్ ఛాంపియన్లు అంతకుముందు రాజ్‌షాహి స్టార్స్ (బంగ్లాదేశ్)ను 4-0తోను, రోవర్స్ (గ్వామ్)ను 12-0తో ఓడించారు. ఆట ఉత్కంఠభరితంగా ప్రారంభమైన తర్వాత, 21వ నిమిషంలో మిసాకి నకయామా కొట్టిన హాఫ్‌వాలీ గోల్ పోస్ట్ పైనుంచి వెళ్ళిపోవడంతో సబా అవకాశాలను



సృష్టించడం మొదలుపెట్టింది. మైలిసా అటిస్ ఫస్ట్‌టైమ్ క్రాస్‌ను అందించగా, ఎంజీ బ్రౌసార్డ్ ప్రయత్నాన్ని విఫలం చేసింది. రెండవ అర్ధభాగంలో ఆట మరింత సమంగా సాగింది. జూలియానా బారెక్ స్లాలోమింగ్ చేస్తూ బాక్స్‌లోకి దూసుకెళ్లింది, కానీ అది విఫలమైంది. 55వ నిమిషంలో సౌమ్య దూసుకెళ్లి బంతిని అందించగా, సులంజనా రౌల్ బలంగా హెడర్ చేయగా, సబా గోల్ కీపర్ జునైదీ దానిని అడ్డుకున్నాడు. ఈస్ట్ బెంగాల్ ఊపందుకుంటున్న తరుణంలో, స్టెఫీ నుండి తప్పించుకుంటూ ముందుకు దూసుకెళ్తున్న ఒలివియాకు తర్వాతి అవకాశం లభించగా, జునైదీ చేసిన ధైర్యమైన బ్లాక్ ఆమెను అడ్డుకుంది.

సులంజన ఇచ్చిన త్రూ పాస్‌ను అందుకున్న ఒలివియా వేగంతో సితి నుర్హైజాను అధిగమించి, రెండవ ప్రయత్నంలో గోల్ చేసింది. సబ్స్టిట్యూట్ రింపా హాల్దార్ అందించిన క్రాస్‌ను సౌమ్యగోల్‌గా మలచడంతో మోషల్‌గర్ల్స్ విజయాన్ని ఖాయం చేసుకుంది.



## తొలి రెండు టెస్టుల తర్వాత.. అత్యధిక వికెట్లు తీసిన భారత్ బౌలర్లు

### టాప్ 5లో నరేంద్ర హిర్వానీ

**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో టెస్ట్ కెరీర్‌ను ఘనంగా ప్రారంభించడం చాలా అరుదు. తొలి రెండు మ్యాచ్‌లలోనే అత్యధిక వికెట్లు తీయడం మరింత అరుదు. గత కొన్నేళ్లుగా భారత బౌలర్లు కొన్ని అద్భుతమైన ఆరంభ ప్రదర్శనలు కనబరిచారు. కేవలం రెండు టెస్టుల తర్వాత అత్యధిక వికెట్లు తీసిన వారి జాబితాలో 1980ల చివర్లో ఆడిన ఒక లెగ్ స్పిన్నర్ అగ్రస్థానంలో ఉండగా, ఇటీవలి స్టార్లు కూడా ఈ జాబితాలో ఉన్నారు. భారత్ స్టార్ ప్లేయర్ నరేంద్ర హిర్వానీ 24 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ యువ లెగ్ స్పిన్నర్ 1988 జనవరిలో చెన్నైలో వెస్టిండీస్ మ్యాచ్‌లో టెస్ట్ చరిత్రలోనే అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనలలో ఒకటి కనబరిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో 61 పరుగులు ఇచ్చి 8 వికెట్లు, ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో 75 పరుగులకు 8 వికెట్లు పడగొట్టాడు. దీంతో అరంగేట్రంలోనే ఒకే టెస్టులో 16 వికెట్లు తీసిన అతని రికార్డు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. ఆ ఏడాది చివర్లో బెంగళూరులో న్యూజిలాండ్‌తో జరిగిన రెండవ టెస్టులో, హిర్వానీ మరో 8 వికెట్లు పడగొట్టాడు. ఇందులో రెండవ ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్ల ప్రదర్శన కూడా ఉంది. రెండు మ్యాచ్‌ల తర్వాత అతను తీసిన మొత్తం 24 వికెట్లు అత్యధికంగా నిలిచింది. ఇక అక్షర్ పటేల్ 18 వికెట్లతో ఈ జాబితాలో రెండవ స్థానంలో ఉన్నాడు. ఈ ఎడమచేతి వాటం స్పిన్నర్ 2021 ప్రారంభంలో ఇంగ్లాండ్‌తో స్వదేశంలో జరిగిన టెస్ట్ సిరీస్‌లో 11 వికెట్లు పడగొట్టాడు. ఇందులో మొదటి ఇన్నింగ్స్‌లో 38 పరుగులకు 6 వికెట్లు, ఆ తర్వాత రెండవ ఇన్నింగ్స్‌లో 32 పరుగులకు 5 వికెట్లు ఉన్నాయి. తదుపరి ఇంగ్లాండ్ టెస్టులో అతను మరో 9 వికెట్లు పడగొట్టాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను అతను 27 వికెట్లతో ముగించాడు. అలాగే 17 వికెట్లతో ఎడమచేతి వాటం స్పిన్నర్ మానవ్ సుతార్ జూన్ 2026లో ముల్లన్‌పూర్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు, రెండవ ఇన్నింగ్స్‌లో మరో వికెట్ పడగొట్టాడు. 2026 ఆగస్టులో గాలేలో శ్రీలంక రెండవ టెస్టులో, అతను మొదటి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు, రెండవ ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు తీసి, మ్యాచ్ గణాంకాలను 131 పరుగులకు 10 వికెట్లతో ముగించాడు. 1980 లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆఫ్ స్పిన్నర్ నందలాల్ యాదవ్ తన మొదటి రెండు మ్యాచ్‌లలో 13 వికెట్లు పడగొట్టాడు. పొడగరి అయిన కుడిచేతి మీడియం పేసర్ వెంకటేష్ ప్రసాద్ తన తొలి రెండు టెస్ట్ మ్యాచ్‌ల తర్వాత 13 వికెట్లు కూడా పడగొట్టాడు. బంతిని స్వింగ్ చేయగల సామర్థ్యానికి, క్రమశిక్షణతో కూడిన లైన్ అండ్ లెంగ్త్‌ను పాటించగలగడానికి అతను గుర్తింపు పొందాడు.

## శ్రీలంకతో 2వ టెస్ట్: భారీస్కోర్ 503 వద్ద భారత్ డిక్లేర్డ్!

**కొలంబో:** శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా భారీ స్కోర్ చేసింది. ధ్రువ్ జురెల్(115 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 503/9 భారీ స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసింది. రిషభ్ పంత్(63) హాఫ్ సెంచరీతో రాణించాడు. 300/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు సోమవారం ఓవర్‌నైట్ బ్యాటర్ సారాన్ష్ జైన్(6) రెండు పరుగులు మాత్రమే చేసి అసితా ఫెర్నాండో బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. దాంతో రిషభ్ పంత్ బ్యాటింగ్‌కు దిగి



ధ్రువ్ జురెల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ముఖ్యంగా పంత్ భారీ షాట్లతో లంకబౌలర్లపై విరుచుకుపడి 81 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకోగా, ధ్రువ్ జురెల్ 97 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. దాంతో భారత్ 419/6 స్కోర్ వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. తర్వాత పంత్ భారీ సిక్సర్లతో విరుచుకుపడగా, అతన్ని కుశార నువాంత క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో 7వ వికెట్‌కు నమోదైన 112 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి మానవ్ సుతార్ రాగా జురెల్ తన జోరును కొనసాగించాడు. మానవ్ (18)ను ప్రభాత్ జయసూర్య పెవిలియన్ చేర్చగా, సిరాజ్‌తో కలిసి ధ్రువ్ రెండో సెషన్‌ను ముగించాడు. ఆఖరి సెషన్‌లో ధ్రువ్ 171 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకోగా, సిరాజ్(3) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. దూకుడుగా ఆడిన ధ్రువ్ వేగంగా పరుగులు రాబట్టి స్కోర్‌ను 500 దాటించడంతో భారత్ తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. అనంతరం శ్రీలంక బ్యాటింగ్‌కు దిగగా 2 బంతులు పడగానే వర్షం అంతరాయం కలిగించింది. ఆ తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా, శ్రీలంక 3 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 8 పరుగులు చేసింది. లాహిరు ఉడారా(1) ప్రసిధ్ కృష్ణ ఔట్ చేయగా, ప్రభాత్ జయసూర్య(2)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. వర్షం కారణంగా రెండో రోజు 56 ఓవర్ల ఆటనే సాధ్యమైంది.

వాణిజ్యం



## మరో 9దేశాలతో వాణిజ్య ఒప్పందాలకు చర్చలు!

### 75% ప్రపంచ వాణిజ్యంలో భారత్‌కు వాటా

### జపాన్‌లో కేంద్ర మంత్రి పియూష్ గోయల్

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** ప్రపంచ వాణిజ్యంలో భారత్ తన భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు కృషి చేస్తోందని మరో 8-9 దేశాల సమూహాలు, వ్యక్తిగత దేశాలతో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కోసం చర్చలు జరుపుతోందనికేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు.15 ట్రిలియన్ డాలర్ల జీడీపీ కలిగిన ఆర్థిక వ్యవస్థలతో మార్కెట్ ప్రాప్యత లభిస్తుందని చెప్పారు.భారత్ గత నాలుగేళ్లలో 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని గోయల్ పేర్కొన్నారు. ఈ ఒప్పందాలు కలిపి సుమారు 60 ట్రిలియన్ డాలర్ల జీడీపీ కలిగిన 38 అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలను కవర్ చేస్తున్నాయని వివరించారు. జపాన్, కొరియా, ఆసియాన్ ప్రాంతంతో గతంలో కుదిరిన వాణిజ్య ఒప్పందాలను కలుపుకుంటే మరో 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలకు భారత్ ప్రాధాన్య మార్కెట్ లభిస్తోందన్నారు.దీంతో ప్రస్తుతం భారత్ సుమారు 70 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలకు ప్రాధాన్య మార్కెట్ ప్రాప్యత కల్పించే ఒప్పందాలను కలిగి ఉందని గోయల్ చెప్పారు. కొత్తగా చర్చలు జరుగుతున్న ఒప్పందాలు పూర్తయితే ప్రపంచ వాణిజ్యంలో దాదాపు 75 శాతం భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పరిధిలోకి వస్తుందని తెలిపారు. జపాన్ పర్యటనలో భాగంగా భారత్, జపాన్ వ్యాపార ప్రతినిధులను ఉద్దేశించి గోయల్ మాట్లాడుతూ, భారత్‌కు భారీ దేశీయ మార్కెట్ ఉందని, అదే సమయంలో ప్రపంచానికి తన మార్కెట్లను తెరిచి ఉంచుతోందని అన్నారు. పీయూష్ గోయల్ 27 వరకు జపాన్‌లో పర్యటిస్తున్నారు. భారత్ నుంచి ఇప్పటివరకు వెళ్లిన అతిపెద్ద వ్యాపార ప్రతినిధి బృందానికి ఆయన నేతృత్వం వహిస్తున్నారు. టోక్యో, నాగోయా, ఒసాకా నగరాల్లో ఆయన పర్యటన కొనసాగనుంది.ఈ ప్రతినిధి బృందంలో 200 మందికి పైగా వ్యాపార ప్రతినిధులు పాల్గొంటున్నారు. తయారీ, సెమీకండక్టర్లు, క్లీన్ ఎనర్జీ, ఉక్కు, ఆటోమొబైల్, ఆర్థిక సేవలు, ఆరోగ్య సంరక్షణ, స్టార్టప్‌లు తదితర రంగాలకు చెందిన ప్రతినిధులు ఇందులో ఉన్నారు.భారత్‌లో వచ్చే పదేళ్లలో జపాన్ నుంచి 10 ట్రిలియన్ యెన్ల పెట్టుబడులు వచ్చేలా ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గోయల్ తెలిపారు.2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్-జపాన్ ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 27.5 బిలియన్ డాలర్లుగా ఉందని, అయితే ఇరు దేశాల మధ్య ఉన్న వాణిజ్య సామర్థంతో పోలిస్తే ఇది చాలా తక్కువేనని ఆయన పేర్కొన్నారు. జపాన్ నుంచి భారత్‌కు వచ్చిన సమీకృత పెట్టుబడులు 48 బిలియన్ డాలర్లను మించాయి. ప్రస్తుతం భారత్‌లోని వివిధ పారిశ్రామిక కేంద్రాల్లో 1,400కు పైగా జపాన్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.



## గోధుమ పిండి ఉత్పత్తుల ఎగుమతులపై నిషేధం ఎత్తివేత

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** గోధుమ పిండి, దానికి సంబంధించిన ఉత్పత్తుల ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం విధించిన నిషేధాన్ని సోమవారం తక్షణమే ఎత్తివేసింది. ఈ మేరకు గోధుమ పిండి ఎగుమతి విధానంలో సవరణలు చేసినట్లు కేంద్రం అధికారిక ప్రకటనలో వెల్లడించింది. గతంలో నిషేధిత కేటగిరీలో ఉన్న గోధుమ పిండి, సంబంధిత ఉత్పత్తులను ఇకపై స్వేచ్ఛా ఎగుమతి కేటగిరీలోకి మార్చినట్లు విదేశీ వాణిజ్య విధానాల డైరెక్టరేట్ జనరల్ నోటిఫికేషన్ జారీ చేసింది.

ఈ మార్పులు వెంటనే అమల్లోకి వస్తాయి. సవరించిన విధానం కింద మైదా, సేమోలినా రవ్వ/సూజీ, సంపూర్ణ గోధుమ పిండి హోల్‌మీల్/ఆట్టా, రిజల్టెంట్ ఆట్టా తదితర ఉత్పత్తులు ఎగుమతి చేసుకోవచ్చు. అయితే సాధారణ ఎగుమతి నిబంధనలు వర్తిస్తాయి. నాలుగేళ్ల తర్వాత పూర్తి స్థాయిలో అనుమతిదే శంలో గోధుమ, ఆట్టా ధరలు భారీగా పెరగడంతో కేంద్ర ప్రభుత్వం 2022 జూలై 12న గోధుమ ఎగుమతులపై నిషేధం విధించింది. రష్యాఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లలో గోధుమ ధరలు దాదాపు 40 శాతం పెరగడంతో భారత్ నుంచి ఎగుమతులు కూడా భారీగా పెరిగాయి. దీంతో దేశీయంగా గోధుమ, పిండి ధరలు పెరగకుండా ఎగుమతులపై ఆంక్షలు విధించారు.

## రూ.19,400 కోట్లతో జిఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ భారీ విస్తరణ

**న్యూఢిల్లీ,ఆగస్టు 24:** దేశీయ విమానయాన రంగంలో ప్రయాణికుల సంఖ్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ భారీ విస్తరణ ప్రణాళికలను చేపడుతోంది. న్యూఢిల్లీ, హైదరాబాద్ విమానాశ్రయాల విస్తరణ, ఆధునికీకరణ కోసం రాబోయే ఐదేళ్ల నుంచి ఏడేళ్లలో సుమారు రూ.19,400 కోట్లు పెట్టుబడి పెట్టాలని సంస్థ నిర్ణయించిందని సంస్థ ఫైనాన్స్, స్ట్రాటజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సౌరభ్ చావ్లా వెల్లడించారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా విమానాశ్రయాల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు మౌలిక వసతులను ఆధునికీకరించేందుకు ఈ పెట్టుబడులు వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు.హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం విస్తరణకు సుమారు రూ.13,800 కోట్లు, న్యూఢిల్లీ విమానాశ్రయానికి రూ.5,600 కోట్లు కేటాయిస్తున్నట్లు చావ్లా చెప్పారు. ఆయా విమానాశ్రయ సంస్థలు రుణం, ఈక్విటీ కలయికతో ఈ పెట్టుబడులను సమకూర్చుకుంటాయని, ఇవి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్ కంపెనీకి నేరుగా సంబంధించిన పెట్టుబడులు కావని వివరించారు.ప్రస్తుతం అమెరికా, చైనా తర్వాత ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా



భారత్ ఉంది. ప్రభుత్వ అంచనాల ప్రకారం వచ్చే 14 ఏళ్లలో దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య ఆరు రెట్లు పెరిగి సుమారు 110 కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. వాణిజ్య విమానాల సంఖ్య కూడా 2014లో ఉన్న 400 నుంచి 2040 నాటికి 2,350కి పైగా పెరుగుతుందని అంచనా. విస్తరణ పూర్తయిన తర్వాత హైదరాబాద్ విమానాశ్రయం ఏడాదికి సుమారు 8 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని చావ్లా తెలిపారు. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ పరిధిలో ప్రస్తుతం భారత్‌లో ఆరు విమానాశ్రయాలు, ఫిలిప్పీన్స్‌లో ఒక విమానాశ్రయం ఉన్నాయి. గ్రీస్‌లో మరో విమానాశ్రయం నిర్మాణంలో ఉంది. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీ, హైదరాబాద్‌లో చేపడుతున్న విస్తరణ సంస్థ ఆధునికీకరణ కార్యక్రమాలకు ఆరంభం మాత్రమే కావచ్చని చావ్లా పేర్కొన్నారు.



## రివ్వున ఎగసిన పసిడి, వెండి ధరలు!

### బంగారం రూ.880, వెండి రూ.5వేలు పెరుగుదల

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** దేశీయంగా బంగారం ధరలు సోమవారం స్వల్పంగా పెరిగాయి.మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో బంగారం ధర 0.4 శాతం లాభపడి, 10 గ్రాములకు రూ.1.62 లక్షల స్థాయిలో ప్రారం భమైంది.మార్కెట్ గణాంకాల ప్రకారం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1. 62-1.64 లక్షల పరిధిలో కొనసాగుతోంది. దేశీయ మార్కెట్లో 24 క్యారెట్ల (99.9 శాతం స్వచ్ఛత) బంగారం గ్రాము ధర రూ.16,397గా, 22 క్యారెట్ల (91.6 శాతం స్వచ్ఛత) బంగారం గ్రాము ధర రూ.15,030గా ఉంది. 18 క్యారెట్ల (75%స్వచ్ఛత) బంగారం గ్రాము ధర రూ.12,293గా నమోదైంది.అంతర్జాతీయ మార్కెట్లోనూ బంగారం ధరలు మూడు నెలలకు పైగా గరిష్ఠ స్థాయికి చేరాయి. బలహీనంగా ఉన్న అమెరికా డాలర్, కీలకమైన అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలపై మార్కెట్ దృష్టి, ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ కెవిన్ వార్ష్ ఈ వారం చేయనున్న ప్రసంగం వంటి అంశాలు పసిడి ధరలకు మద్దతునిస్తున్నాయి. సోమవారం అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఔన్స్ ధర 4,649.08 డాలర్లకు చేరింది. దేశంలోని ముంబయిలో పదిగ్రాముల 24 కేరట్ల బంగారా రూ.1,63.397గాను, 22కేరట్లు రూ.1,50, 030 గాను, 18 కేరట్లు రూ.1,22,930గానున నడుస్తోంది. అదే హైదరాబాద్‌లో రూ.163. 970, 22 కేరెట్లు రూ.1, 50,030, 18 కేరట్లు రూ.1,22,930గాను ఉన్నాయి.

## స్టాక్ మార్కెట్లకు గ్లోబల్ ఎఫెక్ట్!

### నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఆగస్టు 24:** బలహీనమైన అంతర్జాతీయ సంకేతాల నేపథ్యంలో దేశీయ ఈక్విటీ సూచీలు సోమవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. దీంతో వరుసగా రెండు సెషన్ల లాభాలకు బ్రేక్ పడింది. నిఫ్టీ 24,250 మార్క్ దిగువన ముగిసింది. పీఎస్‌యూ బ్యాంక్, మీడియా, బ్యాంకింగ్ షేర్లు నష్టపోగా మెటల్, రియల్టీ, ఐటీ షేర్లు లాభపడ్డాయి. సెన్సెక్స్ 171.72 పాయింట్లు నష్టపోయి 77,369.11 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 32.95 పాయింట్లు తగ్గి 24,219.05 వద్ద ముగిసింది. గత రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 0.82 శాతం, నిఫ్టీ 0.72 శాతం చొప్పున లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.01 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.17 శాతం క్షీణించాయి. బీఎస్ఈలో మొత్తం 2,041 షేర్లు లాభపడగా, 2,393 షేర్లు నష్టపోయాయి. మరో 254 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 0.93 శాతం తగ్గి 8,539.75 వద్ద ముగిసింది. పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లలో బ్యాంక్ ఆఫ్ బరోడా 2.55 శాతం, కెనరా బ్యాంక్ 2.29 శాతం, ఎస్‌బీఐ 1.20 శాతం, బ్యాంక్ ఆఫ్



ఇండియా 1.18 శాతం, ఇండియన్ బ్యాంక్ 1.17 శాతం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 1 శాతం చొప్పున నష్టపోయాయి. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ 0.90 శాతం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 0.39 శాతం, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 0.26 శాతం తగ్గాయి. హెరాన్బా ఇండస్ట్రీస్ షేరు 8.99 శాతం దూసుకెళ్లింది.అర్బన్ కంపెనీ 6.05 శాతం లాభపడింది.విశాల్ మెగా మార్ట్ 9.31 శాతం పెరిగింది.కెల్టన్ టెక్ సొల్యూషన్స్ 1.18 శాతం ఎగిసింది.మరోవైపు క్యాప్లిన్ పాయింట్ ల్యాబొరేటరీస్ 2.70 శాతం పడిపోయింది. టాటా పవర్ 0.76 శాతం తగ్గింది. సీగల్ ఇండియా 2.69 శాతం లాభపడింది. లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్అండ్‌టీ) 0.07 శాతం నష్టపోయింది.ఎల్అండ్‌టీకి సంబంధించిˇఅల్ట్రామెగ్గా కేటగిరీ కింద వచ్చిన కాంట్రాక్ట్ విలువ రూ.15,000 కోట్లకు పైగా ఉన్నట్లు పేర్కొంది.డాలరుతో రూపాయి మారకం విలువలు 97.74వద్ద ముగిసింది.



## పదేళ్లలో 13 వేల రెట్లు పెరిగిన యుపిఐ లావాదేవీలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** దేశంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ యుపిఐ లావాదేవీలు గత పదేళ్లలో భారీగా పెరిగింది. పదేళ్లక్రితం 1.78 కోట్లుగా ఉన్న వార్షిక యూపీఐ లావాదేవీలు.. ప్రస్తుతం 24,162 కోట్లకు పైగా చేరుకున్నాయని కేంద్ర ఆర్థిక శాఖ సోమవారం వెల్లడించింది. దాదాపు 13 వేల రెట్లు పెరిగినట్లు తెలిపింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 2016 ఆగస్టు 25న యూపీఐని ప్రారంభించింది. అప్పటి నుంచి ఇది దేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు వెన్నెముకగా మారడంతో పాటు ఆర్థిక సేవలను మరింత విస్తృత ప్రజలకు చేరువ చేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది. యూపీఐ ద్వారా జరిగే లావాదేవీల విలువ కూడా గణనీయంగా పెరిగింది. పదేళ్ల క్రిందట రూ.0.07 లక్షల కోట్లుగా ఉన్న మొత్తం లావాదేవీల విలువ ప్రస్తుతం రూ.314 లక్షల కోట్లకు చేరుకుంది. దశాబ్ద కాలంలో 4,000 రెట్లకు పైగా పెరిగింది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో యూపీఐ కీలకంగా మారింది. వివిధ బ్యాంకులు, చెల్లింపు సంస్థల మధ్య అనుసంధానాన్ని కల్పిస్తూ తక్షణ చెల్లింపులకు అవకాశం కల్పిస్తోంది. వ్యక్తి నుంచి వ్యక్తికి (పి2పి), వ్యక్తి నుంచి వ్యాపారికి సులభంగా చెల్లింపులు చేసే వెసులుబాటు కల్పిస్తోంది. లావాదేవీల పరంగా ప్రపంచంలోనే అతిపెద్ద రియల్‌టైమ్ పేమెంట్ వ్యవస్థగా యూపీఐని అంతర్జాతీయ ద్రవ్య నిధి గుర్తించింది. ఒక్క మే నెలలో తొలిసారిగా నెలవారీ లావాదేవీల సంఖ్య 2,300 కోట్ల మార్కును దాటింది. ఆ నెలలో 2,320 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. జూలైలో ఈ సంఖ్య మరో రికార్డును సృష్టించి 2,366 కోట్లకు చేరింది.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 .
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం మంగళవారం 25 ఆగస్టు 2026 I

# మున్సిపల్, పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం సిటీ ఆగస్టు 24(ప్రభాతవార్త):** మునిసిపల్ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేయడంతో పాటు స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ లో భాగంగా చేపట్టిన విచారణలను నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో మున్సిపల్ పంచాయతీ అధికారులు తాసిల్దారులు ఎంపీడీవోలు డిప్యూటీ ఎంపీడీవోలు ఏఈఆర్వోలు ఇతర క్షేత్రస్థాయి అధికారులతో ఎన్నికల అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్ లో భాగంగా ఏ ఈ ఆర్ ఓ లు తాసిల్దార్లు తమ పరిధిలోని అన్ని విచారణలను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని సూచించారు. అవసరమైన చోట వర్చువల్ విచారణలను వినియోగించుకోవాలని సాంకేతికత లేదా లాగిన్ సమస్యలు ఎదుర్కొంటున్న అధికారులకు అవసరమైన శిక్షణ సాంకేతిక సహకారం అందించాలని తెలిపారు. రాష్ట్రస్థాయి సమీక్ష నాటికి విచారణలో పెండింగ్లో లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ బీసీ ఓటర్ల మార్కింగ్ తో కూడిన ముసాయిదా ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు అభ్యంతరాల స్వీకరణ అనంతరం తాసిల్దార్లు ఎంపీడీవోలు డిప్యూటీ ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణలో నిర్వహించాలని అవసరమైన అంశాలను గ్రామసభల ద్వారా పారదర్శకంగా పరిష్కరించాలని సూచించారు. మునిసిపల్ పోలింగ్ కేంద్రాల జాబితా పై ప్రజల నుంచి క్లెయిమ్స్ అభ్యంతరాలను ఆగస్టు 26వ లోపు స్వీకరించి నిబంధనల ప్రకారం పరిశీలించాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి చేత ఆమోదం ఆగస్టు 29న పూర్తి చేసి ఆగస్టు 31న పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రచురించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కమిషనర్లు తమ పరిధిలో అనుభవజ్ఞులైన సమర్థులైన అధికారులను గుర్తించి ఎన్నికల విధులకు నియమించేందుకు ప్రతిపాదనలు పంపాలని ఆమె ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ సంబంధించిన అన్ని అంశాల్లో శాఖల మధ్య సమన్వయం ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి నిర్ణీత గడువులోగా అవసరమైన వివరాలతో అనుసరణ నివేదిక సమర్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై మేఘ స్వరూప్ ఆర్డీవోలు ఆర్ శివరామకృష్ణ కే అనంతరావు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి భాగ్యవతి కె కనకరాజు టి రాజేశ్వరరావు జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతమణి ,మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా తదితర అధికారులు పాల్గొన్నారు.

# సంచలన హత్య కేసులో నిందితుడు షేక్ సాధిక్ ఖాన్ అరెస్ట్





**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24(ప్రభాతవార్త):** పిఠాపురం పంచాయతీరాజ్ శాఖ ఏఈ నూకరాజు కుటుంబ సభ్యుల ఆత్మహత్యకు కారణమైన షేక్ సాదిక్ ఖాన్ ను కాకినాడ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు.సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన సంచలన హత్య కేసులో నిందితుడు షేక్ సాధిక్ ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేసి సోమవారం ఉదయం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేసి కోర్టుకు తరలించారు. కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాలతో అదనపు ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఆరు ప్రత్యేక దర్యాప్తు బృందాలుగా ఏర్పడి విశ్వసనీయ సమాచారంతో సిట్ బృందం ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ చేరుకుని, స్థానిక పోలీసుల సహకారంతో ఆగస్టు 22న ఉదయం నౌచండి పోలీస్ స్టేషన్ పరిసరాల్లో సాధిక్ ఖాన్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం మీరట్ కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై కాకినాడ సర్పవరం పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చారు. ఈనెల 17న రాజమహేంద్రవరం వద్ద గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్న పంచాయతీ ఇంజనీరింగ్ శాఖ ఏఈ ఆత్మహత్యకు సంబంధించి రాజమండ్రి 2 టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా లభించిన సూయిసైడ్ నోట్‌లో సౌజన్య తన మరణానికి షేక్ సాదిక్ ఖాన్ వేధింపులే కారణమని, తన భర్త జగదీష్ రెడ్డిని సాధిక్ ఖాన్ విషప్రయోగంతో హత్య చేశాడని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో జగదీష్ రెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డి ఫిర్యాదుతో సర్పవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కేసులో మొబైల్ ఫోన్లు, డిజిటల్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్, కాల్ డేటా, వైద్య రికార్డులు, బ్యాంకు లావాదేవీలు తదితర ఆధారాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. మృతుల మరణ వాంగ్మూలాలు, నిందితుడి పాత్ర, జగదీష్ రెడ్డి మరణానికి సంబంధించిన కారణాలు, బెదిరింపులు తదితర అంశాలపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసిన సిట్ సభ్యులను, వారిని పర్యవేక్షించిన అదనపు ఎస్పీ డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ కె.వీ.వీ. సత్యనారాయణలను ఎస్పీ జి. బిందు మాధవ్ రివార్డులతో అభినందించారు.

# కుయ్యేరు గొల్లపాలెం రోడ్డు పరిశీలించిన మంత్రి సుభాష్



**కాజులూరు, సెప్టెంబర్ 24(ప్రభాత వార్త)** కాజులూరు మండలం గొల్లపాలెం నుండి కుయ్యేరు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వర్యులు వాసంశెట్టి సుభాష్ సోమవారం పరిశీలించారు. ఈ మేరకు గొల్లపాలెంలో తారు రోడ్డు నిర్మాణంలో నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కాజులూరు మండల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే కాజులూరు రోడ్డు నిర్మాణాన్ని త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తి స్థాయి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశాలు జారీ చేశారు. కాజులూరు మండల గ్రామాల్లో ఇప్పటికే చాలా వరకు రోడ్డు పూర్తి చేశామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సహకారంతో ప్రాధాన్యతా క్రమంలో అన్ని రోడ్ల నిర్మాణాల్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి వనుం వీరబ్రహ్మం, మండల టీడీపీ అధ్యక్షుడు చావ్వాకుల నారాయణమూర్తి, జనసేన నాయకులు అన్యం శ్రీరామచంద్రమూర్తి, బోండా వెంకన్న, చంద్రు వీర్రాజు చౌదరి, తాడి మాచారెడ్డి, గుబ్బల యేసురాజు, మేడిశెట్టి వీరవెంకటసత్యనారాయణ, వల్లు అర్జునరావు, రెడ్డి శేషారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా ఫీడ్ బలోపేతం చేసేందుకు గోద్రేజ్ ఆగ్రోవెట్ ప్రణాళికలు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24(ప్రభాతవార్త):** భారత్‌లోనే అగ్రగామి ఆక్వా ఫీడ్ సంస్థల్లో ఒకటిగా నిలిచేందుకు గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ (గోద్రేజ్ ఆగ్రోవెట్) భవిష్యత్తు ఆధారిత అభివృద్ధి వ్యూహాన్ని సిద్ధం చేసుకుందని, ఇందులో భాగంగా ఆక్వా ఫీడ్ వ్యాపారాన్ని దీర్ఘకాలికంగా మరింత విస్తరించి, బలోపేతం చేయనున్నట్లు కంపెనీ అభివృద్ధి లక్ష్యాలపై మాట్లాడుతూ గోద్రేజ్ ఆగ్రోవెట్ డైరెక్టర్ సునీల్ తెలిపారు. ఈ వ్యూహంలో భాగంగా, గోద్రేజ్ అగ్రోవెట్ తన ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించడంతో పాటు, పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్ ఒ డీ), సాంకేతిక ఆవిష్కరణలలో పెట్టుబడులను పెంచి, ఆక్వాకల్చర్ రైతులకు అత్యుత్తమ నాణ్యత గల దాణా అందించనుంది. మేత వినియోగ సామర్థ్యంలో నిరంతరం మెరుగుదల సాధించడంపై కంపెనీ చూపుతున్న దృష్టి వల్ల రైతులకు ఉత్పత్తి వ్యయం తగ్గి, దిగుబడులు మరియు లాభాలు పెరుగుతాయి. ఈ ప్రయత్నాలు కంపెనీ డిస్ట్రిబ్యూటర్ వ్యవస్థను కూడా మరింత బలపరుస్తాయన్నారు. దీనివల్ల భాగస్వాములు రైతులకు మరింత విలువైన పరిష్కారాలను అందిస్తూ, గోద్రేజ్ ఆగ్రోవెట్‌తో కలిసి లాభదాయకమైన, సుస్థిరమైన వ్యాపారాలను నిర్మించుకోవడానికి మార్గం సుగమమవుతుందని చెప్పారు. “గోద్రేజ్ ఆగ్రోవెట్‌కు చేపల మేత వ్యాపారమే అత్యంత ముఖ్యమైన ప్రాధాన్యత అని, మొత్తం యానిమల్ న్యూట్రిషన్ వ్యాపారంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నాం అన్నారు. ఈ వ్యాపారాన్ని రెండంకెల వృద్ధితో పెంచాలని అనుకుంటున్నాం. ఈ లక్ష్యానికి అనుగుణంగానే పెట్టుబడులు పెడుతున్నాం. దీనికి తోడు కొత్త సాంకేతికతను జోడిస్తూ, పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్‌డీ) ప్రయత్నాలు చేస్తున్నాం అన్నారు. మొత్తానికి ఆక్వా ఫీడ్ వ్యాపారంలో ఉన్న అపారమైన అవకాశాలపై మాకు పూర్తి నమ్మకం ఉంది. ఈ రంగంలో మాకు ఉన్న అభివృద్ధి అవకాశాలు ఎంతో ఆశాజనకంగా ఉన్నాయి. మా లక్ష్యాలు చాలా పెద్దవి, వాటిని సాధించి తీరడానికి మేం కట్టుబడి ఉన్నాం” అని తెలిపారు. అభివృద్ధి వ్యూహంలో భాగంగా, గోద్రేజ్ ఆగ్రోవెట్ తన డిస్ట్రిబ్యూటర్ నెట్‌వర్క్‌తో సంబంధాలను మరింత బలోపేతం చేస్తోందన్నారు.

# మృతుల కుటుంబాలకు డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే నానాజీ ప్రగాఢ సానుభూతి



**కాకినాడ రూరల్, ఆగస్ట్ 24 (ప్రభాత వార్త):** సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్ వద్ద అలల ఉధృతికి నలుగురు యువకులు గల్లంతై, ఇద్దరు మృతి చెందిన ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

వారి ఆదేశాల మేరకు రెస్క్యూ బృందాలు, గజ ఈతగాళ్లు, మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. సురక్షితంగా బయటపడిన మరో ఇద్దరు యువకులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే నానాజీ తనయుడు పంతం సందీప్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకులను పరామర్శించి, మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని సందీప్ భరోసా ఇచ్చారు.

# నూకరాజు కుటుంబ సామూహిక ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరపాలి



**రావులపాలెం, ఆగస్ట్ 24 (ప్రభాతవార్త) :** పిఠాపురం పంచాయతీరాజ్ ఏఈ తిల్లపూడి నూకరాజు కుటుంబ సామూహిక ఆత్మహత్య ఘటనలో నిందితుడిగా ఉన్న షేక్ సాదిక్‌ఖాన్ వెనుక పెద్ద ఉగ్రవాద ముఠా ఉందని, దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర విచారణ జరపాలని మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు. ఘటన నుంచి తృటిలో ప్రాణాలతో బయటపడి ప్రస్తుతం రావులపాలెంలో తాతయ్య కొవ్వూరి భాస్కరరెడ్డి ఇంట్లో ఉంటున్న రియాన్ష్‌రెడ్డిని సోమవారం విజయసాయిరెడ్డి పరామర్శించారు. భాస్కరరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. గతంలో కేరళ వంటి రాష్ట్రాల్లో లవ్ జిహాద్ తరహా ఘటనలను చూశామని, ఇప్పుడు రాష్ట్రంలోనూ ఇలాంటి విష సంస్కృతి ప్రారంభమై రెండు కుటుంబాలు బలికావడం ఆందోళనకరమన్నారు. సాదిక్‌ఖాన్ వెనుక ఉగ్రవాదులు, కొందరు పోలీసులు ఉన్నారని బెదిరింపులకు పాల్పడి నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య, అల్లుడు జగదీశ్వరరెడ్డికి చెందిన కోట్లాది రూపాయల ఆస్తులను తన పేరున రాయించుకున్నాడని ఆరోపించారు. ఆస్తులను తిరిగి బాధిత కుటుంబాలకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై అధికార కూటమి ప్రభుత్వం, ప్రతిపక్ష వైసీపీ తగిన రీతిలో స్పందించడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో భాగమైన బీజేపీ కూడా తన పాత్రను సమర్థంగా పోషించడంలో విఫలమైందని ఆరోపించారు. ఉగ్రవాద చర్యలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైతే ముఖ్యమంత్రి చంద్రబాబు పదవి నుంచి తప్పుకుని, యోగి ఆదిత్యనాథ్ వంటి వారి పాలనా విధానాలను నేర్చుకోవాలని వ్యాఖ్యానించారు. నేరాలకు దుబాయ్, ఇతర గల్ఫ్ దేశాల్లో విధించే తరహాలో కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత రాజకీయ పార్టీలకు భవిష్యత్‌లో కాంగ్రెస్ అవసరం ఉంటుందనే ఉద్దేశంతోనే ఈ ఘటనపై అధికార, ప్రతిపక్ష పార్టీలు మౌనం పాటిస్తున్నాయని ఆరోపించారు. చంద్రబాబు తన రాజకీయ భవిష్యత్ కోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో వైరం రాకుండా ఈ వ్యవహారంలో తటస్థంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడిపించలేని అసమర్థ ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతిపక్షంలో ఉండి ప్రతిపక్ష పాత్ర పోషించలేని అసమర్థ నాయకుడు జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. శ్రావణమాసంలో మూడు, నాలుగు వారాల్లో విజయవాడలో పాత్రికేయ సమావేశం నిర్వహించి తాను ఏర్పాటు చేయబోయే కొత్త పార్టీ పేరు, విధివిధానాలను ప్రకటిస్తానని విజయసాయిరెడ్డి వెల్లడించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఉగ్రవాద చర్యలకు తావు ఉండదని స్పష్టం చేశారు. ఇదే ఘటన ముఖ్యమంత్రి చంద్రబాబు లేదా మాజీ ముఖ్యమంత్రి జగన్ కుటుంబాల్లో జరిగి ఉంటే ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ఇలాగే స్పందించేవా? అని ప్రశ్నించారు. ఘటన నుంచి ప్రాణాలతో బయటపడిన రియాన్ష్‌రెడ్డికి ప్రాణహాని ఉందని, ఆయనతో పాటు కుటుంబ సభ్యులకు తక్షణమే పోలీసు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఏఈ నూకరాజు కుటుంబ ఆత్మహత్యపై హోం మంత్రి డిజిపి వెంటనే స్పందించాలి..

**మద్యం కుంభకోణం విషయంలో సిబిఐ విచారణ చెయ్యాలా?**
**సిబిఐ విచారణ అంటే కొత్తిమీర వ్యాపారం కాదు**
**ఎమ్మెల్సీ సోము వీర్రాజు కామెంట్స్...**





**రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 24: ప్రభాతవార్త,** మన ప్రాంతంలో లవ్ జిహాద్ కేసు నమోదు కావడం దురదృష్టకరమని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏఈ నూకరాజు కుటుంబంపై మతం మార్చుకోవాలని ఒత్తిడి తెచ్చారని, భర్తకు ఇంజక్షన్ ఇచ్చి సాధిక్ హత్య చేశాడని ఆరోపించారు. సాధిక్‌కు అంతర్జాతీయ స్థాయిలో లింకులు ఉన్నాయని, ఢిల్లీలో కొందరు వ్యక్తులు అతనికి ఆశ్రయం కల్పించారని పేర్కొన్నారు. ఇది ఒక్క వ్యక్తి ఆలోచన కాదని, ఒక ముఠా పన్నాగమని ఆరోపించారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న అన్ని అంశాలను వెలికితీయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు ఈ ఘటనపై సీరియస్‌గా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అమ్మాయిలను ట్రాప్ చేసేందుకు షాపింగ్ మాల్స్, జిమ్‌లు వేదికలుగా మారుతున్నాయని ఆరోపించారు. ఇంతటి తీవ్రమైన ఘటనపై ఇప్పటివరకు హోంమంత్రి, డీజీపీ స్పందించకపోవడాన్ని తప్పుబట్టారు. డీఎస్సీ ఆరోపణలపై అసెంబ్లీలో ఇప్పటికే సమాధానం ఇచ్చామని, సీబీఐ విచారణ జరిపించడం అంత సులభం కాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో భూముల కొనుగోళ్లలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ ను నష్టాల్లోకి తీసుకువెళ్ళింది కమ్యూనిస్టులే స్టీల్ ప్లాంట్ పై బతికి వందల కోట్ల ఆస్తులు సంపాదించారని, సిట్‌కు అందించిన సాక్ష్యాల ఆధారంగానే ఈడీ రంగప్రవేశం చేసిందని తెలిపారు. సంబంధిత వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపి నిజాలు ప్రజల ముందుకు తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు.

# ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి కలెక్టర్ దినేష్ కుమార్



**రంపచోడవరం, ఆగస్టు 24: ప్రభాతవార్త.** పోలవరం జిల్లా పరిధిలోని మారుమూల గ్రామాల ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ వారం గ్రీవెన్స్‌కు 185 దరఖాస్తులు, రెవెన్యూ క్లినిక్‌కు 35 దరఖాస్తులు అందాయని తెలిపారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలిన వాటిని సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, ఆర్డీవో కె. స్వాతి, ఐటీడీఏ, గిరిజన సంక్షేమ, వ్యవసాయ, విద్య, వైద్య, ఉద్యాన, మత్స్య, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విలువైన 40 సెల్‌ఫోన్లు రికవరీ



**ధవళేశ్వరం, ఆగస్టు24(ప్రభాతవర్త)** ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న రూ. 4.86 లక్షల విలువైన 40 సెల్‌ఫోన్లను పోలీసులు టెక్నాలజీ సాయంతో రికవరీ చేశారు. సోమవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దక్షిణ మండల డీఎస్పీ ఏ. శివప్రియ, సీఐ టి. గణేష్ రికవరీ చేసిన సెల్‌ఫోన్లను ప్రదర్శించి, వాటిని పోగొట్టుకున్న బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ శివప్రియ మాట్లాడుతూ.. పోలీసులకు అందిన ఫిర్యాదుల ఆధారంగా టెక్నాలజీని వినియోగించి సెల్‌ఫోన్ల లొకేషన్లను గుర్తించి, వివిధ ప్రాంతాల నుంచి 40 ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ల రికవరీలో కీలకంగా వ్యవహరించిన సీఐ టి. గణేష్, ఎస్సైలు బి. హరిబాబు, పి. విజయ్‌కుమార్, సిబ్బంది కె. దుర్గాప్రసాద్, కె.వి. లక్ష్మణ్, ఎం. శ్రీనివాస్‌లను డీఎస్పీ అభినందించారు.

# పేరాబత్తుల నాగేశ్వరరావుకు మాతృవియోగం



**కె.గంగవరం: ఆగష్టు24(ప్రభాతవర్త)** కె.గంగవరం మండలం గంగవరం గ్రామానికి చెందిన కూటమి సీనియర్ నాయకులు పేరాబత్తుల నాగేశ్వరరావు తల్లి సీతమ్మ ఆదివారం అకాల మరణం చెందారు.ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు,గ్రామ ప్రముఖులు ఎంతో సేవా భావం కలిగిన పేరాబత్తుల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సీతమ్మ మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# అభివృద్ధికి దిశ.. ప్రజలకు భరోసా

## పథకాల సమన్వయం.. పనుల పర్యవేక్షణ.. ప్రజలతో మమేకం
## పాడా పీడీ,ఎన్. వి.శివరామ ప్రసాద్ పనితీరుపై ప్రశంసలు



**పిఠాపురం, ఆగస్టు 24 ( ప్రభాతవార్త )** పిఠాపురంఅర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గాఎన్. వి. శివరామ ప్రసాద్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు వేగం పెరిగిందనే అభిప్రాయాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖలు, అభివృద్ధి పథకాల నుంచి అందుబాటులోకి వచ్చే నిధులను సమన్వయం చేస్తూ, అవసరమైన ప్రాంతాలను గుర్తించి పనులు చేపట్టడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని స్థానికులు చెబుతున్నారు. పట్టణాభివృద్ధితో పాటు గ్రామీణ ప్రాంతాల అవసరాలపై కూడా దృష్టి పెట్టడం ద్వారా సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి వసతులు, పారిశుధ్యం, పచ్చదనం, మౌలిక సదుపాయాలు, చెరువుల అభివృద్ధి అంశాలను ప్రాధాన్యత క్రమంలో తీసుకుని ముందుకు సాగుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

**“పీజీఆర్ఎస్”-- “ గ్రీన్ పిఠాపురం”కు ప్రాధాన్యం:**

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతుల పరిష్కారానికి పీజీఆర్ఎస్‌ను కీలక వేదికగా పీడీ వినియోగిస్తున్నారని చెబుతున్నారు. ప్రజలు ఇచ్చే అర్జీలను కేవలం స్వీకరించడంతో సరిపెట్టకుండా, సంబంధిత శాఖలకు పంపించి వాటి పరిష్కార స్థితిని తెలుసుకునే విధంగా పర్యవేక్షణ ఉండాలని ఆయన అధికారులకు సూచిస్తున్నట్లు సమాచారం. పిఠా పురాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో “గ్రీన్ పిఠాపురం” కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. రహదారుల వెంట, ఖాళీ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటడం, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవడం, పచ్చదనాన్ని పెంపొందించడం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

**పనుల పర్యవేక్షణలో పట్టుదల:**

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించడం ఒక ఎత్తయితే, మంజూరైన పనులను నాణ్యతతో పూర్తి చేయించడం మరో ఎత్తు. పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించడం, సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించడం, సమస్యలు ఎదురైనప్పుడు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం వంటి అంశాల్లో పీడీ చొరవ చూపుతున్నారని ప్రజలు అంటున్నారు.

**ప్రజలతో మమేకం:**

అధికారిక కార్యాలయానికే పరిమితం కాకుండా ప్రజల్లోకి వెళ్లి సమస్యలను తెలుసుకోవడం, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించడం, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలతో సమన్వయం చేసుకోవడం పీడీ పనితీరులో మరో ప్రత్యేకతగా పలువురు పేర్కొంటున్నారు.

**అభివృద్ధికి సమన్వయమే కీలకం:**

పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో అభివృద్ధి పనులు ఒక్క శాఖతో సాధ్యం కావు. మున్సిపల్ పరిపాలన, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామీణాభివృద్ధి, అటవీ, రహదారులు తదితర శాఖల మధ్య సమన్వయం అవసరం. ఈ శాఖలతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు పీడీ ప్రయత్నిస్తున్నారని స్థానిక వర్గాలు చెబుతున్నాయి.

**ప్రజాభివృద్ధే లక్ష్యంగా :**

కృషి, పట్టుదల, కార్యదక్షత, ఓపిక, ప్రజలతో మమేకమయ్యే స్వభావం, అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకునే విధానం వంటి అంశాలు పీడీ పనితీరులో కనిపిస్తున్నాయని ప్రజలు అభినందిస్తున్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, వేగం, పారదర్శకత, జవాబుదారీతనాన్ని మరింత పెంచుతూ ఇదే దూకుడును కొనసాగిస్తే పిఠాపురంపట్టణంతో పాటు పరిసర ప్రాంతాల రూపురేఖలు మరింతగా మారే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి, పట్టుదలతో, ప్రజలు కలలు కంటున్న “ఆదర్శ పిఠాపురం నియోజకవర్గం” సాకరమవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## జ్ఞానజ్యోతి శిక్షణలో అంశాలు అమలు చేయాలి

**సిడిపిఓ క్రాంతి కుమారి**



**రాజవొమ్మంగి, అగస్టు 24, ప్రభాతవార్త** జ్ఞాన జ్యోతి శిక్షణలో నేర్చుకొన్న అంశాలను అంగ న్వాడీ కేంద్రాల పరిధిలో వినియోగిస్తూ అమలు చేయడం వల్ల చాలా ఉపయోగకరమని రాజవొమ్మంగి సిడిపిఓ క్రాంతి కుమారి అన్నారు. రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో సోమవారం అంగ న్వాడీ వర్కర్స్ కు 5 వరోజు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం జరిగింది. లింగ నిర్ధారణ, ఆధార్ శీల, నవచేతన అంశాలపై డిఆర్పీలు శేఖర్ బాబు, పప్పుల సరస్వతి, కోటం సత్యనారాయణలు శిక్షణ ఇచ్చారు. అడ్డతీగల సి. డి.పి. ఓ క్రాంతికుమారి, గంగవరం సిడిపిఓ సుచరిత పాల్గొని పలు అంశాలను వివరించారు. ఈకార్యక్రమంలో సూపర్ వైజర్స్ ఎం. ఇ. ఓ లు కె. వి. వి. సత్యనారాయణదొర, టి. సూరయ్యరెడ్డి, హెచ్. ఎం. దూరిపల్లి శ్రీనివాస్, సి.ఆర్పీ. శ్రీనివాస్, వీరయ్యమ్మ, అమ్మిరాజు, 95 మంది వర్కర్స్ పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I GUBBALA NARASIMHARAO S/o Venkata satyanarayana residence of D.No 5.21 Rameswaram Village Sakinetipalli Mandal East Godavari dist Ap Have changed my name from GUBBALA NARASIMAHARAO (old name)to GUBBALA NARASIMHARAO(new name) Hence after all my documents (Passport.....etc) and correspondence will continue with my new name Gubbala Narasimharao

**CHANGE OF NAME**

I DOMMETI GANESH (NEW NAME) S/o Rambabu previously called DOMMETI JAYAVALLI SATYA GANESH (Old Name)Resident Door No. 1-2-10 Ravulacheruvu , Amalapuram Town, Dr. B. R. Ambedkar Konaseema District 533201 AP. Now Changed My Name from DOMMETI JAYAVALLI SATYA GANESH (Old Name) to DOMMETI GANESH (New Name). Hence forth I will be called as DOMMETI GANESH (New Name) for all purpose.

# అర్ధరాత్రి రోడ్లపై పోలీసుల నిఘా

**-డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కేసులు.. 'స్టాప్, వాష్ అండ్ గో'తో అవగాహన**



**పిఠాపురం, ఆగస్టు 24 (ప్రభాతవార్త)** పిఠాపురం సర్కిల్ పరిధిలో అర్ధరాత్రి రోడ్లపై పోలీసుల నిఘా పెరిగింది. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై ఉక్కుపాదం మోపేందుకు పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. కాకినాడ జిల్లా ఎస్పీ జీ. బిందుమాధవ్ ఆదేశాల మేరకు పిఠాపురం సి.ఐ, జి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారులు, కీలక కూడళ్ల వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పలువురు వాహనదారులను గుర్తించి, వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మద్యం మత్తులో వాహనం నడపడం వల్ల డ్రైవర్‌తో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని పోలీసులు హెచ్చరించారు. రాత్రివేళల్లో వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తనిఖీలతో పాటు పోలీసులు నిర్వహించిన 'స్టాప్, వాష్ అండ్ గో' కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మద్యం సేవించిన వారు వాహనం నడపకుండా వాహనాన్ని నిలిపివేసి, నీటితో ముఖం కడుక్కొని, పూర్తిగా స్పృహలోకి వచ్చిన తర్వాతే ప్రయాణం కొనసాగించాలని అవగాహన కల్పించారు. అయితే మద్యం మత్తు తగ్గే వరకు వాహనం నడపకపోవడమే సురక్షితమని పోలీసులు స్పష్టం చేశారు.ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఈ తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు తెలిపారు. రోడ్డు భద్రతలో ప్రజల సహకారం కీలకమని పేర్కొన్నారు.

## మానవత్వం చాటుకున్న బాచినేని...



**ఎటపాక: ఆగస్టు 24 ( ప్రభాత వార్త):** మండల పరిధిలోని త్రిపుర పెంట వీడు గ్రామంలో గొల్లగూడెం నికి వెళ్ళే రహదారిలో వంతెన కొట్టుకుపోయి రైతులు బాటసారులు, వ్యవసాయదారులు రహదారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ సీనియర్ నాయకులు బాచినేని మల్లేశ్వరరావు తన సొంత ఖర్చులతో ఎంపీటీసీ కీర్తిశేషులు శ్రీమతి బాచినేని శ్రీదేవి జ్ఞాపకార్థం ఈ రహదారి మరమత్తులు చేయడం జరిగింది. అలాగే రహదారికి పక్కన ఉన్న స్మశాన వాటిక లో ఉన్న ముళ్ళ చెట్లు పొదలు కూడా తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ ప్రెసిడెంట్ దుద్దుకూరి సతీష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## లవ్ జిహాదీని అరికట్టాలి సాధిక్ ఖాన్ ను కఠినంగా శిక్షించాలి

**- కొత్తపేటలో బిజెపి ధర్నా డిఎస్పీకి ఫిర్యాదు**




**కొత్తపేట, ఆగస్టు 24, (ప్రభాతవార్త )** బిజెపి కొత్తపేట నియోజకవర్గ ఎస్ ఐ ఆర్ ఇంచార్జ్ పాలూరి సత్యానందం ఆధ్వర్యంలో బిజెపి నాయకులు కార్యకర్తలు రాష్ట్ర బిజెపి పార్టీ పిలుపుమేరకు కొత్తపేటలో కొంతసేపు ధర్నా నిర్వహించారు పిఠాపురం పంచాయతీ ఏఈ నూకరాజు కుటుంబం సాధిక్ ఖాన్ అనబడే వ్యక్తి కారణంగా లవ్ జీహాద్ కి బలైన సందర్భంలో ఆ సాదిక్ ఖాన్ ను కఠినంగా సృష్టించాలని పాలూరి డిమాండ్ చేశారు లవ్ జీహాదీని అరికట్టాలని బాధిత ఏఈ నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా చేసి కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్ కి ఫిర్యాదు చేశారు ఈ సంధర్భంగా పాలూరి మాట్లాడుతూ సాదిక్ ఖాన్ లవ్ జిహాదీ కారణంగా ఏఈ నూకరాజు కుటుంబం బలైందని ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి కోటిపల్లి వెంకట సుబ్రహ్మణ్యం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోలకోట వెంకటేశ్వరరావు బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు అన్యం సత్యనారాయణ బిజెపి కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు కోటిపల్లి రఘురాం వేణుగోపాల్ బిజెపి యువమోర్చా నాయకుడు కోటిపల్లి దామోదర్ తదితరులు పాల్గొన్నారు

## మండలశాలివాహన నూతన కమిటీ ఎన్నిక

**మామిడికుదురు.ఆగస్టు 24(ప్రభాతవార్త)** కోనసీమ శాలివాహన కుమ్మరి సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మామిడికుదురు మండల నూతన కమిటీ ఎన్నిక బి. దొడ్డవరం గ్రామంలో పేరూరి వెంకటేశ్వరరావు స్వగృహం వద్ద సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి కోనసీమ జిల్లా శాలివాహన కుమ్మరి సేవా సంక్షేమ సంఘం అధ్యక్షులు పుల్లేటికుర్తి రత్నం ముఖ్య అతిథిగా హాజరై,నియోజకవర్గ ఇంచార్జి తాడినాటి రామకృష్ణ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. మండల నూతన కమిటీఅధ్యక్షులుగా పేరూరి వెంకటేశ్వరరావు,గౌరవ అధ్యక్షులుగా కాపవరపు శేషగిరి,ఉపాధ్యక్షులుగా పేరూరి ఏసుబాబు, ప్రధాన కార్యదర్శిగా పేరూరు గణపతి, కోశాధికారిగా కాపవరపు గంగన్న,సభ్యులుగా పేరూరి చినవీరభద్రం, వెల్ల వీర వెంకట సత్యనారాయణయూత్ ప్రెసిడెంట్ గా రాయపూడి గంగబాబు లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులందరికీ కోనసీమ జిల్లా సంఘం తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా సలహాదారులు దొడ్డిపట్ల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాలీ శ్రీనివాస్ వడియార్, ప్రధాన కార్యదర్శి ఆదుర్తి నారాయణమూర్తి,పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తాడినాటి వెంకటేశ్వరరావు,అమలాపురం నియోజకవర్గ ఇంచార్జి ఏడిద రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## కొర్లగుంట ఏటిగట్టు రోడ్డును అభివృద్ధి చేయండి..బీజేపీ



**మామిడికుదురు.ఆగస్టు 24(ప్రభాతవార్త)** మామిడికుదురు శివారు కొర్లగుంట వద్ద ఏటిగట్టు రహదారి చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పసుపులేటి మహాలక్ష్మి రావు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పార్టీ నాయకులతో కలిసి తహశీల్దార్ సీఎస్ రాజు,ఎంపీడీఓ జి. భవానీ లకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బైరిశెట్టి దుర్గా రామకృష్ణ,అంకం నాగ పల్లేశ్వరరావు,నక్కా త్రిలోచనారావు,ఏ. మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ....

**ఎటపాక: ఆగస్టు 24 ( ప్రభాత వార్త):** మండల పరిధిలోని బుట్టాయి గూడెం గ్రామం లో ఉన్న సెంట్రల్ నర్సరీ యందు ఐటీసీ వారిచే, ఐటీసీ బంగారు భవిష్యత్ ప్రోగ్రాం నిర్వహించి, రైతులకు వేప జీడి మామిడి పనస మామిడి జామ మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ఐటీసీ ప్రతినిధి నెల్లిపాక రేంజర్ మూర్తి రైతులు తదితరులు పాల్గొన్నారు.



# దరఖాస్తుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు పరిష్కరించాలి.

**-కలెక్టర్ దినేష్ కుమార్**



**రంపచోడవరం, ఆగస్టు 24: ప్రభాతవార్త.** పోలవరం జిల్లాలో పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ)కు వచ్చే ప్రతి దరఖాస్తును ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా పరిష్కరించే బాధ్యత సంబంధిత శాఖల అధికారులదేనని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, ఆర్డీవో కె. స్వాతితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుమూల గ్రామాల నుంచి వచ్చే ప్రజల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా దరఖాస్తుదారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా దరఖాస్తుదారులకు ఫోన్ కాల్స్ వెళ్తాయని, ఆ కాల్ వచ్చేలోపే సంబంధిత అధికారులు దరఖాస్తుదారులను సంప్రదించి సమస్య పరిష్కారంపై చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి దరఖాస్తుపై శాఖలవారీగా యాక్షన్ ప్లాన్ రూపొందించి, ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు. పీజీఆర్ఎస్‌కు ముఖ్యమంత్రి కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చే దరఖాస్తులపై వారానికోసారి ఆడిట్ జరుగుతుందని పేర్కొంటూ, అర్హతను పూర్తిస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఈ నెల 29న అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వద్ద జరగనున్న సంజీవిని కార్యక్రమం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరవుతున్న నేపథ్యంలో, అన్ని శాఖలు అభివృద్ధి పనులపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఐటీడీఏ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై హర్షం...

**-సానా సతీష్ బాబు కార్యాలయంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం**



**కాకినాడ రూరల్, ఆగస్టు 24 (ప్రభాతవార్త):** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కొప్పవరంలోని టీడీపీ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు కార్యాలయం లో సోమవారం బీసీ నాయకులు సీఎం నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ బీసీ నాయకులు మాట్లాడుతూ బీసీలను రాజకీయాల్లోకి తీసుకురావడంలో దివంగత ఎన్టీ రామారావు, తెలుగుదేశం పార్టీ కీలక పాత్ర పోషించారని అన్నారు. బీసీలకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు కల్పిస్తున్న ఘనత సీఎం చంద్రబాబు నాయుడికే దక్కుతుందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 34 శాతానికి పెంచడం ద్వారా బీసీలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యం కల్పించారని హర్షం వ్యక్తం చేశారు. బీసీల సంక్షేమానికి టీడీపీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బద్రినాథ్, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, రాజనాల సత్యనారాయణ, బర్ల శ్రీనివాసు, ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి, ఇంద్రపాలెం గ్రామాధ్యక్షురాలు వెంకటరమణమ్మ, పాలిక సతీష్ , కోడి సీతారామయ్య, రాయుడు అనిల్,తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## చినబొడ్డు హైస్కూల్లో మధ్యాహ్న భోజనం పరిశీలన.

**తాళ్ళరేవు, ఆగస్టు 24 (ప్రభాతవార్త):** తాళ్ళరేవు మండలం కోరంగి బొడ్డు చినవెంకటాయ పాలెం జడ్పీ హైస్కూల్లో ఎంఈఓ మోకా ఉమ మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అన్నంలో పురుగులు ఉంటున్నాయని విద్యార్థులు, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు హై స్కూల్ హెచ్ఎం సాయిప్రసాద్, మధ్యాహ్న భోజనం కార్మికులను ఆమె సోమవారం విచారించారు. నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఎంఈఓ ఉమ తెలిపారు.



## స్థానిక ఎన్నికలపై కూటమి చర్చలు.. జనసేన కీలక ప్రకటన

**-అభ్యర్థుల పేర్లపై ముందస్తు ప్రచారాన్ని నమ్మొద్దు.. పవన్ కళ్యాణ్ తుది నిర్ణయమే కీలకం**

**పిఠాపురం, ఆగస్టు 24 ( ప్రభాతవార్త )** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి భాగస్వామ్య పక్షాలతో జరుగుతున్న చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం స్పష్టం చేసింది. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇచ్చిన సూచనలు, మార్గదర్శకాలకు అనుగుణంగానే కూటమి భాగస్వామ్య పక్షాలతో స్థానిక ఎన్నికల అంశంపై చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరపున అనుసరించాల్సిన కార్యాచరణ, పోటీ చేసే స్థానాలు, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై ప్రస్తుతం ప్రాథమిక స్థాయిలో సమాలోచనలు జరుగుతున్నట్లు పార్టీ తెలిపింది. గ్రామ, మండల, జిల్లా స్థాయిల నుంచి సేకరించిన సమాచారాన్ని సమగ్రంగా, పారదర్శకంగా సమీక్షించిన అనంతరం జనసేన పోటీ చేయాల్సిన స్థానాలు, ఆయా స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై పవన్ కళ్యాణ్ తుది నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేసింది. ఇదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో జనసేన పోటీ చేసే స్థానాలు ఖరారయ్యాయని, ఫలానా వ్యక్తులే అభ్యర్థులంటూ ప్రచారం జరుగుతున్న విషయాన్ని పార్టీ కేంద్ర కార్యాలయం తీవ్రంగా పరిగణించింది. కొన్ని చోట్ల అభ్యర్థుల పేర్లతో తీర్మానాలు చేస్తున్న విషయం కూడా తమ దృష్టికి వచ్చిందని పేర్కొంది. పార్టీ అధికారికంగా నిర్ణయం ప్రకటించే వరకు ఇలాంటి ప్రచారాలను నమ్మవద్దని జనసేన శ్రేణులకు సూచించింది. పార్టీ విధివిధానాలు, క్రమశిక్షణను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కేంద్ర కార్యాలయం స్పష్టం చేసింది. జనసేన సైనికులు, వీర మహిళల పోరాట స్ఫూర్తి, ఆత్మగౌరవం దెబ్బతినకుండా పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గతంలో శాసనసభ సమావేశాల్లో వెల్లడించిన అంశాలను పార్టీ శ్రేణులు గుర్తుంచుకోవాలని సూచించింది.

## ఘనంగా ముగిసినవాడపల్లి వెంకన్న పవిత్రోత్సవాలు

**ఆత్రేయపురం, ఆగస్టు 24,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి దేవస్థానంలో నిర్వహించిన శ్రీవారి పవిత్రోత్సవాలు శ్రావణ శుద్ధ ద్వాదశి సందర్భంగా సోమవారంతో ఘనంగా ముగిశాయి. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారికి మూడు రోజుల పాటు వైదిక సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించిన ఈ ఉత్సవాలు మహా పూర్ణాహుతితో సమాప్తమయ్యాయి. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో, పండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల నేతృత్వంలో ఉదయం సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మహాశాంతి హోమాలు, ప్రాయశ్చిత్త హోమాలు, మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన, మహదాశీర్వచనం, నీరాజన మంత్రపుష్పాలు తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పవిత్రోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వేదమంత్రాల నడుమ జరిగిన హోమాలు, పూజా కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మిక భావనలో ముంచెత్తాయి. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు--శ్రావణి దంపతులు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు స్వామివారికి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు . అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.






## పెట్టుబడులు, పరిశ్రమలను ఆకర్షించడంలో కూటమి ప్రభుత్వం విఫలం

**-జమ్మలమడక నాగమణి**



**కాకినాడ రూరల్, ఆగస్టు 24(ప్రభాతవార్త):** రాష్ట్రానికి పెట్టుబడులు, కొత్త పరిశ్రమలను తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శించారు. టాటా పవర్, వెబ్‌సోల్ సహా పలు కంపెనీలు పెట్టుబడి ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. పెట్టుబడులపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి, క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన లేదని అన్నారు. పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించి, పెట్టుబడిదారుల్లో నమ్మకం కలిగించాలని సూచించారు. పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నా ప్రభుత్వానికి చలనం లేదని, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జమ్మలమడక ఆవేదన వ్యక్తం చేశారు.

## భీమాబాయి మహిళామండలి చే ఎయిడ్స్ సురక్ష చైతన్య యాత్ర.



**తాళ్లరేవు, ఆగస్టు 14( ప్రభాతవార్త):** హెచ్ఐవి, సిఫిలిస్, హెపటైటిస్ బి వంటి దీర్ఘకాలిక వ్యాధుల పట్ల ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(ఏ.పి.సాక్స్), భీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కలిగించారు. దీర్ఘకాలిక వ్యాధుల పట్ల కలిగి ఉండాలని మరీ ముఖ్యంగా ప్రాణాంతకమైన హెచ్ఐవి, సిఫిలిస్, హెపటైటిస్ బి వంటి వ్యాధుల పట్ల మరింత అవగాహన అవసరమని బీమా బాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎయిడ్స్ సురక్ష చైతన్య యాత్ర సోమవారం మండలంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లరేవు కేరళ హైస్కూల్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రాణాంతకమైన వ్యాధుల పట్ల ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం రూపొందించినట్లు ఆమె తెలిపారు. ఎందుకు పరీక్షలు చేయించుకోవాలి, ఎవరు చేయించుకోవాలి, ఎక్కడ చేయించుకోవాలి వంటి అంశాలను ఆమె వివరించారు. తల్లి ఆరోగ్యంగా ఉండడానికి, శిశువు రక్షణకు, సకాలంలో చికిత్స ప్రారంభించడానికి, ఆరోగ్యవంతమైన కుటుంబం కోసం పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భిణీలు, గర్భిణీ జీవిత భాగస్వాములు, గతంలో హెచ్ఐవి పరీక్ష చేయించుకోని వ్యక్తులు, వైద్యుల సూచన మేరకు అవసరమైన ప్రతి ఒక్కరూ పరీక్ష చేయించుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ఈ పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని నందివర్ధన తెలిపారు. ఈ సందర్భంగా ప్రచార రథంలో స్క్రీన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేరళ హైస్కూల్ కరస్పాండెంట్ బివిఎ కుమార్ బాబు, మహిళా మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన



**అడ్డతీగల, ఆగస్టు 24, ప్రభాతవార్త** అడ్డతీగల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఆగస్టు 24 నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకానున్నారు. ఈ మేరకు సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ రెడ్డికి నోటీసు అందజేశారు. ఉద్యోగాల రెగ్యులరైజేషన్, 100 శాతం గ్రాస్ వేతనం, ఈపీఎఫ్, వైద్య సెలవులు, హెల్త్ కార్డులు, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గొట్టపల్లి రామకృష్ణ, పిల్లి సునీత, రాజేష్, జానకీదేవి, సీతాదేవి, శాంతికుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమం

**-టీడీపీ ఇన్‌చార్జ్ గొల్లపల్లి..**



**సఖినేటిపల్లి ఆగస్టు 24, ప్రభాత వార్త:** డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం వి.వి.మెరక గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి, రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గొల్లపల్లి అమూల్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమూల్య పలు కుటుంబాలను స్వయంగా కలిసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధిని అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో భూపతిరాజు ఈశ్వరరాజు వర్మ (సాయిబాబు రాజు), మండల పార్టీ అధ్యక్షులు తాడి సత్యనారాయణ, అనుచూరి పురుషోత్తం, లంకే శ్రీనివాసరావు, చింత వీరబాద్రరావు, నాగబాబు, కొండా శివయ్య, చెల్లిబోయిన జై సూరిబాబు, పి వెంకట రమణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తగితరులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల్లో జన సేన నాయకుల పర్యటన..



**ఎటపాక : ఆగస్టు 24 (ప్రభాత వార్త):** మండల పరిధిలోని రాయన పేట పంచాయతీ పెనుబల్లి గ్రామం లో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో గ్రామస్తులు రహదారుల సమస్య గురించి వివరించారు. వారు స్పందించి అధికారుల దృష్టికి రహదారి సమస్య తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు మారాసు గంగాధర్, కొమ్ము వెంకటేష్, గోదేటి నాగరాజు, గద్దల ప్రవీణ్ , మంద సాయి,మైపా సాయి , సోయం.రామారావు, తెల్లం నాగరాజు,గుండి. అంజిబాబు,. పెనుబల్లి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## ప్రజావేదిక నిర్వహణపై. పలు విమర్శలు .



**గండేపల్లి, ఆగస్టు 24. ప్రభాతవార్త** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావేదిక కార్యక్రమం తహసీల్దార్ కార్యాలయంలోని ఓ గదికే పరిమితం కావడంపై పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలను అధికారులు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఎక్కడ జరుగుతుందో స్పష్టంగా తెలియక కొందరు ప్రజలు కార్యాలయానికి వచ్చి వెనుతిరిగి వెళ్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మరోవైపు ప్రజావేదికకు సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడం, నిర్ణీత సమయానికి కార్యాలయానికి రాకపోవడంతో సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన ప్రజలు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రజావేదిక ఉద్దేశం నెరవేరాలంటే కార్యక్రమాన్ని స్పష్టమైన ప్రదేశంలో నిర్వహించడంతోపాటు అన్ని శాఖల అధికారులు సమయానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో హరికృష్ణ సత్యారెడ్డి, విద్యాశాఖ, హౌసింగ్, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## గండేపల్లి లో ఘనంగా చీర సారే మహోత్సవం



**గండేపల్లి, ఆగస్టు 24. ప్రభాత వార్త** పవిత్ర శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన గండేపల్లి శ్రీ ఉమా చంద్రశేఖర స్వామివారి ఆలయంలో శ్రీ ఉమాదేవి అమ్మవారికి చీర సారే మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు, ఫలాలు, గాజులతో కూడిన సారెను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## రహదారిపై టోల్ వసూళ్లా?

**-రోడ్డు భద్రత, అంబులెన్స్ సేవలు ఏవి?: ఆదివాసీ గిరిజన నాయకుడు లోత రామారావు డిమాండ్**



**అడ్డతీగల,ఆగస్టు 24, ప్రభాతవార్త** జాతీయ రహదారి పనులు పూర్తికాకుండానే టోల్ గేట్ వసూళ్లు ప్రారంభించడంపై ఆదివాసీ గిరిజన సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని ఐ. పోలవరం నుంచి రాజవొమ్మంగి మండలం బోయపాడు జంక్షన్ వరకు 516-ఈ జాతీయ రహదారి నిర్మాణం ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నప్పటికీ టోల్ రుసుము వసూలు చేయడం సరికాదని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు విమర్శించారు. టోల్ గేట్ వద్ద వాహనదారుల నుంచి సుంకం వసూలు చేస్తున్నప్పుడు, దానికి అనుగుణంగా రహదారిపై ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే స్పందించేందుకు హైవే అంబులెన్సును అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల అడ్డతీగల మండలం వీరభద్రపురం గ్రామ సమీపంలో చోటుచేసుకున్న ప్రమాదాన్ని ప్రస్తావిస్తూ.. రాజవొమ్మంగి నుండి అంబులెన్స్ వచ్చే వరకు బాధితులు తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చిందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా కనీసం విద్యుత్ దీపాలు కూడా వెలగడం లేదని, చీకటి కారణంగా ఈ మార్గంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. కనీస సౌకర్యాలు కల్పించకుండా, ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారుల తీరుపై మండిపడుతూ. ఈ ప్రమాదాలకు బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. తక్షణమే జాతీయ రహదారి పనులను పూర్తి చేయడంతో పాటు, రహదారిపై వెలుతురు మరియు అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని లోత రామారావు సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.

## ప్రమాదబరితంగా మారిన ఇటుకల బట్టి

**-చోద్యం చూస్తున్న అధికారులు**



**పెదపూడి 24 ఆగస్టు ప్రభాత వార్త:** కాకినాడ జిల్లా పెదపూడి మండలం రాజుపాలెం రాజుపాలెం లంక గ్రామాల మధ్యలో ఉన్న ఇటుకల బట్టి ప్రమాదకరంగా మారిందని అక్కడ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. బట్టి యాజమాన్యం ఇటుకలు కాల్చడానికి కావలసిన తాడి చెట్లను పెద్ద పెద్ద ముక్కలుగా చేసి రోడ్డు పక్కనే వేసి ఉంచారు అవి ఇటీవల కురిసిన వర్షాలకు పచ్చని పాదులు తాడిచెట్టుదుంగలును మూసివేయడంతో అవి కనిపించకపోవడం జరుగుతుంది. రోడ్డు చిన్నది కావడంతో రెండు వాహనాలు ఒకేసారి రావడంతో పక్కన ఉన్నవి పచ్చని పాదులే కదా అని రోడ్డు దిగితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే ఇటీవల ఒక కారు ఇటువంటి ప్రమాదానికి గురైందని అక్కడ ప్రజలు చెబుతున్నారు అంతేకాకుండా ఈ బట్టికి వాడే ముడి సరుకులలో ఒకటైన కాల్చిన ధాన్యంపుట్టు గాలికి వదిలేయడంతో అది గాలివీసినప్పుడు రోడ్డు మీద వెళ్తున్న వ్యక్తులపైకి వచ్చి కళ్ళల్లో పడటంతో చాలామంది ప్రమాదానికి గురయ్యాయి ఇబ్బంది పడటం జరిగిందని అక్కడి ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా రోడ్డు పక్కనే ఇటుకలను గుట్టలుగా చేసి కాల్చడం వల్ల రోడ్డు మీద వెళ్ళేవాళ్ళుకు పొగ విపరీతంగా వచ్చి ఎదురుగా వచ్చేవాళ్ళు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి అని అదికాక విపరీతమైన వేడి రావడం కూడా జరుగుతుంది అని అక్కడి ప్రజలు వాపోతున్నారు. ఇంత జరుగుతున్న ఆర్ అండ్ బి అధికారులు గాని పంచాయతీ అధికారులు గానీ దీనిపై స్పందించకపోవడంతో భారీ మొత్తంలో చేతులు మారాయని అక్కడ ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఇప్పటికైనా ఆది కారులు స్పందించి వెంటనే ఆ బట్టినీ నిలుపువేయాలని అక్కడి ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు కోరుకుంటున్నారు

## మృతి చెందిన వేద విద్యార్థుల కుటుంబాలకి ఆర్థిక సాయం..



**అంబాజీపేట,ఆగస్టు 24, (ప్రభాతవార్త):** ప్రమాదవశాత్తు చెరువులో మునిగి చనిపోయిన ఇద్దరు వేద విద్యార్థుల కుటుంబాలకి దాతలు ఆర్థిక సాయం అందించారు. అంబాజీపేట మండలం ముక్కామల కంచి కామకోటి యజుర్వేద పాఠశాల వద్ద వేద విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ ఆకెళ్ళ నారాయణమూర్తిఅవధాని ఆధ్వర్యంలో మృతి చెందిన వేద విద్యార్థులు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1,22,500లు చొప్పున అందజేశారు. గత నెల 29న అమరావతి మండలం యంద్రాయి గ్రామంలో బమ్మిడి శివ నాగ సుబ్రహ్మణ్యశర్మ, కొడవటి కంటి కిరణ్ ఇద్దరు వేద విద్యార్థులు ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయారు. వారి కుటుంబాలకి అండగా ఉండాలని భావించి బ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ ఆకెళ్ళ నారాయణమూర్తి తను సహాయం చేయడంతో పాటు మరి కొంతమంది బ్రాహ్మణుల నుండి విరాళాలు సేకరించి ఆ కుటుంబాలకు ఆర్థిక సహకారం అందించి, అండగా నిలిచారు.

మరిన్ని వార్తలు 6లో

# వేమగిరి యువతి అదృశ్యం



**కడియం ,ఆగస్టు 24 ( ప్రభాతవార్త)** కడియం మండలం వేమగిరి గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువతి పొడుగుమాటి బానులత అదృశ్యమైన ఘటనపై కడియం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసు వారు వివరాల ప్రకారం.. చంద్రశేఖర్, అనంతలక్ష్మి దంపతుల కుమార్తె బానులత ఈ నెల 23న ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి కడియం భాస్కర్‌నగర్‌లోని చర్చికి వెళ్లింది. అనంతరం ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి అనంతలక్ష్మి కడియం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి యువతి ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు.బానులత ఆచూకీ తెలిసిన వారు లేదా ఎక్కడైనా కనిపిస్తే 91548 80131, 77803 00801 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# ఎంపీటీసీ మేలిమి మంగకు చందన నాగేశ్వర్ ఆర్థిక సాయం



**కడియం, ఆగస్టు 24 ( ప్రభాతవార్త)** అనారోగ్యంతో బాధపడుతున్న కడియం మండలం,మురమండ గ్రామ ఎంపీటీసీ మేలిమి మంగ కుటుంబానికి రాష్ట్ర పచ్చదనం మరియు సుందరీకరణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్) చందన నాగేశ్వర్ ఆర్థిక చేయూత అందించారు.ఇటీవల మేలిమి మంగ గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. అనారోగ్య కారణాలతో పనికి వెళ్లలేకపోవడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా తెలుసుకున్న చందన నాగేశ్వర్ సోమవారం మురమండలోని ఆమె నివాసానికి వెళ్లారు. మేలిమి మంగ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. మేలిమి మంగ అనారోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న వెంటనే స్పందించి తన వంతు సహాయం అందించినట్లు తెలిపారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర డీజీపీకి, హోం మంత్రి ఈ సంఘటనపై స్పందించాలని డిమాండ్....



**సఖినేటిపల్లి ఆగస్టు 24, ప్రభాత వార్త:** సాధిక్ ఖాన్ లవ్ జిహాదీ కారణంగా ఆత్మహత్య చేసుకున్న ఏఈ నూకరాజు కుటుంబం కు న్యాయం చేయాలనీ వినతి పత్రం అందించారు. ఈ కేసులో వంచన మోసం దోపిడి హత్య లవ్ జిహాదీ ఉగ్రవాదం ఉన్నదని, ఆరోపణలు నేపథ్యంలో షాదిక్ ఖాన్ ని కఠినంగా శిక్షించాలని సఖినేటిపల్లి మండల భారతీయ జనతా పార్టీ సభ్యులు సఖినేటిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వారికి నాయకులు వినత పత్రం సమర్పించారు. కాకినాడవైఎస్ఆర్సీపీపార్టీ నాయకుని సిఫార్సుతో ఇంటర్నేషనల్ స్కూల్ లో రైఫిల్ షుటింగ్ శిక్షకునిగా పని చేస్తూ పరిచయమైన సాధిక్ ఖాన్ లవ్ జిహాదీ కారణంగా ఆత్మహత్య చేసుకున్న ఏఈ నూకరాజు కుటుంబం కు న్యాయం చేయాలి. ఈ కేసులో వంచన మోసం దోపిడి హత్య లవ్ జిహాదీ ఉగ్రవాదం ఉన్నాయని, షాదిక్ ఖాన్ ని కఠినంగా శిక్షించి, ఇతనికి సహకరించిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర డీజీపీకి, హోం మంత్రి లు ఈ సంఘటనపై స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు పోతురాజు సురేష్, జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు మాలే శ్రీనివాస్ నగేష్, మండల ప్రధాన కార్యదర్శి బోనం నాయుడు, కిషన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఇందుకూరి సుబ్బరాజు, చంపాటి శివరామకృష్ణంరాజు, రుద్రరాజు రామకృష్ణంరాజు, తదితరులు పాల్గొనారు.

# అంతర్వేది నరసింహుని రధశాల నిర్మాణ సన్నాహాలు...



**సఖినేటిపల్లి ఆగస్టు 24, ప్రభాత వార్త:** అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం ప్రాంగణంలో నూతన రధశాల నిర్మాణానికి రెండు కోట్ల రూ.ల పుస్కర నిదులతో సన్నాహాలు ఆలయ అధికారులు చేస్తున్నారు. శ్రీ స్వామివారికి పేదల విశ్రాంతి కొరకు డోర్మెంట్ గదులు నిర్మాణము జరుగుతున్నట్లు, రథం షెడ్ నిర్మాణం త్వరతిన పూర్తి చేస్తారని దేవాదాయ ధర్మాదాయ శాఖ డి ఈ ఈ ఉదయ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మోకా నాగవర ప్రసాదు, ఈ ఓ రాజు,ఎస్ ఈ కిరణ్, కాంట్రాక్టర్, తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురం ఘటనపై సాదిక్ ఖాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

## -గోకవరం పోలీస్ స్టేషన్‌లో బీజేపీ ఫిర్యాదు



**గోకవరం: 24 ప్రభాత వార్త** పిఠాపురంలో పంచాయతీరాజ్ ఏఈ కుటుంబం ఆత్మహత్యకు కారణమైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సాదిక్ ఖాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గోకవరం మండల బీజేపీ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై నాగమణికి ఫిర్యాదు చేశారు. కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆదేశాల మేరకు మండల బీజేపీ అధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర ఆధ్వర్యంలో నాయకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళలను మోసగించి, బెదిరింపులకు గురిచేసి, మత మార్పిడికి ప్రేరేపిస్తూ అరాచకాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పిఠాపురం ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర హోంమంత్రి, డీజీపీ ఈ ఘటనపై స్పందించి నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. నేరాలకు పాల్పడే వారికి చట్టం పట్ల భయం కలిగే విధంగా చర్యలు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా మంగరాజు, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ సత్తి వెంకటరెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ బత్తుల వెంకన్నబాబు, జిల్లా బీజేపీ కార్యదర్శి కోనా వెంకట సురేష్, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి ముప్పిడి నాగేశ్వరరావు, బీజేపీ నాయకులు తామర్ల రాంబాబు, ఉంగరాల ఆది విష్ణు, మామిడి వీర వెంకట సత్యనారాయణ, మామిడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు

# పార్కుల అభివృద్ధి నిర్వహణపై ప్రత్యేక దృష్టి

## -కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 24( ప్రభాతవార్త)** నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా పార్కుల అభివృద్ధి నిర్వహణలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. సోమవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆల్ బ్యాంక్ కాలనీ పార్క్ లోని సౌకర్యాలు పారిశుధ్య నిర్వహణ పచ్చదనం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడమే కాకుండా వారి ఆరోగ్యని దృష్టిలో ఉంచుకుని పార్కుల్లో వసతులను కల్పించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రజల సహకారంతో పార్కులను మరింత ఆరాధకరంగా ఆరోగ్యకరమైన వాతావరణానికి కేంద్రాలుగా తీర్చిదిద్దోచ్చినని తెలిపారు. ఈయన వెంట ఎస్ ఈ రీటా ఈ ఈ మదర్స్ అలీ ఏ డి హెచ్ అనిత డి ఈ లోవరాజు ఇతర సిబ్బంది ఉన్నారు.పిజిఆర్ఎస్లో 23 దరఖాస్తులు స్వీకరణ.స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం లోని పీజీ ఆర్ఎస్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 23 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును అత్యంత బాధ్యతతో స్వీకరించి క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. అర్జీలను కేవలం ఎండార్స్మెంట్ జారీ చేసి మూసివేయకుండా సమస్య పరిష్కారమైందా లేదా అన్నది క్షేత్రస్థాయిలో నిర్ధారించుకోవాల్సిన అవసరం ఉందని గడువు దాటిన ఒక్క అర్జీ కూడా పెండింగ్లో లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంజనీరింగ్ సంబంధించి ఏడు రెవెన్యూ కి మూడు టౌన్ ప్లానింగ్ 8 పబ్లిక్ హెల్త్ నాలుగు పంచాయతీరాజ్ ఒకటి ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ రీటా టౌన్ ప్లానింగ్ అధికారి జి వి ఎస్ ఎన్ మూర్తి ఎంహెచ్ఓ వినూత్న మేనేజర్ అబ్దుల్ మాలిక్ రెవెన్యూ అధికారి సిహెచ్ శ్రీనివాసరావు ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.


# మెదడు వాపుతో బాధపడుతున్న విద్యార్థికి సహాయం..



**సఖినేటిపల్లి/ మలికిపురం ఆగస్టు 24, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం గ్రామంలో 11 సంవత్సరాల పాప ఆశా జ్యోతి మెదడు వాపు సమస్యతో బాధపడుతుందని, తెలిసి విద్యార్థి సంఘ నాయకులు పోలిశెట్టి గణేష్, పడాల పవన్ నాయుడు, కొడవటి భాను ప్రకాష్ రూ 10,000 లు. వాళ్ళ తండ్రికి అందజేసినారు. ఈ పాపకి వాళ్ళ తల్లితండ్రులు 15 లక్షలు ఖర్చు చేసారని, ఇంకా రెండు సంవత్సరాల పాటు నెలకి రెండు ఇంజక్షన్ లు చేయించాలని, డాక్టర్స్ చెప్పగా ఒక్కో ఇంజక్షన్ ఖరీదు 40 వేల రూ.లు అవుతుందని, ఇప్పటికే మా స్థోమతకు మించి పాప కోసం ఖర్చు చేసామని, దాతలేవరైనా ముందుకొచ్చి సహాయం చేస్తే మా పాపను బతికించిన వాళ్ళు అవుతారని తండ్రి అభ్యర్థిస్తున్నారు. దయచేసి దాతలు ముందుకొచ్చి మీకు చేతనైనంత సహాయం చెయ్యగలరని విద్యార్థి సంఘ నాయకుడు పోలిశెట్టి గణేష్ కోరారు.

# రొయ్యల చెరువులో వ్యక్తి మృతదేహం..

## -మృతుని బంధువులకు,రొయ్యల చెరువు లీజుదారుడికి మధ్య వాగ్వాదం..



**అంబాజీపేట,ఆగస్టు 24, (ప్రభాతవార్త):** రొయ్యల చెరువు వద్ద పనికి వెళ్లిన వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందడంతో కలకలం రేగింది. మండలంలోని తొండవరం గ్రామపంచాయతీ పరిధిలోని వెన్నపువారి పుంతలో గల రొయ్యల చెరువులో వ్యక్తి మృతదేహాన్ని సోమవారం కనుగొన్నారు. ఇతను చెరువు వద్ద పనిచేస్తున్న మామిడికుదురు మండలం బోడసకుర్రు పల్లిపాలెంకు చెందిన ఓలేటి రాజు (32) గా గుర్తించారు. ఇతని మరణం పై విభిన్న కథనాలు వినిపిస్తున్నాయి.చెరువు వద్ద ఉన్న మోటారు లైన్ వద్ద కరెంట్ షాక్ కు గురయ్యాడని మృతుని కుటుంబ సభ్యులు చెబుతుండగా, అధికంగా సేవించిన ఆల్కహాల్ వలన స్పృహ తప్పి పడిపోయి ఉంటాడని రొయ్యల చెరువు లీజు దారుడు చెబుతున్నారు. దీంతో మృతుని బంధువులకు, చెరువు లీజు దారుడికి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు తెలిసింది.మృతునికి భార్య,కుమారుడు,కుమార్తె ఉన్నారు. అంబాజీపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి ..

## -తహశీల్దార్ రామచంద్రమూర్తి.



**ఆత్రేయపురం, ఆగస్టు 24,(ప్రభాత వార్త)** మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం తహశీల్దార్ ఆర్. డి. రామచంద్రమూర్తి, మండల పరిపాలనాధికారి వి. రామ స్వరూప్, మండల వ్యవసాయ అధికారి జె. పట్టాభి రామయ్య ల కలిసి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ వో లు) సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా నోటీసులు అందుకున్న ప్రతి ఓటరును వ్యక్తిగతంగా హియరింగ్ నిర్వహించి, వారి సంబంధిత ధ్రువపత్రాలను సకాలంలో యాప్‌లో అప్‌లోడ్ చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు.అలాగే ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.ఈ సమావేశంలో తహశీల్దార్ రామచంద్రమూర్తితో పాటు ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గణేష్, గ్రామ రెవెన్యూ అధికారులు మరియు వివిధ గ్రామాల బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మసకపల్లిలో మంత్రి సుభాష్ ప్రత్యేక పూజలు



**కె. గంగవరం, ఆగస్టు 24, (ప్రభాతవార్త):** కె గంగవరం మండలం మసకపల్లి గ్రామంలో మంత్రి సుభాష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని శ్రీ దేవీ భూదేవి సమేత కేశవస్వామి ఆలయం, శ్రీ పార్వతీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రికి పూజా కార్యక్రమాలను నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.మంత్రి సుభాష్‌కు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మపురి సొసైటీ అధ్యక్షుడు గెద్దం పల్లపరావు (బన్ని),చిరువురి వెంకట సత్యనారాయణ రాజు,సత్తిబాబు రాజు,కొప్పెర్ల వెంకట నరసింహారాజు,చోడి శివకేశవరావు,రవ్వా భూషణం,దామోదర శ్రీనివాసరావు,చొల్లంగి ఎదురులయ్య, నిమ్మకాయల రాంబాబు,గెద్దం శ్రీనివాసులు,మేడిశెట్టి బాబి, సుంకర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కూటమిలో కుంపటి



**కాట్రేనికోన ఆగస్టు 23(ప్రభాతవార్త)**స్థానిక సంస్థలకు ఎన్నికల షెడ్యూల్ ప్రకటన విడుదల చేయడంతో పంచాయతీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారంనకు శ్రీకారం చుట్టారు. మండలంలోని బ్రహ్మ సమేధ్యం పంచాయతీలో కూటమి రెబల్ సర్పంచి అభ్యర్థి తిరుమాని వీరబాబు సోమవారం చేపట్టిన ఇంటింటా ప్రచారం కూటమిలో కుంపటిగా మారింది. ముందుగా బలుసుతిప్పలో పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారంను ప్రారంభించారు. రాబోయే ఎన్నికలలో ఓటు వేసి సర్పంచిగా గెలిపిస్తే అవినీతి రహిత పారదర్శకతతో కూడిన స్వచ్ఛమైన పరిపాలన అందిస్తానన్నాడు. సర్పంచి అభ్యర్థిగా తనను గెలిపిస్తే గ్రామ అభివృద్ధి కోసం చేపట్టబోయే మేనిఫెస్టోను ఓటర్లు వివరిస్తూ ఇంటింట ప్రచారం చేస్తున్నాడు. సర్పంచి రెబల్ అభ్యర్థి తిరుమాని వీరబాబు ఇంటింటా ప్రచారం దూకుడుతో కూటమిలో వణుకు పుట్టిస్తుంది. బ్రహ్మసమేధ్యం సర్పంచి అభ్యర్థిగా ఎమ్మెల్యే ఆశీస్సులు మరొక నాయకుడుకు ఉండటం, గత ఎన్నికలలో సర్పంచిగా పోటీ చేసి ఓడిపోవడంతో వీరబాబుకు ప్రజల సానుభూతి బలంగా ఉంది. ఏమైనా రెండు బలమైన అధికార, ప్రతి పక్షపార్టీల కూటమి రెబల్ సర్పంచి అభ్యర్థి వీరబాబు ఇంటింట ప్రచారం గుబులు పుట్టిస్తుంది.

# రుణ వసూళ్లులో జాప్యంతో కొత్త రుణాలు పొందలేం.. ఏ పి. ఎం. లక్ష్మి



**రాజవొమ్మంగి, అగస్టు 24, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండల మహిళా సమాఖ్య సమావేశం సోమవారం ఉపాధ్యక్షులు ఎల్లం మంగ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఏ.పి. ఎం లక్ష్మి మాట్లాడుతూ రుణాలు వసూలులో జాప్యం వల్ల కొత్త రుణాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఐ. బి. సన్యాసిరావు మాట్లాడుతూ సి. ఐ. ఎఫ్ రుణ వసూళ్ల లో ఆఫ్ లైన్ తీసుకొన్న అప్పులు రికవరీ లేదన్నారు. మొబైల్ బుక్ కీపింగ్, మన డబ్బులు మన లెక్కలు, లోకోష్ యాప్ పై వివరించారు. శ్రీనిధి రుణాలు వసూళ్లు 10 వి. ఓ ల్లో ఏర్పడిన మొండి బకాయిలు వల్ల వడ్డీ లేని రుణాలు కోల్పోవడం జరుగుతుందని శ్రీనిధి మేనేజర్లు తెలిపారు. ఇదే కాకుండా కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న పి. ఎం. ఇ. ఎఫ్. ఇ. కొత్త పథకంలో ఒక సభ్యురాలుకు రూ. 10 లక్షలు ఋణం పొందే అవకాశం ఉందని అన్నారు. ఇలాంటి రుణాలు పొందటానికి వసూళ్లు లేని కారణంగా అందరూ అర్హత కోల్పోతున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు సాగిన దేవి, ఎల్లం మంగ, ఏ. పి. ఎం మర్రి లక్ష్మి, .ఐ.బి. సన్యాసిరావు, ఏ. పి. ఎం. ఫైనాన్స్ సత్యప్రసాద్, శ్రీనిధి మేనేజర్లు, సీసీ లు రామకృష్ణ, లింగమ్మ, సూర్యనారాయణ, చిలకమ్మ, శ్రీరామ్మూర్తి, సిబ్బంది రాజశేఖర్, 59 వి. ఓ ప్రతినిధులు, వి. ఓ ఏ లు పాల్గొన్నారు.

# నూకరాజు కుటుంబ ఆత్మహత్య కారకులపై చర్యలు తీసుకోవాలి.. మండల బి. జె. పి. అధ్యక్షులు ఎల్. రాజబాబు



**రాజవొమ్మంగి, అగస్టు 24, ప్రభాతవార్త** పిఠాపురం పంచాయితీరాజ్ ఏ. ఈ నూకరాజు కుటుంబం ఆత్మ హత్యకు దారితీసిన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులను కఠినచర్యలు తీసుకోవాలని రాజవొమ్మంగి మండల బిజెపి అధ్యక్షులు లోసుల రాజబాబు, జిల్లా ఉపాధ్యక్షులు తాము సూరిబాబు, బోరగా రామకృష్ణ రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ లో సోమవారం పిర్యాదు చేశారు.సాధిక్ ఖాన్‌పై వచ్చిన ఆరోపణలను పూర్తిస్థాయిలో విచారించి నిజానిజాలు వెలుగులోకి తేవాలని, అతనికి సహకరించిన వారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర డీజీపీ, హోంమంత్రి స్పందించి రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి కేసులపై తీసుకున్న చర్యలు, నమోదైన ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్‌ల వివరాలను వెల్లడించాలని కోరారు. బాధితులకు పోలీసు వ్యవస్థపై నమ్మకం కలిగేలా కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో లోసుల రాజబాబు, తాము సూరిబాబు, బొరగా రామకృష్ణ పాల్గొన్నారు.

# కుండలేశ్వరుని హుండీ ఆదాయం రూ. 6 లక్షల



**కాట్రేనికోన ఆగస్టు 24 (ప్రభాతవార్త)** పవిత్ర పుణ్య క్షేత్రం పార్వతీ సమేత కుండలేశ్వరస్వామి ఆయలంలోని ధర్మ హుండీలు. మూడింటిని తనిఖీదారు అమలాపురం జే రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో సోమవారం లెక్కించడం జరిగిందని ఈఓ సూర్యవెంకట దుర్గ తెలిపారు. కాట్రేనికోన మండలం కుండలేశ్వరంలో పార్వతీ సమేత కుండలేశ్వరుని ఆలయంలో ఈఏడాది ఫిబ్రవరి 18 నుంచి ఆగస్టు 24 వరకు ఆరు నెలల ఆరు రోజులకు రూ.6 లక్షల 73 వేల 793లు ఆదాయం వచ్చిందన్నారు. ధర్మ హుండీల లెక్కింపు ఆలయ సేవా సంఘం. గ్రామస్థుల సమక్షంలో ఆలయ తనిఖీదారు పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టామన్నారు. హుండీ ఆదాయంను బ్యాంకు నందు ఆలయ ఖాతాలో జమచేయడం జరిగిందన్నారు.

# వేట్లపాలెంలో మెగా ఉచిత వైద్య శిబిరం



**కాట్రేనికోన ఆగస్టు 23 (ప్రభాతవార్త)** కాట్రేనికోన పంచాయతీ పరిధిలో వేట్లపాలెంలో సోమవారం అమలాపురం కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరంను నిర్వహించారు. వేట్లపాలెం మావుళ్ళమ్మ ఆలయం వద్ద కిమ్స్ ఆసుపత్రి వైద్యులు నిర్వహించిన ఉచిత వైద్య శిభిరంనకు రోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కిమ్స్ వైద్య బృందం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు చితంగా అందచేసారు. వైద్య శిభిరంలో సుమారు 300 మంది రోగులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైద్యులు ఓలేటి వెంకట సాయి సుమంత్. డా.అన్వేష్ (జనరల్ మెడిషన్). డా. శామ్సన్ సుభాష్(జనరల్ సర్జన్), డా. వైదేహి మునుకుంట్ల (గైనకాలజీ), డా. చందన (చిన్న పిల్లల వైద్యులు) వివిధ విభాలకు చెందిన వైద్యులు, ఆరోగ్య సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

# పలువురిని పరామర్శించిన జక్కంపూడి



**సీతానగరం, ఆగస్టు 24, (ప్రభాతవార్త):** మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోమవారం పలువురిని పరామర్శించారు. మునికూడలి, వెదుళ్లపల్లి, ముగ్గళ్ళ, రాపాక, సీతానగరం, చినకొండేపూడి, కూనవరం గ్రామాల్లో పర్యటించి ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో చల్లమళ్ళ సుజీరాజు, పెదపాటి రమేష్ బాబు, కవల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# నిస్వార్థ సేవకు నిదర్శనం వైద్యులు శ్రీనివాస్



**యు.కొత్తపల్లి, ఆగస్టు 24(ప్రభాతవార్త) :** సేవ, సహాయం చేయాలనే సంకల్పం ఉన్నవారు చాలా అరుదుగా ఉంటారు. అటువంటి వారిలో మండలంలోని వాకతిప్ప గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు జ్యోతుల శ్రీనివాస్ ఒకరు. విద్యకు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించడం తనకు తానే సాటి. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి రూ.36వేలు అందించి తన సేవాగుణాన్ని మరొకమారు చాటుకున్నారు. వాకతిప్ప జిల్లా పరిషత్ పూర్వ విద్యార్థిగా ఆర్థిక సహాయం అందించి పెద్ద మనస్సు చాటుకున్నారు. అదనపు తరగతి గదులు విద్యుత్ సరఫరా మీటర్ కోసం రూ. 28వేలు డి.డి కి, ఇతర ఖర్చుల కోసం మరో రూ.8వేలు మొత్తాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావుకు అందజేశారు. ఇటీవల జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి ఉత్తమ విద్యార్థులుగా ప్రతిభ చూపిన వారికి మెమొంటోల ఖర్చు కోసం రూ.12 వేలు కూడా అందజేసారు.

# రాజవొమ్మంగి ఎం. ఇ. ఓ కు ఘన సన్మానం..

## -మన్యం విద్యాభూషణ్ బిరుదు తో ప్రశంసలు



**రాజవొమ్మంగి, ఆగస్టు 24, ప్రభాతవార్త** స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఉత్తమ మండల విద్యాశాఖాధికారి గా పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతులు మీదుగా అందుకొన్న రాజవొమ్మంగి మండల విద్యాశాఖాధికారి కె. వి. వి. సత్యనారాయణ దొర ను సోమవారం రాజవొమ్మంగి మండల యు. టి. ఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. ఈసందర్భంగా ఎంపిపి గోము వెంకటలక్ష్మి, మండల టిడిపి అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు లు మాట్లాడుతూ పదోతరగతి ఫలితాల్లో జిల్లా ప్రదమ స్థానం రావడానికి ఎం. ఇ. ఓ. చేసిన కృషి అభినందనీయమన్నారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మంచి విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత మన ఉపాధ్యాయులు అందరిపైనా ఉందని అన్నారు. మన్యం ప్రాంతం నుండి నీట్, ఐ.ఐ. టి లకు కూడా విద్యార్థులు ఎంపిక అవుతున్నారని అన్నారు. అనంతరం యు టి. ఎఫ్ మండల శాఖ తరుపున ఒక మెమెంటో, ప్రశంశాపత్రంతో బాటు “మన్యం విద్యా భూషణ్ “అనే బిరుదుతో ప్రశంసించారు. మండలంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం. ఇ. ఓ ని సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు జి విశ్వరాజు, జిల్లా అసోసియేట్ మహిళా అధ్యక్షురాలు బి. వెంకటలక్ష్మి, జిల్లా కోశాధికారి తీగల బొజ్జయ్య, జిల్లా కార్యదర్శులు, కె. సూరిబాబు, పి.రమణ, రంపచోడవరం అధ్యక్షులు, సనాతన బాబు, మారేడుమిల్లి ప్రధాన కార్యదర్శి, కృష్ణారెడ్డి, రాజవొమ్మంగి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి. శ్రీను, కె శ్రీను గౌరవ అధ్యక్షులు ఉదయ్, మహిళ అసోసియేట్ అధ్యక్షులు కోడూరి లోవరాజు, కోశాధికారి టీవీ ఎల్ ఎన్ మూర్తి, మండల మహిళా కార్యదర్శి లక్ష్మీప్రసన్న, మండల కార్యదర్శులు బూడి శ్రీను, చిట్టిబాబు, రమేష్ బాబు, అప్పలనరస, శేఖర్ బాబు, నీలాద్రి రాజబాబు, సింగిరెడ్డి విజయలక్ష్మి, జిల్లా కౌన్సిలర్స్ మిరియాల సత్యవతి, దాసరి పైడిమల్లి, మిరియాల రమేష్ బాబు, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, ఏపీ ఐఐ సీ బోర్డు డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, పి. ఎం సి శ్రీనివాసరావు ప్రధానోపాధ్యాయులు, కె ప్రమీలారాణి , ఎస్ రమేష్ బాబు, డి శ్రీనివాస్, లక్ష్మమ్మ, సత్యవేణి, నాగసుశీల, అన్ని పాఠశాలల నుండి పాల్గొన్నారు..

# జ్ఞానజ్యోతి శిక్షణలో అంశాలు అమలు చేయాలి.

## -సిడిపిఓ క్రాంతి కుమారి



**రాజవొమ్మంగి, అగస్టు 24, ప్రభాతవార్త** జ్ఞాన జ్యోతి శిక్షణలో నేర్చుకొన్న అంశాలను అంగన్వాడీ కేంద్రాల పరిధిలో వినియోగిస్తూ అమలు చేయడం వల్ల చాలా ఉపయోగకరమని రాజవొమ్మంగి సిడిపిఓ క్రాంతి కుమారి అన్నారు. రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో సోమవారం అంగన్వాడీ వర్కర్స్ కు 5 వరోజు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం జరిగింది. లింగ నిర్ధారణ, ఆధార్ శీల, నవచేతన అంశాలపై డిఆర్పీలు శేఖర్ బాబు, పప్పుల సరస్వతి, కోటం సత్యనారాయణలు శిక్షణ ఇచ్చారు. అడ్డతీగల సి. డి.పి. ఓ క్రాంతికుమారి, గంగవరం సిడిపిఓ సుచరిత పాల్గొని పలు అంశాలను వివరించారు. ఈకార్యక్రమంలో సూపర్ వైజర్స్ ఎం. ఇ. ఓ లు కె. వి. వి. సత్యనారాయణదొర, టి. సూరయ్యరెడ్డి, హెచ్. ఎం. దూరిపల్లి శ్రీనివాస్, సి. ఆర్పీ. శ్రీనివాస్, వీరయ్యమ్మ, అమ్మిరాజు, 95 మంది వర్కర్స్ పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ లో రెండు అర్జీల స్వీకరణ



**కాట్రేనికోన ఆగస్టు 24 (ప్రభాతవార్త)** కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ఇది ప్రధాన భూమిక పోషిస్తుందని ఆయన కొనియాడారు. రెవెన్యూ , విద్యుత్ శాఖలకు సంబందించి రెండు అర్జీలు వచ్చినట్టు ఎంపీడీఓ పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు పూర్తి బాధ్యత వహిస్తూ తమ శాఖలకు సంబందించిన అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చూపాలని సూచించారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం ఎస్సై సత్యనారాయణ, వేణు దుర్గాభవాని,మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps